1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 6
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఆగస్టు 2019





- ★'గిడుగు' తుది విన్నపం
- ★మానవతా విలువలు–మాతృభాషలు
- ★దేశభాషల్లో తీర్పులు
- ★జోగిని మంజమ్మ ఆత్మకథ–ప్రారంభం



తెలుగును కాపాడుకోవడం ప్రజలందరి అవసరం, బాధ్యత





ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం - భారతీయ భాషా సంస్థ

(మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఉన్నత విద్యాశాఖ, భారత ప్రభుత్వం)
మానస గంగోత్రి, మైసూరు - 570006

ప్రాచీన తెలుగు కేంద్రం కార్యాలయ ప్రారంభోత్సవం

భారతీయ భాషా సంస్థ, మైసూరు స్వర్ణోత్సవాల్ని ప్రారంభించడానికి 13.07.2019 ఉదయం 10 గం.లకు భారతీయ భాషా సంస్థ కార్యాలయానికి భారత ఉపరాష్ట్రపతి మాన్యశ్రీ గౌరవనీయులు శ్రీ ఎం. వెంకయ్య నాయుడుగారు విచ్చేశారు. ఆ సందర్భంగా 28.11.2018 న భారతీయ భాషా సంస్థలో ప్రారంభమైన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి కేటాయించిన ప్రత్యేక కార్యాలయాన్ని ఉపరాష్ట్రపతిగారు ప్రారంభించారు. ఇందులో భారతీయ భాషా సంస్థ (సిఐఐఎల్) సంచాలకులు ఆచార్య డి.జి. రావుగారు కూడా పాల్గొన్నారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య డి. మునిరత్నం నాయుడుగారు గత ఆరు నెలలుగా కేంద్రం పక్షాన నిర్వహించిన కార్యక్రమాల వివరాల్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉపరాష్ట్రపతిగారికి వివరించారు. కేంద్రంలో పనిచేస్తున్న విద్యాత్మక సిబ్బంది చేపట్టిన అంతర యోజనాల్ని (ఇంటర్నల్ ప్రాజెక్టుల్ని), బాహ్య యోజనల్ని (ఎక్స్టర్నల్ ప్రాజెక్టుల్ని) గురించి తెలిపారు. ఈ విషయాల్ని ఎంతో శ్రద్ధగావిన్న ఉపరాష్ట్రపతి కేంద్ర సిబ్బందిని అభినందిస్తూ, మరింత మెరుగ్గా పని చేయాలని ప్రోత్సహించారు. భారతీయ భాషా సంస్థ ప్రచురణల విభాగం, నేషనల్ ట్రాన్స్ లేషన్ మిషన్, భరద్వాణి, స్కీమ్ ఫర్ ప్రొటెక్షన్ అండ్ ప్రిసర్వేషన్ ఆఫ్ ఎన్డేంజర్డ్ లాంగ్వేషన్, ప్రాంతీయ భాషా కేంద్రాలు, శాస్త్రీయ కన్నడ అత్యున్నత అధ్యయన కేంద్రం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం మొదలైన విభాగాలు ఏర్పాటు చేసిన వస్తు, చిత్ర, పుస్తక ప్రదర్శనశాలలను సందర్శించి, వివరాలను తెలుసుకున్నారు.

భారతీయ భాషా కేంద్రం స్వర్ణోత్స ప్రారంభ సమావేశం 13.07.2019 ఉదయం 10.15 గం.లకు భారతీయ భాషా సంస్థ సంచాలకులు ఆచార్య డి.జి. రావు స్వాగతోపన్యాసంతో మొదలైంది. ఆయన తన స్వాగతోపన్యాసంలో గత యాభై ఏళ్లలో భారతీయ భాషా సంస్థ సాధించిన విజయాలను స్థూలంగా ప్రస్తావించడమైంది. మైసూరు మేయర్ శ్రీమతి పుష్పలతా జగన్నాథం, మైసూర్ పార్లమెంటు సభ్యులు ప్రతాప్ సింహ అతిథులుగా సభలో పాల్గొన్నారు.

ముఖ్య అతిథి గౌరవనీయులు శ్రీ ఎం. వెంకయ్యనాయుడుగారు స్వర్ణోత్సవ ప్రారంభోపన్యాసం చేస్తూ - మాతృభాష ఆవశ్యకతను వివరిస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి మాతృభాషా బోధనకు తగిన ప్రాముఖ్యతను ఇవ్వాలనీ, స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరూ ప్రజలతో స్థానిక మాతృభాషలోనే కార్యాలయ విధులు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా న్యాయస్థానాల్లో సైతం ఆయా భాషల్లోనే వ్యాజ్యాల వాదోపవాదాలు జరిపితే, ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ మాతృభాషలోనే తమ పిల్లలను ప్రాథమిక స్థాయి వరకు చదివించడానికి ప్రోత్సహించాలని, ఇంట్లో తప్పనిసరిగా వారివారి మాతృభాషల్లోనే మాట్లాడాలన్నారు. భారతదేశంలో ఈనాడు ఉన్నత పదవుల్లో ఉన్న రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు తమతమ మాతృభాషల్లోనే చదువుకుని పైస్థాయికి ఎదిగారని సోదాహరణంగా వివరించారు.

భారతీయ భాషా సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా ముద్రించిన వాటిలో 25 గ్రంథాలను ఆవిష్కరించారు. అందులో దక్షిణ ప్రాంతీయ భాషా కేంద్రం ముద్రించిన తెలుగు కోర్సు ఇంటర్మీడియట్, అడ్వాన్స్డ్ కోర్సు పుస్తకాలు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ముద్రించిన "తెలుగువారి శాసనాలు" కూడా ఉన్నాయి. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం తెలుగు పరిశోధన పత్రిక "తెలుగు సిరి" (అర్ధవార్షిక పత్రిక) తొలి సంచికను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. ప్రతివ్యక్తి తమ తల్లిదండ్రులు, జన్మభూమి, మాతృభాష, దేశం, గురువుల్ని జీవితాంతం గుర్తు పెట్టుకోవాల్సిన ఐదు విషయాలని ఆయన ఉద్వేగభరితంగా చేసిన ప్రసంగం సభికుల్ని అమితంగా ఆకట్టుకుంది. భారత ప్రభుత్వ మానవవనరుల అభివృద్ధి ఉన్నతవిద్యా మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ సిన్హా వందన సమర్పణ చేశారు.

- ఆచార్య డి.మునిరత్నం నాయుడు, ప్రాజెక్టు డైరెక్టర్, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం మైసూర్. సెల్-9490469671


◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి



ఆగస్టు 2019

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

లోపలి పుటలలో....

రేఖాచిత్రాలు
పావులూరి చిదంబరేశ్వరరావు

కంప్యూటరీకరణ
లంకె జనార్దన్

'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

చందా వివరాలు

	వ్యక్తులకు	సంస్థలకు	విదేశీయులకు
శాశ్వత చందా :	రూ.5000	రూ.7500	--
5 సంII :	రూ.1000	రూ.1500	150 డాలర్లు
3 సంII :	రూ. 700	రూ.1000	75 డాలర్లు
1 సంII :	రూ. 240	రూ. 400	25 డాలర్లు

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
AMMA NUDI - AXIS BANK, TENALI
అక్కౌంట్ నెం. **915020010550189**
IFSC Code : UTIB0000556
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

డా।। సామల లక్ష్మణబాబు, ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.

చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

'అమ్మనుడి' ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది
నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.**



2019 ఆగస్టు 29న గిడుగు రామమూర్తి జయంతి - తెలుగు భాషాదినోత్సవం పిలుపు

తెలుగు రాష్ట్రాల మనుగడకు
అభివృద్ధికి కీలకం
తెలుగులో పాలన
తెలుగులో బోధన

ప్రభుత్వాలు బాధ్యత వహించాలి.
ప్రజలు ఉద్యమిస్తూనే ఉండాలి.

తెలుగుభాషా దినోత్సవ లక్ష్యమూ,
కార్యక్రమమూ ఇదే.
నిరంతర జాగరూకతతోనే స్వాతంత్ర్యాన్ని,
ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం.

తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఎక్కడ ఉన్నా
తెలుగువారు ఈ లక్ష్యంతో ముందుకు సాగాలి.

మీకు తోచిన విధంగా నిర్వహించండి
సభలు, ఊరేగింపులు,
ప్రభుత్వానికి విన్నపాలు
పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో
ప్రచారం...

తెలుగు భాషోద్యమ సమాఖ్య
వివరాలకు : 9848016136 / 9393015584

సంపుటి : 5 సంచిక : 6
అమ్మనుడి
ఆగస్టు 2019

సంపాదక హృదయం

తెలుగును కాపాడుకోవడం ప్రజలందరి అవసరం, బాధ్యత

2004 లో తమిళానికి ప్రాచీన విశిష్ట భాషా ప్రతిపత్తినిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పుడు తెలుగు గుండెలు బాధతో మూలిగి, గొంతు విప్పాయి. అది ఒక భావోద్వేగ అంశంగా మారడంతో, అన్ని రాజకీయ పార్టీలూ కదిలి తెలుగుకు కూడా ప్రాచీన భాష హోదా రావలసిందేనని ఉద్యమిస్తున్న వారితో గొంతు కలిపాయి. ప్రజాదరణ కోల్పోతామన్న భయం తప్ప వారికి తెలుగుపట్ల బాధ్యతా ప్రేమా లేవన్న సంగతి తెలిసిందే. అదే సమయంలో భావోద్వేగాలకు దూరంగా హేతువాదంతోనో, శాస్త్రీయ దృక్పథంతోనో వాదించదలచుకొన్న కొందరు తెలుగు పండితులు, ఉపాధ్యాయులు, రచయితల సంఘీయులు అసలు 'ప్రాచీన భాష ఏమిటి? ఆ ఆలోచనే తగదు' అని వాదిస్తూ భాషను ఆధునిక భాషగా అభివృద్ధి చేసుకొంటూ పాలనా బోధనా రంగాల్లో ముందుకు సాగిపోవడమే మన కర్తవ్యం అని స్పష్టంచేశారు. అయితే – ఆత్మన్యూనతా భావంతో, తమను తామే తక్కువగా చూసుకొంటూ ఒక భాషాజాతి భావనను కోల్పోతున్న దశలో – తెలుగు భాష కూడా ప్రాచీనమని, ఆ మాటకొస్తే తెలుగే ప్రాచీనమని గొంతు విప్పిన వారి పట్ల ప్రజలు కూడా ఆసక్తి పెంచుకొన్నారు. ఇదంతా తెలుగుజాతిలో స్వాభిమానాన్ని పెంచడానికి ఎంతో కొంత తోడ్పడగలదని భావించిన వారెందరో ఉన్నారు. అంతకు రెండేళ్లక్రితమే మొదలైన తెలుగు భాషోద్యమ సమాఖ్య కూడా ఈ సందర్భాన్ని అటువంటి ఉద్దేశంతోనే ప్రోత్సహించింది. జాతిహితం దృష్ట్యా ఇటువంటి ధోరణి తెలుగుభాషాభివృద్ధికి ప్రోత్సాహకరమేగాని, ప్రతిబంధకం కాదని తలచింది. అందరితో కలిసి పనిచేసింది. 'అమ్మనుడి' పత్రికకు తొలి రూపమైన 'నడుస్తున్న చరిత్ర' ఈ విషయంలో చిరస్మరణీయమైన పాత్ర వహించింది. అదే సమయంలో నాటి నుంచి నేటి వరకూ శాస్త్రీయ ఆలోచనా ధోరణులకు, పాలనా బోధనా రంగాల్లో తెలుగు అభివృద్ధికై రాజీలేని ధోరణిని చేపట్టి కృషి చేస్తూనే ఉంది. తెలుగు భాషోద్యమకారులతో కలిసి ఒక పత్రికగా ముందుకు సాగుతూనే ఉంది.

ప్రతి తెలుగు వ్యక్తికీ తెలుగు కోసం తనకు తోచిన పద్ధతిలో ఉద్యమించే హక్కు సహజంగానే ఉంటుంది. వ్యక్తులుగానూ, సంఘాలు పెట్టుకొనీ పని చేసుకోవచ్చు. కొన్ని రచయితల సంఘాలు, విద్యార్థి ఉపాధ్యాయ సంఘాలు భాషోద్యమ అంశాలను గురించి పట్టించుకోకుండా తమ రంగంలో తాము పనిచేస్తున్నాయి. అది వారి ఇష్టం. వారి అవగాహనను బట్టి, పని పరిమితులను బట్టీ ఉంటుంది. తెలుగు భాషోద్యమ సమాఖ్య – 2002లో శ్రీకాకుళంలో నిర్వహించిన భాషోద్యమ సమాలోచనా శిబిరం ఆలోచనలకూ నిర్ణయాలకూ అనుగుణంగా 2003 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా స్థాపించబడి, పనిచేస్తున్నది. ప్రభుత్వానికి సంబంధించి తెలుగు రక్షణ, అభివృద్ధి కోసం – శాస్త్రీయమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్నది.

సమాఖ్య చేస్తున్న కృషి, సాధించిన అనేక విజయాలు అందరికీ తెలిసినవే. తెలుగుకు ఒక మంత్రిత్వశాఖను సాధించడం, తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్థాపిస్తూ ప్రభుత్వ నిర్ణయం వంటి అంశాలు కీలకం. నిరంతరం సమాఖ్య చేస్తున్న కృషి చారిత్రాత్మకంగా నిలిచింది.

ఇంతకు ముందే మనవి చేసినట్లు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోను, ఉపాధ్యాయ, విద్యార్థిరంగాల్లోను, ఇతర ప్రజాహిత రంగాలలోనూ, సామాజిక రాజకీయ సంస్థల్లోనూ పనిచేసే తెలుగు ప్రజలందరికీ జాతి అభివృద్ధికోసం భాషను రక్షించుకొనేందుకు కృషి చేయాల్సిన బాధ్యత, అవసరమూ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలు ఏర్పడింది – తెలుగు ప్రజలు తమ భాషలో తాము పరిపాలించుకోవడం అనే ప్రజాస్వామ్య, సామాజిక హక్కును, తమ భాషలో తాము అభివృద్ధి చెందేందుకు విద్య, తదితర రంగాలన్నింటిలో తమ భాషను వినియోగించుకోవడం అనే మౌలిక హక్కు కోసమూ అని మనం మరువరాదు. జాతి స్వాభిమానంతో ఎదగడానికి ఇవి కీలకాంశాలు. వీటిని పట్టించుకోకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. అనేక సామాజిక, చారిత్రక అంశాల కారణంగా ప్రజల్లో ఏర్పడిన నిర్లిప్తతను, ఆత్మ విస్మృతిని పోగొట్టి చైతన్యవంతులను చేస్తూ, ఉద్యమాలు చేస్తుంటేనే ప్రభుత్వాలు సరియైన దారిలోకొస్తాయి. ప్రజలను మోసగించడంలో చతుర్విధోపాయా లనూ ప్రభుత్వాలు ప్రయోగించడం మన దౌర్భాగ్యం. 'ప్రజాస్వామ్యం'లో ప్రభుత్వాలు ప్రజాహితంగా పనిచేయడం లేదంటే దానికి ప్రజల చేతగానితనమే కారణం. ప్రజల్ని మరింతగా నిర్వీర్యం చేస్తూ స్వార్థంతో పబ్బం గడుపుకొంటున్న రాజకీయ వేత్తలను, ప్రభుత్వాలను ప్రజా ఉద్యమాలు మాత్రమే దారిలో పెట్టగలవు. అందువల్ల భాషకు విద్యకు సంబంధించిన అంశాల గురించి అన్ని రంగాల్లో పనిచేస్తున్న వారందరూ పట్టించుకోవాలని విన్నవిస్తున్నాము.

ఈ ఆధునిక యుగంలో ప్రజాభాషల పాత్ర కేవలం సాహిత్య సృజనకి పరిమితం చేసి, ఒక భాషగా మాత్రమే నేర్చుకొంటూ దానిని అన్ని ఆధునిక రంగాలలో వినియోగానికి దూరంగా ఉంచి, ఆ పనినంతా ఇంగ్లీషుకూ, మరోభాషకూ వదిలివేయడం – మన భాషకూ, భాషా జాతికీ ప్రమాదం. బ్రతుకు తెరువుకూ, అభివృద్ధికీ ఉపయోగించని భాష–అది ఎంత చరిత్రను కలిగి వున్నా క్రమంగా నశించిపోతుంది. ఒక భాషగా మాత్రమే తెలుగును పాఠశాలల్లో నేర్పుతామని అంటూ బోధనా మాధ్యమంగా తెలుగును పూర్తిగా తొలగించినందువల్ల తెలుగు అభివృద్ధి కాదు. భాషను బోధించే ఉద్యోగాలూ ఎక్కువ కాలం ఉండవు. ఇదే విధంగా రచయితల వికాసం కూడా కుంటుపడుతుంది.

ఈ పరిస్థితుల్లో ఇప్పుడిప్పుడే కొన్ని రచయితల సంఘాలు భాషకు సంబంధించిన నిక్కచ్చులతో (డిమాండ్లతో) మాట్లాడుతున్నాయి. ఇది ఎంతో సంతోషించదగిన పరిణామం. దీన్ని అన్ని ప్రజాహిత సంఘాలవారూ గమనించి, ఈ విషయంలో తాము కూడా చొరవ తీసుకోవాలి.

తెలుగు భాషా రక్షణ – కేవలం కవిత్వమో, కథలో వ్రాయడానికీ, సాంస్కృతిక అంశాలకూ మాత్రమే పరిమితం అనుకొంటే, కళ్లు మూసుకొని వెలుగును చూడడానికి తిరస్కరించినట్లే. తమ నాశనాన్ని కోరి తెచ్చుకొన్నట్లే. తెలుగు భాషా రక్షణ ఇప్పుడు ప్రజలందరి అవసరం. ఆ అవసరాన్ని గుర్తించి అందుకోసం ముందడుగు వేయడం ప్రజాహిత సంఘాలందరి బాధ్యత. దీన్ని గుర్తించాలి.

తేదీ : 31–7–2019

సామల రమేష్ బాబు

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

ఇకపై భారతీయ భాషలలో సుప్రీంకోర్టు తీర్పులు - ప్రాథమిక పరిశీలన

జూలై 3న ఎన్‌డిటివిలో వచ్చిన ఒక వార్త తెలుగు భాషాభిమానుల్లో ఉత్తేజాన్నిచ్చింది. ఇకపై సుప్రీంకోర్టు తీర్పులు తెలుగు, ఇతర భారతీయ భాషల్లో అందుబాటులోకి వస్తాయన్నది ఈ వార్త సారాంశం. వివరాలలోకి వెళితే, ఆ వార్త ప్రకారం ఈ అంశం చాలా రోజులుగా చర్చ లో ఉంది. గత ఏడాది నవంబరులో జస్టిస్ రంజన్ గొగోయ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్ట్ తీర్పులను ప్రజలు తమ మాతృభాషలో చదువుకోవాలన్నది తన అభిలాష అని అప్పట్లో చెప్పారు.

ఈ కొత్త పరిణామం వలన సుప్రీంకోర్టు తీర్పులను సుప్రీంకోర్టు వలగూడులో హిందీ, తెలుగు, అస్సామీయ, మరాఠీ, కన్నడ, ఒడియా, తమిళం మొత్తం 7 భాషలలో ఉంచనున్నారు.

ఇవి తీర్పులకు అనువాదాలు మాత్రమే. సుప్రీంకోర్టులో జరిగే వాదోపవాదాలు ఆంగ్లంలోనే జరుగుతాయి. తీర్పు వెలువడిన తరువాత సుప్రీంకోర్టు వారు రూపొందించుకున్న ఒక సాఫ్ట్వేర్ ద్వారా ఆంగ్లం నుండి వివిధ భాషల్లోకి తీర్పులను అనువదించి, ఏ భాష న్యాయమూర్తి ఆ భాష తీర్పును పరిశీలించి నిర్ధారించిన తరువాత ఆ తీర్పు అనువాదాన్ని సుప్రీంకోర్టు వలగూడులోకి ఎక్కిస్తారు. సుప్రీంకోర్టు వలగూడు లోని "వెర్నాక్యులర్ జడ్జిమెంట్స్" శీర్షిక కింద ఈ అనువాదాలను ఒక పట్టిక లో ప్రజల ముందు ఉంచుతారు.

ఈ వార్త వెలువడినప్పుడు మొత్తం ఆరు భాషల్లో ఉంటాయని ప్రకటించారు. తమిళంలో తీర్పులు ఉంటాయని ప్రకటించలేదు.వార్త అందిన వెంటనే తమిళనాడు రాజకీయ నాయకుడు డీఎంకే పార్టీ అధినేత స్టాలిన్ భారతీయ భాషల్లో తీర్పు వెలువరించడాన్ని సమర్థిస్తూ తమిళంలో ఉండకపోవటం శోచనీయమని ప్రకటించాడు. తమిళ భాషను పక్కన పెట్టడాన్ని ఆయన నిరసిస్తూ తమిళం ఉపఖండంలోనే అతి ప్రాచీన భాష అని, సుప్రీంకోర్టు తమిళ భాషను గౌరవించకపోవడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళుల మనోభావాలను దెబ్బతీస్తుందని ఆయన అన్నారు.

జూలై 13న దేశ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సుప్రీంకోర్టు తీర్పులే కాక హైకోర్టు, కిందిస్థాయి కోర్టుల తీర్పులు కూడా దేశ భాషలలోనే ఉండాలని కోరారు. అక్టోబర్ 2017 లో కేరళ హైకోర్టు వజ్రోత్సవాల సందర్భంగా రాష్ట్రపతి అప్పట్లో న్యాయవ్యవస్థ భారతీయ భాషల్లో అందుబాటులోకి రావాలన్న విషయాన్ని సూచించినట్టు తెలిపారు.

కోర్టుల తీర్పులు ప్రజల భాషలో కాకుండా సంక్లిష్టమైన న్యాయ



పదజాలంతో కూడుకున్న ఆంగ్లంలో ఉండటంవల్ల న్యాయవ్యవస్థ కాలక్రమంలో మామూలు మనుషులకు అర్థం కాని విధంగా, ఆకారంలో పెద్దదిగా తయారై కూర్చుందని, న్యాయవ్యవస్థ ప్రజలకు ఉపయోగపడాలంటే సరళంగా ప్రజలకు అర్థమయ్యే దేశీయ భాషల్లో ఉండాలని రాష్ట్రపతి అన్నారు. న్యాయాన్ని ప్రజల వద్దకు తీసుకు వెళ్లడం అంటే ఎక్కువ కోర్టులు కట్టడము, ఎక్కువమంది న్యాయవాదులను తయారుచేయడం మాత్రమే కాదని, ప్రజల భాషలో ప్రజలకు అర్థమయ్యే విధంగా న్యాయవ్యవస్థ తిరిగి క్షేత్ర స్థాయి నుండి తయారవ్వాలని ఆయన అన్నారు. కోర్టు వ్యవహారాలు ప్రజల భాషలోకి వస్తే వాటిలోని సంక్లిష్టత తగ్గి, వాయిదాల పద్ధతి కనుమరుగై, ఖర్చు తగ్గి, అందరికీ న్యాయం అందుతుంది అని ఆయన అన్నారు.

జూలై 17న సుప్రీంకోర్టు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దేశ భాషల్లో తీర్పులు సుప్రీంకోర్టు వలగూడులో లో చేర్చనున్నట్టు అధికారికంగా తెలిపారు. జస్టిస్ ఎస్ఏ బాబ్డే భారతీయ భాషల్లో ఉన్న తీర్పుల అనువాదాలను విడుదల చేశారు. మొదటి ప్రతిని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అందుకున్నారు.

ఆ రోజు మొదలు మెల్లిగా తీర్పులను సుప్రీం కోర్ట్ యొక్క ఎలక్ట్రానిక్ సాఫ్ట్వేర్ విభాగం వారు చేర్చుతున్నారు. జూలై 27వ తేదీ నాటికి మొత్తం 106 తీర్పులు భారతీయ భాషల్లో అందుబాటులోకి రాగా వాటిలో సింహ భాగం హిందీలో ఉన్నాయి. తక్కినవి :

హిందీ -	66	మరాఠీ -	14	కన్నడ -	12
తెలుగు -	9	అస్సామీయా -	6	బాంగ్లా -	3
తమిళం -	3	ఒడియా -	2	ఉర్దూ -	1

ఈ ప్రకటనతో పాటు జస్టిస్ రంజన్ గొగోయ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎలక్ట్రానిక్ సాఫ్ట్వేర్ విభాగం రూపొందించిన భారతీయ భాషల అనువాద సాఫ్ట్వేర్ కూడా త్వరలో ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సాఫ్ట్వేర్ ఉపయోగించి న్యాయమూర్తులు తమ తీర్పులను అనువదించి ఆపైన నిర్ధారించి వెబ్‌సైట్‌కు పంపిస్తారు. అందు వలన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రాతపూర్వకంగా

ఇచ్చే ఆంగ్ల తీర్పులు అదే రోజు సుప్రీంకోర్టు వలగూడులో వెలువడగా, భారతీయ భాషల తీర్పులు ఒక వారం తర్వాత మాత్రమే వలగూడులో కనిపిస్తాయి.

మరింత కసరత్తు చేస్తే ఈ సాఫ్ట్వేర్ ఉపయోగించి హైకోర్టు మరియు కిందిస్థాయి న్యాయస్థానాల్లో తీర్పు ప్రకటించిన 24 నుండి 36 గంటల్లో తీర్పుల అనువాదాలను ప్రజలకు అందుబాటులోకి తేవచ్చని గోగోయ్ అన్నారు.

ఈ వార్త వచ్చినవెంటనే సోషల్ మీడియాలో ఈ వార్తకు సంబంధించి పలు ఆసక్తికరమైన స్పందనలు, విమర్శలు వినవచ్చాయి. వాటిలో కొన్ని: "భారతీయులు అందరూ ఆంగ్లం మాట్లాడ లేరు. ఆంగ్లం అర్థం చేసుకునే వారికి కూడా భారతీయ న్యాయ వ్యవస్థలో వాడే న్యాయపరమైన పరిభాషలోని కొన్ని పదాలు అసలు అర్థం కావు. అలాంటి సందర్భంలో ఈ మార్పు ఆహ్వానించదగ్గది.

"ఇప్పటికే రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్ర హైకోర్టుల్లో హిందీ భాషను విరివిగా ఉపయోగిస్తున్నారు.

కానీ చదువులో ముందంజలో ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో ఈ పోకడ లేదు. తీర్పులు కాదు, కోర్టు వ్యవహారం మొత్తం భారతీయ భాషల్లో అందుబాటులోకి వస్తేనే న్యాయవ్యవస్థ సామాన్యుడికి అందుబాటులోకి వచ్చినట్టు."

"సుప్రీంకోర్టు స్థాయిలో కాదు, కింది న్యాయస్థానాల్లో భారతీయ భాషల్లో కోర్టు వ్యవహారాలు అందుబాటులోకి వస్తే సామాన్యుడికి న్యాయం అందుతుంది. పైనుంచి కిందికి కాదు క్షేత్ర స్థాయి నుండి పైకి ఈ పోకడ పాకాలి."

"న్యాయాన్ని ఒక హక్కుగా ప్రజలు భావిస్తే, వారి భాషలోనే న్యాయం కావాలని అడుగుతారు. ఆ స్పృహ మన వాళ్ళలో లేదు. అయితే ఆ స్పృహను రప్పించేందుకు అత్యుత్తమ న్యాయస్థానం పైనుంచి కిందకి అనే నియంతృత్వ విధానాన్ని అవలంబించాల్సి రావటం మన దురదృష్టం."

"ఈ సుప్రీంకోర్టు తీర్పుల అనువాదాలు ఎంతవరకు ప్రభావ వంతంగా ఉంటాయో చెప్పలేము. న్యాయవ్యవస్థలో వాడే పరిభాష పదజాలం లాటిన్ నుండి అరువు తెచ్చుకున్నది. అందులో చాలా పదాలకు భారతీయ భాషల్లో సమానార్థక పదాలుగానీ వాక్యాలు గాని దొరకకపోవచ్చు. ఈ ప్రాజెక్టుని పూర్తిస్థాయిలో చేపట్టకముందే సుప్రీంకోర్టు పారిభాషిక పదకోశాలను స్థిరపరచుకొని ముందుకు వెళితే మంచిది. సాఫ్ట్వేర్ను పూర్తిస్థాయిలో పరీక్షించారా లేదా అన్నది మనకు తెలియదు. అలాంటి పరీక్షించబడని సాఫ్ట్వేర్ని వాడటం మంచిది కాదు."

"ఛత్తీస్గఢ్ లాంటి రాష్ట్రాల్లో ఈ విధానం మరింత క్లిష్టమైంది. అక్కడి హైకోర్టు తీర్పులతోపాటు కోర్టు వ్యవహారాలను హిందీ లోనే నడుపుతోంది. కానీ అక్కడి ప్రజలు గోండీ లేదా ఛత్తీస్గఢీ భాషల్లో మాత్రమే మాట్లాడగలరు. వారికి కోర్టు భాష హిందీలో ఉన్నా ఇంగ్లీష్ లో ఉన్నా పెద్ద తేడా లేదు. ఇక్కడ ప్రధానంగా నివసించే ఆదివాసీలు ముఖ్యంగా బస్తర్ ప్రాంతంలో ఉండేవారు అటు మావోయిస్టులతో నిత్యం పోరుచేస్తుంటారు, ఇటు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ, కోర్టులు పరాయి భాషయిన హిందీలో వారికి తెలియని కేసుల్లో ఆదివాసీలను ఇరికిస్తూ ఉంటారు."

"కోర్టుల్లో న్యాయవాదుల మధ్య ఇంగ్లీషులో మాట్లాడే న్యాయ వాదులు మెరుగైన వారనే అపోహ ప్రబలంగా ఉంది.

భారతీయ భాషల్లో వాదన చేసే న్యాయవాదుల మీద చిన్న చూపు ఉంది, ఇలాంటి న్యూనతాభావం పోయేవరకు న్యాయ వ్యవస్థలో మార్పులు చూడలేము."

"1976లో తమిళనాడులో కిందిస్థాయి కోర్టుల్లో తమిళ భాష తప్పనిసరి చేశారు. కానీ న్యాయవాదులు మాత్రం ఇంగ్లీష్ లోనే అత్యధిక కేసులను వాదిస్తున్నారు. ఇంగ్లీష్ వాదనిదే కేసును బలంగా న్యాయవాది వాదించడం లేదని క్లయింట్లు భావిస్తున్నారని న్యాయ వాదులు వాపోతున్నారు. ఈ పోకడ చెన్నైలో స్పష్టంగా కనిపిస్తుంది. హైకోర్టు ఆవరణలోని సివిల్ కోర్టులో వాదనలు తమిళంలో కాకుండా ఇంగ్లీష్ లోనే జరుగుతున్నాయి."

"తమిళనాడు ప్రభుత్వం అధికార భాషా చట్టం ప్రకారం హైకోర్టు కిందిస్థాయి కోర్టుల అన్నిట్లో తమిళం తప్పనిసరి భాష. తీర్పులు కూడా తమిళ భాషలోనే వెలువరించాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనే ఆంగ్లాన్ని అనుమతిస్తారు. అయితే ఆ కొన్ని అన్ని అయింది."

"2006లో లో అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి మద్రాసు హైకోర్టులో వ్యవహార భాషగా తమిళాన్ని చేయాలని ప్రతి పాదించగా ఆ ప్రతిపాదనను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. సుప్రీం కోర్టు చెప్పిన కారణం ఏంటంటే హైకోర్టు అత్యున్నత న్యాయమూర్తి చాలాసార్లు బయట రాష్ట్రంలో నియమితులవుతారు, వారికి ఇబ్బంది కలగకుండా ఉండాలంటే హైకోర్టు వ్యవహార భాషగా ఇంగ్లీషే ఉండాలి."

"ఇంగ్లీష్లో మాట్లాడే న్యాయవాదికి భారతీయ భాషల్లో వాదన చేసే న్యాయవాదికి చాలా పెద్ద తేడా ఉంటుంది. భారతీయ భాషల్లో వాదన చేస్తే న్యాయవాదులను చులకనగా చూస్తున్నారని, ఆంగ్ల న్యాయవాదులకు ఇచ్చే ప్రాధాన్యత భారతీయ భాషల్లో వాదించే న్యాయవాదులకు దొరకట్లేదు అనేది యదార్థం."

"వెర్నాక్యులర్ అన్న పదం చాలా దురుద్దేశంతో కూడుకున్న పదం. బ్రిటిష్ సామ్రాజ్యవాదంలో బానిసల భాషలను వెర్నాక్యులార్ భాషలు అని అనేవారు. అలాగే ఆ బ్రిటిష్ వారసత్వంగా మన మధ్య మిగిలిన అత్యుత్తమ న్యాయస్థానం భారతీయ భాషలను వెర్నాక్యులర్ అనడం అసహనీయం."

ఇక – ఆంధ్రప్రదేశ్కు సంబంధించి 1974లో జి.ఒ.నెం.485 ప్రకారం జిల్లాస్థాయి వరకు కోర్టులు తెలుగులో తీర్పులివ్వడం జరగాలి. అప్పుడూ ఇప్పుడూ అడపాదడపా తెలుగులో తీర్పులు వస్తున్నా అవి లెక్కలోకి రావు. తెలుగు భాషోద్యమ సమాఖ్య 2018 ఫిబ్రవరి 18న విజయవాడలో జరిపిన సదస్సు తర్వాత కొంత కదలిక వచ్చినా, అదీ తాత్కాలికమే. ఆ సదస్సు ఈ అంశంపై ప్రభుత్వాలకు నిర్దిష్టమైన సూచనలు చేసింది. వాటిని ప్రభుత్వాలు పట్టించుకోలేదు.

ఏది ఏమైనా, ఇప్పుడు సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కేంద్రప్రభుత్వ బాధ్యులు కూడా ఈ అంశంపై ముందడుగు వేసి దారి చూపినందున – ఇక – ప్రజల భాషలో న్యాయస్థానాల తీర్పులు వెలువడే దిశగా మరింత ముందడుగు వేస్తాయని, తెలుగులో సాంకేతికతను నిర్దిష్టతను, సాధికారతను సాధించడంతో ఇది వేగవంతం కాగలదని ఆశిద్దాం.

గిడుగు దారి

గిడుగు వేంకట రామమూర్తిగారు గతించడానికి కొన్ని రోజుల ముందు
మద్రాసులో 'ప్రజామిత్ర' పత్రిక కార్యాలయంలో
పత్రికా రచయితల సమావేశములో చేసిన ప్రసంగ పాఠం.

తుది విన్నపము



నేడు సుదినం. మీవంటివారి దర్శనం కలిగింది. ప్రజామిత్ర పత్రికా సంపాదకులయిన శ్రీ రామబ్రహ్మంగారు నాయెడల దయగలవారు గనుక నేటి సాయంకాలం ఈ సభ ఏర్పరిచారు. తెలుగు సారస్వతమందూ తెలుగువారి విద్యాభివృద్ధియందూ అభిమానముగల పండితులకున్ను, కవులకున్ను, పత్రికాసంపాదకులకున్ను, నా కట్టకడపటి విన్నపము తెలియజేయడానికి అవకాశం కలుగజేశారు.

నా ఆరోగ్యం చెడిపోయినది. కాలేయంలో గుల్మ పుట్టినదిబీ చికిత్సకోసం చెన్నపట్టణం వచ్చాను. అట్టేకాలం జీవించగలనని తోచదు. జీవించి ఉన్నా చాలా కృశించిపోయి ఉన్నాను గనుక మును పటిలాగున మరి ఉపన్యాసాలు చేయలేను.

అందుచేత ఇదే నా కట్టకడపటి విన్నపమంటున్నాను. ఇంక జరుగవలసిన పని మీకు అప్పగిస్తున్నాను. మీరే సాగించవలెను.

ఇప్పుడు లోకంలో పత్రికలు చేస్తూ ఉండే పని సామాన్యమయినది కాదు. పత్రికాసంపాదకులు సామాన్యులు కారు. ప్రభుత్వవర్గాన్ని, మంత్రివర్గాన్ని, పరిపాలనా విధానాన్ని మార్చివేయగలశక్తి పత్రికలకున్ను, పత్రికాసంపాదకులకున్ను ఉన్నది. పత్రికలకు అదీ ఇదీ అని కాదు; అన్ని విషయాలతోను సంబంధముంటుంది. పత్రికా సంపాదకులు అన్ని విషయాల గురించిన్నీ వ్రాయగల సమర్థత, ప్రజ్ఞ గలవారు కాకపోయినా ఆయా విషయాలలో అనుభవముగల ప్రజ్ఞావంతులచేత సకల విషయాల గురించిన్నీ వ్రాయించి దేశంలో విద్య వ్యాపింపజేయగలరు.

ప్రజలలో విద్య వ్యాపింపచేయడమూ, ప్రజల ఆరోగ్యము కాపాడడమూ, ప్రజల సౌఖ్యము పోషించడమూ సంఘములోని పెద్దలు చేయవలసిన పని అంటే అదేమో ప్రజల నుద్ధరించడానికి చేయవలసిన ధర్మకార్యమని ఆలోచించకూడదు. భాగ్యవంతులయిన పెద్దలు తమ ఆరోగ్యం కాపాడుకోవలెనంటే ప్రజల ఆరోగ్యం కాపాడవలెను.

ప్రజల ఆరోగ్యం కాపాడకపోతే పెద్దలు ఎన్ని కట్టుదిట్టాలు చేసుకొన్నా అంటురోగాలు వారిని అంటక మానవు. వారి ఆరోగ్యం చెడక మానదు.

ఆవిధంగానే సంఘంలో నిరక్షరకుక్షులు ఎక్కువగా ఉన్నంత కాలము సంఘం వృద్ధిలోకి రాదు. సౌఖ్యమన్నది సంఘంలోని భాగ్యవంతులూ, పెద్దలూ, సామాన్య ప్రజలతో పాటు సమాంశులుగా అనుభవించవలసినదే కాని తామొక్కరే అనుభవించవలసినది కాదు. ప్రజలలో విద్య వ్యాపిస్తేకాని సంఘం వృద్ధిలోనికి రాదు

ఐతే, ప్రజలలో వ్యాపించవలసిన విద్య ఈ కాలానికి పనికిరాని ప్రాచీన కావ్యాలు వ్యాకరణాలు చదివించడం వల్ల రాదు. ఇంగ్లండులో కూలివాండ్లు కమ్మర్లు మొదలైనవాండ్లు షేక్స్పియర్, మిల్టన్ మొదలైన మహాకవుల గ్రంథాలు చదవమంటే చదువరు. "మాకు కడుపునిండా తిండి దొరికే మార్గం చెప్పండి. మా వృత్తులకు సంబంధించే విద్యలు మాకు నేర్పండి" అంటారు. అందుచేత, వాళ్ళకోసం ఇదివరకున్న విద్యావిధానమంతా మార్చవలసి వస్తున్నది. కర్మాగారాలున్న ప్రదేశాలకు విద్యాధికులు పోయి వాళ్ళకు తెలిసే భాషలో ఉపన్యాసాలిస్తూ, ఉపన్యాస విషయాలు చర్చిస్తూ ప్రజలకు జ్ఞానము, వివేకము కలుగజేస్తున్నారు.

రేడియో ప్రసంగాలవల్లను, పత్రికలవల్లను, పుస్తకాలవల్లను ప్రజలలో విద్య వ్యాపిస్తూ ఉన్నది. ఇంగ్లండు మొదలైన పాశ్చాత్య దేశాలలో కేవలం ప్రజలకోసం పెద్ద సారస్వతం పుట్టి వృద్ధి పొందుతూ ఉన్నది. అది అంతా ప్రజల భాషలోనే ఉంటుంది. ఆ విధంగానే మనదేశంలో కూడా ప్రజలలో విద్య వ్యాపించడానికి అనుకూలమైన గ్రంథాలు కావలెను. ప్రజలు తమ భాషలో వ్రాయడానికి చదవడానికి సమర్థులు కావలెను.

ప్రజలలో విద్య ఎక్కువగా వ్యాపింపజేయడానికీ, నవినాశయములకు అనుకూలంగా అందరిలోను హృదయపరివర్తనం కలుగజేయడానికి ఎక్కువగా తోడుపడేవి పత్రికలే; కనుక పత్రికాసంపాదకులకు నా విన్నపము తెలియజేస్తున్నాను.

సుమారు 30 సంవత్సరములపై వర్తమానాంధ్రభాషా ప్రయోజనము గురించి పాటుబడుతూ ఉన్నాను. వ్యావహారిక భాషా గౌరవమును నిలబెట్టడానికి నేను ప్రయత్నిస్తూ ఉంటే దానిని పడగొట్టడానికి ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు పనిచేస్తూ వచ్చారు..

మొదట నేనూ, నామిత్రుడు గురజాడ అప్పారావూ, మాకు తోడుగా మరి ఇద్దరు ముగ్గురు మాత్రమే ఈ ఉద్యమము ప్రారంభించాము. తక్కిన తెలుగువారందరూ మాకు ప్రతికూలంగా ఆంధ్ర సాహిత్య పరిషత్తువారితో కలిసి మా ఉద్యమాన్ని ఎదిరించినవారే.

ఆ కాలంలో ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ప్రతిష్ఠా గౌరవమూ, ప్రాభవమూ ఎక్కువగా ఉండడంవల్లనూ వ్యావహారిక భాషా ప్రయోజనము సరిగా బోధపడకపోవడంవల్లనూ ఆ పరిషత్తువారి అభిప్రాయము ననుసరించి తెలుగు దేశమందలి పెద్దలందరూ తీర్మా

నాలు చేసి గవర్నమెంటువారికి ఎక్కువగా ఒత్తిడి కలిగించి వాస్తవమైన దేశభాష బడిపిల్లలు అభ్యసించకుండా చేశారు.

అప్పుడు 'నిజమైన సంప్రదాయము' అనే పేరను చిన్న వ్యాసమొకటి రచించాను. అది శ్రీ వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రులగారు అచ్చు వేయించి ప్రకటించినారు. అందులో విద్యార్థులు చదువుకొనే గ్రంథాలన్నీ మన పూర్వులు వ్యావహారిక భాషలోనే రచించేవారని కొన్ని నిదర్శనాలు చూపించాను.

దేశంలో అందరూ మీ వాదానికి ప్రతికూలంగా ఒత్తిడి కలుగజేస్తూన్నారు. గనుక వ్యావహారిక భాషా ప్రయోజనం అంగీకరింపజాలమని గవర్నమెంటువారున్ను, యూనివర్సిటీ వారున్ను అనడం చేత, తెలుగుదేశమంతా తిరిగి నిజమైన సంప్రదాయం తెలియబరచి ప్రచారం సాగించాను.

పరవస్తు చిన్నయసూరి కావ్యభాషలో తన- నీతిచంద్రిక రచించి గద్యరచనకు కావ్యభాషా సంప్రదాయం తెచ్చి పెట్టక పూర్వము వ్యావహారిక భాషలోనే సకలవిధములైన గద్యరచనలు సాగుతూ ఉండేవని రుజువు చేయడానికి వ్యావహారికభాషలో రచించిన వ్రాత పుస్తకాలూ మొట్టమొదట అచ్చుపడ్డ పుస్తకాలూ కొన్ని సంపాదించి అవి పట్టుకొని తెలుగుదేశంలో ఉన్న కాలేజీలకు వెళ్ళి అక్కడి పండితులకూ ఉపాధ్యాయులకూ చూపించాను. చాలాచోట్ల సభలలో ఈ విషయమై ఉపన్యాసాలిచ్చాను.

1916వ సం!! నవంబరు 19వ తేదీని కొవ్వూరులో జరిగిన ఆంధ్ర సారస్వత మహాసభలో వందలకొలది తెలుగు పండితులూ కవులూ నా వాదమంగీకరించారు. 1919వ సం॥ ఫిబ్రవరి 28వ తేదీని రాజమహేంద్రవరమందు కీ॥శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారు అధ్యక్షులుగా వర్తమానాంధ్ర భాషాప్రవర్తక సమాజము స్థాపించుటకు ఏర్పాట్లు జరిగినవి.

కాని పంతులుగారు మరి మూడు మాసములకే పరమపదము పొందుటవల్ల వారి తోడ్పాటు సమాజమునకు లేకపోయినది. అయినా మా ఉద్యమం సాగకపోలేదు.

1919 సం:లోనే నితెలుగు పత్రిక ప్రకటించి అందులో వ్యావహారిక భాషాప్రయోజనం గురించి, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం గురించి, ఆంధ్రభాషా పరిణామము గురించి వ్యాసాలు రచించి ప్రకటించాను. అవి చాలామంది పండితులూ కవులూ చదివారు. క్రమక్రమముగా నా వాదము ఆమోదించేవారి సంఖ్య అధికమవుతూ వచ్చింది. పత్రికాసంపాదకులందరూ, తమ పత్రికలందు వాడుక భాషలో రచించిన వ్యాసాలకు కొంచెము కొంచెముగానైనా అవకాశం కలుగజేస్తూ వచ్చారు.

తుదకు 1926 సం॥ తణుకులో ఆంధ్ర సాహిత్య పరిషత్ సాంవత్సరికోత్సవము జరిగినప్పుడు సభలోని వారు అందరూ కాకపోయినా అనేకులు వ్యావహారికభాషా ప్రయోజనం అంగీకరించారు. దానితో పరిషత్తు పెద్దలు ఉపద్రవము జరిగిపోయినట్లుగా భయపడి అటు పైని జరిగే సాంవత్సరికోత్సవములలో అటువంటి తీర్మానాలు మరి కాకుండా ఉండేటట్లున్ను వ్యావహారికభాషా వాదులెవరూ తమ పరిషత్తులో సభ్యులుగా చేరకుండా ఉండేటట్లున్ను కట్టుదిట్టాలు చేసుకొన్నారు.

దేశంలో అంతకంతకు వ్యావహారికభాషావాదము అంగీకరించినవారి సంఖ్య ఎక్కువగుట చేతను ఆంధ్రసాహిత్య పరిషత్తువారి ఉద్దేశములను ఆమోదించేవారి సంఖ్య తక్కువగుటచేతను ఆ పరిషత్తు క్షీణించినది; పరిషత్ పత్రిక మరి కనపడదు. నా వాదమును పూర్తిగా ఆమోదించిన నా మిత్రులు 'నవ్యసాహిత్య పరిషత్తు' స్థాపించి ప్రతిభ అనే పత్రిక ప్రకటిస్తున్నారు. ఆ పత్రికే కాదు, అన్ని పత్రికలున్నూ వ్యావహారిక భాషా ప్రయోజనమును అంగీకరించినవి.

వందలకొలది కవులూ పండితులూ తమ వాడుకభాషలో రచన సాగిస్తున్నారు. ఇంతమట్టుకైనా నా కృషి ఫలించినందుకు నేను కృతార్థుడనైనానని సంతోషిస్తున్నాను. కాని బడులలోను కాలేజీలలోను ప్రభుత్వము వారున్ను విశ్వవిద్యాలయములవారున్ను వ్యావహారికభాషాప్రయోజనము అంగీకరించేవరకు నా వాదము పూర్తిగా నెగ్గినదని నేను భావించలేను. 'దేశంలో అందరున్ను మీకు ప్రతికూలంగా ఉన్నారు. గనుక వ్యావహారిక భాషా ప్రయోజనము మేము అంగీకరించలే' మని గదా ప్రభుత్వమువారున్ను విశ్వవిద్యాలయము వారున్ను 25 సంవత్సరాల క్రిందట అన్నారు.

ఈ 25 సంవత్సరాలలో ఇంతమట్టుకు పరివర్తనం జరిగింది గనుక ఇకనైనా బడులలోను కాలేజీలలోను వ్యావహారికభాష మూలంగా విద్య సాగేటట్టు చూడవలసి ఉన్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయము వారు నాకు కళాప్రపూర్ణ బిరుదు అనుగ్రహించడం నా గ్రాంథిక భాషా పాండిత్యానికి కాదు గదా! నా వ్యావహారికభాషావాదమునే ఆమోదించే ఈ గౌరవము నాకు ప్రసాదించారనక తప్పదు.

నన్ను గౌరవించినందుకు నేను కృతజ్ఞుడనే కాని వ్యావహారిక భాషా ప్రయోజనము ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు అంగీకరించి ఆచరణలో పెట్టిన దాకా నేను పూర్తిగా కృతకృత్యుణ్ణయినానని సంతోషించలేను.

ఈ నడుమ విశ్వవిద్యాలయమువారి తెలుగు పరీక్షలలో వ్యాస రచనకు ఒక విషయంగా రేడియో ప్రసంగములవంటి ప్రసంగ మొకటి వాడుక భాషలో విద్యార్థులు రచించేటట్టు ఏర్పరచవలసినదని ఎకడమిక్ కౌన్సిలులో ఒకరు తీర్మానం ప్రవేశపెడితే అది బోర్డు ఆఫ్ స్టడీస్ వారి అభిప్రా యానికి పంపించాలన్నారు.

ప్రభుత్వమువారు బడులలో ఎందుకూ పొందని దిక్కుమాలిన కృతకాంధ్రభాషలో రచించిన వాచకాలేనంటున్నారు; వాడుక భాషలో రచించిన పుస్తకాలు అప్రువ్ చేయమంటున్నారు.

ఎందుచేత ? వ్యావహారిక భాష అంటే గ్రామ్యమన్న దురభిప్రాయం మన పెద్దలికి వదలలేదు. వ్యావహారిక భాషే వాస్తవమైన మాతృభాష అన్న విషయం ఎంత చెప్పినా వారు గ్రహించడంలేదు. ఏమి చేయను? వ్యావహారిక భాషను గ్రామ్యమనకూడదని మరియొకసారి గట్టిగా నచ్చచెప్పున్నాను.

గ్రామ్యశబ్దము పారిభాషికశబ్దము. గొల్లలు మొదలయిన పామరులభాష గ్రామ్యమని సంస్కృత సారస్వతములో ఆలంకారికులన్నారు. లక్షణవిరుద్ధమయిన భాష గ్రామ్యమని తెలుగు పండితులన్నారు. ఏఅర్థంలో చూచినా మన వ్యావహారిక భాషకు గ్రామ్యమన్న పేరు అన్వయించదు.

ఎందుచేతనంటే, నేను గత 30 సంవత్సరముల నుండీ సమర్థిస్తూ వచ్చిన వ్యావహారికభాష, శిష్టజన వ్యావహారిక భాషే కాని గొల్లలు మొదలయిన పామరులు పలికే గ్రామ్యభాష కాదు.

లక్షణ విరుద్ధమైన భాషగ్రామ్యమన్న సూత్రము మన శిష్టజన వ్యావహారిక భాష కెంతమాత్రము వర్తించదు ఎందుచేతనంటే ఆ సూత్రము కల్పించిన లక్షణకర్త ఉద్దేశించిన భాష భారతాది ప్రాచీన కావ్యములలోని భాష.

అయితే మన వ్యావహారిక భాషకున్ను ప్రాచీన కావ్యభాషకున్ను సంబంధమే లేదా అంటే లేకపోలేదు. సంస్కృత సారస్వతంలో వైదిక భాషకున్ను లౌకిక భాషకున్ను గల సంబంధంవంటి సంబంధం ఉన్నది.

మన ప్రాచీన కావ్యభాష వైదికభాషవంటిది. వ్యావహారిక భాష లౌకికభాష వంటిది. లౌకికభాషకు లక్షణం చెప్పిన పాణిని, 'కాత్యాయనుడు, పతంజలి లోకంలో ఉన్న వాడుక భాష ప్రమాణంగా గ్రహించి సూత్రాలు, వార్తికాలు, శిష్టులు రచించారు గాని వాల్మీకి వ్యాసాదులు రచించిన గ్రంథాలలోని భాష ప్రమాణంగా చూపించ లేదు.

ఇంగ్లండు దేశములో చక్రవర్తిగారు, మంత్రులు, బిషప్పులు, వక్తలు ఉపాధ్యాయులు మొదలయిన పెద్దలందరూ శిష్టులే. వారు వ్యావహారిక భాషలోనే గ్రంథాలు రచిస్తున్నారు. విద్య బోధిస్తున్నారు. ఉపన్యాసాలిస్తున్నారు. ఆ భాషలోనే మన గవర్నరుగారు రేడియో ఉపన్యాసాలు ఇచ్చారు.

ఆ విధంగానే న్యాయమూర్తులయిన సర్ వేపా రామేశంగారు, ఆంధ్ర విశ్వవిద్యాలయ కళాశాలాధ్యక్షులయిన విస్సా అప్పారావుగారు, పండితులును కవులును అయిన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, విశ్వనాథసత్యనారాయణగారు మొదలయిన పెద్దలు తమ వ్యావహారిక భాషలో రేడియో ప్రసంగాలు చేశారు.

వీరందరూ శిష్టులే, వీరిభాష వర్తమాన శిష్టజన వ్యవహారాంధ్ర భాష. వీరెవ్వరూ శిష్టులు కారంటే మన ఆంధ్రదేశంలో ఇంకెవ్వరు శిష్టులు కాగలరో నాకు తెలియదు.

వ్యావహారిక భాష గ్రంథరచన కుపకరించదనడానికి గొప్ప కారణంగా భాషలోని మాండలికరూపభేదాలు చూపిస్తూ ఉంటారు కొందరు.

వాడుకభాష ఒక మండలంలో ఒక విధంగాను, మరి ఒక మండలంలో మరి ఒక విధంగాను ఉంటుంది.

అక్కడివారి మాటలు ఇక్కడి వారికి, ఇక్కడి వారి మాటలు అక్కడి వారికి తెలియవు. సర్కారు జిల్లాలవాండ్లు పప్పు అంటారు. రాయలసీమవారు బేడలంటారు. వారు 'అద్దె' అంటే వీరు 'బాడుగ' అంటారు. వారు 'చెక్క' లంటే వీరు 'వక్క' లంటారు– వారు 'ఆనపకాయ' అంటే వీరు 'సొరకాయ' అంటారు గనుక వాడుక భాష గ్రంథరచనకు పనికిరాదంటారు.

ఈ వాదం 30 సంవత్సరములనుండి చేస్తూనే ఉన్నారు. అందుకు సమాధానం చెప్తూనే ఉన్నాను. నా సమాధానం విననట్టుగానే మళ్ళీ మళ్ళీ అదే వాదం చేస్తూ ఉంటారు. ఖండితమైన వాదం ఎక్కువసార్లు చేస్తూ ఉంటే దానికేమైనా బలం వస్తుందా?

లోగడనే ఈ వాదం బయలుదేరినప్పుడు 'సరే మీరన్నమాట నిజమే, ఒక మండలం వారి వ్యవహారంలో పప్పు, అద్దె, చెక్కలు, ఆనపకాయ అనే మాట లున్నవి. అవి రెండో మండలంవారి వ్యవహారంలో లేవు. ఆ రెండో మండలంవారి వ్యవహారంతో వాటికి సరిగా బేడలు, బాడుగ, వక్కలు, సొరకాయ అనే మాట లున్నవి. ఇవి మొదటి మండలంవారి వ్యవహారములో లేవు'.

'అయితే ఏమంటారు? తమ మండలములో లేక ఇతర మండలములో ఉన్నమాటలే వాడాలంటారా? ఏ మాటలూ వాడరా దంటారా?

"ఈ మాటలలో ఏదీ వాడకూడదంటే ఆ విషయం వ్రాయ వలసి వచ్చినప్పుడు ఏలాగు వ్రాయడము? ఏమాట ప్రయోగించము; సొరకాయా వద్దు; ఆనపకాయా వద్దూ 'అలాబూ' అని సంస్కృతం మాట వాడమంటారా?" అని నేను అడిగినప్పుడు నా ప్రతిపక్షులు ఒకరి మొగము ఒకరు చూచుకోని మారుమాటాడలేక ఊరుకున్నారు.

మాండలిక శబ్దాలు అన్ని భాషలలోను ఉంటవి. అన్నీ సాధువులే. భాషాలక్షణం చేసేవారు ఈ రూపాలు సేకరించి అనుశాసిస్తారు.

పాణిన్యాదులు అలాగే చేశారు. ప్రాచాం... ఈ రూపము, ఉదీచాం – ఈ రూపము అంటూ అనేకంగా మాండలిక శబ్దాలు అనుశాసించారు.

మన తెలుగు కవులు మాండలిక శబ్దాలు వాడుట చేశారు; 'పప్పు' శ్రీనాథుని హరవిలాసంలోను, 'బేడలు ఆముక్తమాల్యదలోను ప్రయుక్తములయి ఉన్నవి.

మాండలీయక శబ్దాలు వ్యావహారిక భాషా ప్రయోజనానికి ప్రతిబంధక మనేవారికి లక్షణ సంప్రదాయం తెలియదని చెప్పాలి.

'కేశవ! యాంధ్రులు నానాదేశంబుల యందు నిలిచి తెలుగులె తత్త ద్దేశోక్తు లంట బలికిన నా శబ్దము అన్యదేశ్యజాంధ్రము లయ్యెన్'

అని అప్పకవి చెప్పలేదా? ఆంధ్రభాషార్ణవము ఆంధ్ర నామసంగ్రహము మొదలయిన నిఘంటువులలో ఈ మాండలీయక శబ్దాలు చేరలేదా? ఇవి అన్నీ శబ్దరత్నాకరములోనికెక్కలేదా?

ఎవరివాడుకలో ఉన్నమాటలు వారుపయోగిస్తారు. ఆ మాటలు తమ మండలము వారికేకాని తక్కిన మండలమువారికి తెలియవన్న విషయం తెలియద మేలాగు? మాండలీయక శబ్దాలను గురించి మా ప్రతిపక్షులు చేసేవాదం సారంలేనిది. దీనిని గురించి సవిస్తరంగా నా 'బాలకవిశరణ్యం' లో వ్రాసి ఉన్నాను. (చూ. పు. 271 – 274).

ప్రాచీన కావ్యభాష నేడున్న పిల్లలచేత చదివించి, అందులోనే వారిచేత వ్రాయించరాదా? అది అందరికి సామాన్యభాష అంటారు కొందరు. అది అందరికీ అన్యభాష వంటిదే. అది ఎవరికీ పట్టుపడక పోవడములోనే 'సామ్యం' అంటాను నేను.

ప్రాచీన కావ్యభాష పట్టుపడవలెనంటే సంస్కృతభాష బాగా రావాలి. తెలుగు ప్రబంధాలు, కావ్యాలు అన్నీ చదివి అందులోని భాషారూపాలు గ్రహించాలి. అర్ధానుస్వార శకటరేఫ నిర్ణయాలు గుర్తించాలి. ఇంత చేసినా ఆ కావ్యభాష కొంతవరకు అర్థం చేసు కోవడం సాధ్యమయితే కావచ్చునేమో కాని నిర్దుష్టంగా వాడడం ఇది వరకెవరికీ సాధ్యంకాలేదనీ, సాధ్యం కావడం అసంభవమనీ నేను బాహాటంగా చెప్పగలను. మహామహోపాధ్యాయ కొక్కొండ వేంకట రత్నం పంతులుగారికి, రావుబహదూర్ కందుకూరి వీరేశలింగం పంతులుగారికీ గ్రాంథికాంధ్ర భాషరాదనీ సంస్కృత భాషరాదనీ వారి గ్రంథాలలోని తప్పులు చూపించారు కళాప్రపూర్ణులయిన వేదం

రచయిత్రి, సంపాదకురాలు,ప్రతిభామూర్తి డా॥ కె.బి.లక్ష్మి నిర్యాణం



ఏడాది క్రితం 2018 ఆగస్టు 18న నా అభిమాన సోదరుడు వేదగిరి రాంబాబు కనుమరుగయ్యాడు. ఆయన్ను సాగనంపేందుకు చివరి వరకూ తోడున్నవారిలో నాతోపాటు కె.బి.లక్ష్మి కూడా ఉన్నారు. ఆమె నిన్నరాత్రి (29.7.2019) రైల్లో ప్రయాణం చేస్తూనే గుండెపోటుతో అప్పటికప్పుడు మరణించారు. రాంబాబు అంటే ఆమెకెంతో అభిమానం. రాంబాబు ప్రేరణతోనే 'అమ్మనుడి' లో భాషోద్యమ కథానికను వ్రాస్తానని ముందుకు వచ్చారు. ఏప్రిల్ 2019 సంచికలో 'పన్నీరు బుడ్డి' అనే కథను వ్రాశారు.

రచయిత్రిగా ఆవిడ ప్రతిభను ఎన్నోసార్లు ప్రదర్శించారు. 30 ఏళ్లు విపుల – చతుర పత్రికల్లో పనిచేశారు. 'మనసున మనసై' 'జూకామల్లి' కథా సంపుటాలు, 'వీక్షణం', 'గమనం', కవితల సంపుటాలు ప్రచురించారు. 70 ఏళ్ల వయస్సును త్రోసి పుచ్చిన ఉత్సాహవంతురాలు. స్నేహశీలి. డా॥ లక్ష్మిగారి మరణం తెలుగు సాహితీ రంగానికి పెద్దలోటు. ఆమెకు మా శ్రద్ధాంజలి. – సంపాదకుడు

వేంకటరాయశాస్త్రిగారు. వారు తప్పులు ఒప్పులుగాను ఒప్పులు తప్పులుగాను చెప్పారని చూపించి ప్రాచీన గ్రాంథికాంధ్రభాష వారికి బాగుగా పట్టుపడలేదని నేను రుజువు చేశాను.

నేను రచించిన మిధ్యాపవాదము, ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజము చదివితే మీకీ విషయం స్పష్టమవుతుంది. నాకు పూర్తిగా పట్టుపడిందని నేను చెప్పుకోవడం లేదు. ప్రాచీన కావ్యభాష ఎవరికీ చక్కగా రాదనే చెప్తున్నాను. అది పట్టుపడడం అసాధ్యమని ఎందుకంటున్నానంటే – అది పూర్తిగా తెలుసుకోడానికి తగిన సాధనాలు తక్కువ.

ఏ కవియైనా తన కావ్యములలో తన కాలంలో ఉన్న భాషంతా పూర్తిగా వాడుక చేయడానికి అవకాశ ముండదు. గనుక కావ్యాలలోనికిరానిభాష మనకు పోయినట్లే కదా. కొన్ని శబ్దాలు అకార మధ్యమములో ఉకార మధ్యమములో చెప్పలేము. కొన్ని శబ్దముల లోని వర్ణములు పరుషములో సరళములో చెప్పడం కష్టము. ఏక వచనములో మాత్రమే కనబడుతూ ఉన్న శబ్దాలకు బహువచన రూపము లెట్లుంటవో చెప్పలేము. బహువచనములో మాత్రమే కన బడుతూ ఉన్న శబ్దాలకు ఏకవచన రూపము లెట్లుంటవో చెప్పలేము. కొన్ని విభక్తులలో మాత్రమే కనబడుతూ ఉన్న శబ్దాలకు తక్కిన విభక్తి రూపాలెట్లుంటవో చెప్పడం కష్టము. కొన్ని శబ్దాలు కావ్యాలలో ఉన్నా నిఘంటువులలో కనబడవు; కొన్ని శబ్దాలు గ్రాంథిక భాషలో కనబడకపోయినా నిఘంటువులలో ఉన్నవి.

గ్రాంథిక భాషలో శబ్దరూపాలు ఎట్లున్నవో, అర్ధానుస్వారము, శకట రేఫము ఏయే శబ్దాలలో ఉన్నవో – ఎందులో లేవో తెలుసు కోవడము ఎంత కష్టమో చూడండి. ఏదైనా ఒక రూపము గురించి తగవు వచ్చినా, సందేహం కలిగినా అది గ్రాంథిక భాషలో లేదు; తప్పు అని చెప్పడం ఎంత సాహసమో ఆలోచించండి.

గ్రాంథికాంధ్రము పెద్ద పెద్ద పండితులకే సరిగా తెలియ నప్పుడు, అది చిన్న చిన్న బడిపిల్లలకు విధించడము కార్యమవునా, కాదా – ఆలోచించండి. లోకంలో ఏదైనా ఒక వృత్తి అవలంబించి బతుకుదామని ఆలోచించి కాస్త చదువూ వ్రాతా నేర్చుకొని తమకు కావలసిన విషయము బోధించే పుస్తకాలు చదువుకొందామన్న సామా న్యుల చేత దారీ తెన్నూ లేని ఈ గ్రాంథికభాషలో రచించిన వాచకాలు చదివిస్తే ఏమి ఫలము కలుగగలదు?

20 ఏండ్లు చదువుకొని 30 ఏండ్లు ఉపాధ్యాయులై ఉన్న పండితులకే కాని, ఈ గ్రాంథికభాష నాలుగు క్లాసులు చదివి ఏదో ఒక వృత్తి అవలంబించేవాండ్లకు ఎందుకు ఉపకరిస్తుంది? వాండ్లకు వాండ్ల వాడుకభాషలో పొందికగా వ్రాయడము నేర్పి ఉంటే అది ఉపకరించును. అది నేర్పరు. ఈ గ్రాంథికభాష రాదు. అందుచేత, వాండ్లు రెంటికీ చెడి యథాప్రకారంగా నిరక్షరకుక్షులవుతారు.

దేశభాష ద్వారా విద్య బోధిస్తేనేకాని ప్రయోజనం లేదు. శిష్టజన వ్యావహారిక భాష లోకంలో సదా వినబడుతూ ఉంటుంది. అది జీవంతో కలకలలాడుతూ ఉంటుంది. గ్రాంథిక భాష గ్రంథాలలో కనబడేదే కాని వినబడేదికాదు. ప్రతిమ వంటిది. ప్రసంగాలలో గ్రాంథిక భాష ప్రయోగిస్తూ తిట్టుకొన్నా సరసాలాడుకొన్నా ఎంత హాస్యాస్ప దంగా ఉంటుందో చూడండి.

గ్రాంథిక భాష యెడల నాకు ఆదరము లేకపోలేదు. ప్రాచీన కావ్యాలు చదువవద్దనీ విద్యార్థులకు నేర్పవద్దనీ నేనను గాని, ఆ భాషలో నేడు రచన సాగించడానికి పూనుకోవడము వృథా అంటు న్నాను. నిర్దుష్టంగా ఎవరున్ను వ్రాయలేరు. వ్రాయగలిగినా వ్రాసేవారికీ కష్టమే, వినేవారికీ కష్టమే. వ్రాసే వాండ్లేమి చేస్తున్నారు? భావం తమ సొంత (వాడుక) భాషలో రచించుకొని గ్రాంథికీకరణం చేస్తు న్నారు. అది చదివేవాండ్లు వినేవాండ్లు తమ సొంతవాడుక మాటలలోకి మార్చుకొని అర్థం చేసుకొంటున్నారు. ఎందుకీ వృథా ప్రయాసం?

స్వరాజ్యం కావలెనంటున్నాము. ప్రత్యేకాంధ్ర రాష్ట్రముకోసం చిక్కుపడుకున్నాము. ప్రజాస్వామిక పరిపాలనం కోరుచున్నాము. ఇటువంటి పరిస్థితులలో మన ప్రజలకు, సామాన్యజనులకు ఏ భాష ద్వారా జ్ఞానం కలుగచేయవలసి ఉంటుందో, ఏ భాషలో గ్రంథరచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి. మీ చేతులలో పత్రికలు న్నవి. పత్రికలద్వారా మీరు ఎంతైనా చేయగలరు.

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

మానవతా విలువలు–మాతృభాషలు

ఇదేదో భాషలను ఉద్ధరించటానికో లేక అంతరిస్తున్న భాషలను పురావస్తు సందర్శనశాలల్లో భద్రపరచేందుకో లేక వాటి వ్యాకరణ వర్ణనలు చేసి సంతృప్తి పడడానికి అంతకంటే కాదు. ఇది మన ప్రాథమిక లేక మౌలిక సమస్యల గురించే. మన విద్యార్థులకు ఎటువంటి విద్యను బోధించాలి, ఏ భాషలో ఎలా బోధించాలి అనే. నేటి బోధనే మన ప్రధాన సమస్య. ఇదే మన సమాజ పురోగతికీ రేపటి ప్రత్యామ్నాయ ప్రపంచానికీ మౌలిక సమస్య. ఇదే మన ముందున్న అసలు సమస్య గూడా. మిగిలిన సమస్యలన్నీ దీని నుంచి ఉత్పన్నం అయినవే.

మన చదువుల్లో మాతృభాషల తొలగింపు – మన ఆర్థిక తిరోగమనం

అసలు ఈ సమస్యలేంటంటే, అక్షరాస్యతలో వెనుకబాటుతనం. ఆర్థిక ప్రగతిలో వెనుకబాటుతనం. మనం తెచ్చుకొన్న డిగ్రీలకూ వచ్చిన చదువుకూ పొంతన లేకపోవటం. కోట్లాది మంది గ్రాడ్యుయేట్లూ వందలూ వేలల్లో ఉద్యోగాలూ. చదువుకొన్న వారిలో నైపుణ్యాల కొదవ. అమెరికా తదితర దేశాలకు లక్షకు పైగా విద్యార్థులు చదువుకోడానికి పోతుంటే వారికి అక్కడ వేలల్లోనే ఉద్యోగాలు మిగిలినవారు ఇంటిముఖం. ఇట్లా లక్షల కోట్ల రూపాయలు ఇతర దేశాలకు చెల్లింపులు. మన విశ్వవిద్యాలయాలకు బడ్జెట్లలో భారీగా కత్తిరింపులు. మాతృభాషాబోధన తొలగింపుతో లక్షలాదిమందికి ఉద్యోగాలు ఉపాధి రంగాలు కుంచించుకుపోతున్న వైనం. లక్షలాదిగా ఉన్న మన భాషా రచయితలూ, కథా గేయ రచ యితలూ గ్రంథ కర్తలూ, కవులూ గ్రంథ ప్రచురణకర్తలూ నటీ నటులూ కళాకారులూ గాయనీ గాయకులూ ప్రకటనలూ ప్రకటన కర్తలూ పత్రికలూ పాత్రికేయులూ మొదలైనవారందరి రేపటి జీవితం ప్రశ్నార్థకంగా మారింది.

సాలున వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో లక్షలాది మందికి ఉపాధికల్పిస్తున్న సినిమారంగం, వేలల్లో చానెళ్లు కలిగి లక్షల కోట్లతో స్థానిక భాషల్లో నడుస్తున్న బుల్లితెర కార్యక్రమాల పరిశ్రమ, ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమగా విస్తరించి లక్షలాది మందికి ఉపాధి కలిగిస్తున్న భారతీయ ముద్రణా పరిశ్రమ మొదలైన వాటి భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యింది. ఆంగ్లభాషా నైపుణ్యం లేమితో మన పరిశోధక విద్యార్థుల పరిశోధనలలో కాలయాపన, ఎదుగూ బొదుగూలేని పరిశోధనా పత్రాల ప్రకటనలూ. ప్రతి సంవత్సరం ప్రకటితమౌతున్న పరిశోధనా గ్రంథాలలో నేతిబీరకాయ చందమైన సృజనాత్మక పరిశోధనా విషయాలు.

అసలు ఇది ఇంత పెద్ద సమస్యగా ఎలా తయారైంది అనేది తెలుసుకోవాలి. ఇది భాషా సంబంధమైన ఈ అత్యవసర పరిస్థితికి ఎలా దారి తీసిందో తెలుసుకోవాలి. ప్రపంచీకరణతో తలెత్తిన దూరదృష్టిలేమి నేడు దేశంలో విద్యా విషయక అత్యవసర పరిస్థితిని సృష్టించింది.

ఇది గత రెండు దశాబ్దాలుగా సాగుతున్నా నేడు మాత్రం ఏకంగా మన భాషనూ మన అస్థిత్వాన్నీ హరించివేసే దిశలో నడుస్తోంది. బోధనా మాధ్యమంగా భాషేకదా తొలగిపోయింది అనుకుంటే చాలదన్నట్లు దాంతో విద్యాబోధనే దారి తప్పుతోంది. మానవ విలువలతో కూడిన విద్య మనకు దూరమైంది. ఇందులో అందరికీ ఎంతో కొంత భాగస్వామ్యం ఉంది. విద్యా వేత్తలూ, భాషా పండితులూ, అధికారగణం, రాజకీయ నాయకులూ అందరూ బాధ్యులే. రేపటి తెలుగునాట చరిత్రలో వీరందరూ చరిత్రహీనులుగా మిగిలిపోక తప్పదు.

లాభసాటి విద్య – విద్యా వ్యాపారం

1835 వ సంవత్సరంలో మెకాలే ఇంగ్లీషు విద్యాబోధన చట్టం నాటినుండి మన ప్రభుత్వాల నిష్క్రియాపరత్వం కార్పొరేట్ స్కూళ్లు ప్రైవేటు బడులతో విద్యను వ్యాపారంగా మార్చుకొనే సదుపాయం కల్పించింది. దానిలో భాగంగానే లాభసాటికాని విద్యాలయాలు మూసివేయాలంటూ వేలాది బడులకు మంగళం పాడటం జరుగుతోంది. విద్య, వ్యాపార వస్తువైంది. విద్యాలయాలు, లాభసాటి వ్యాపార కేంద్రాలయ్యాయి. విద్యార్జన వ్యాపారమైంది. ఏదైతే వ్యాపారంతో ముడిబడి ఉంటుందో దానిలో డబ్బుకు ప్రాధాన్యం వుంటుంది అని తెలుసుకోవచ్చు. అంటే ఈనాడు విద్యా సంబంధ విషయాలలో డబ్బు నిర్ణాయకంగా మారింది. ఇదంతా మానవతా విలువలు అడుగంటి పోవడానికీ మానవీయ వ్యవస్థలు ధ్వంసం కావడానికీ ప్రేరణగా నిలిచింది అని చెప్పవచ్చు.

అసలు బోధనే అటకెక్కింది. తరగతి గదిలో నేర్చుకోవడం అంటే చదువు కొనడంగా పరిణమించింది. నేర్చుకోవడంతగ్గి బట్టీ వేయడం పెరిగింది. తరగతిగదిలో భాష ఎవరికీకానిది అయి పోయింది. విషయం పట్ల అవగాహన దూరమైంది. మానవీయ సామాజిక శాస్త్రాల బోధన, అధ్యయనం కొందరివంతే అయింది. విజ్ఞాన శాస్త్రాల బోధనలో అవగాహన కంటే మార్కులూ ర్యాంకుల గొడవే ఎక్కువైంది. తరగతి గదిలో అర్థవంతమైన విషయావగాహనకు ఆస్కారమే లేకుండా పోయింది. ప్రజల భాషను విద్యాలయాల నుండి దూరం చేసి తెలియని భాషలో చెప్పడం చదవడం వింతల్లో వింత. ఈ వింత తెలుగు రాష్ట్రాలలో మాత్రమే జరగటం జరిగిన జరుగుతున్న అప్రజాస్వామ్య పాలనకూ నిర్వచనంగా మారింది.

సంపాదనే ధ్యేయంగా, వ్యాపారమే ఆనవాలుగా తయారైన విద్యావ్యాపారంలో చదువుకొన్న విద్యార్థులతో కూడిన రేపటి మన సమాజం పరిస్థితి ఏమిటి? లక్షలాది ఆంగ్లమాధ్యమ గ్రాడ్యుయేట్లు ఇంగ్లీషులో నాలుగు వాక్యాలు సరిగా రాయలేని పరిస్థితి. ప్రతి సంవ

త్సరం 15 లక్షలకు పైగా ఇంజనీరింగు గ్రాడ్యుయేట్లు తయారవుతుంటే వారిలో 80 శాతం మందికి ఉద్యోగాలు లేవు. ఇంకా చెప్పాలంటే వారిలో 11% మందే ఉద్యోగార్హత సంపాదించినవారు. దీనికి ప్రధాన కారణం భాషా పరమైన కౌశలాల లేమి అని తేల్చి వేశారు. తెలుగు మనందరికీ వచ్చిన భాష. ఇంగ్లీషు చదువుకొన్న భాష. అమ్మ భాష అనర్గళంగా వచ్చి వుంటే ఆంగ్లంలో కౌశలం కూడా అట్లాగే ఉండేది. అదీ లేకుండా ఇదీ రాకుండా విద్యార్థుల జీవితాలను దుర్భరం చేశాం. ఈ పాపం ప్రభుత్వాలదే.

సాక్షర భారత్ - అక్షరాస్యతలో ముందడుగు

1980 ప్రాంతంలో అంటే గత నాలుగు దశాబ్దాలకిందట మన దేశం సార్వజనిక అక్షరాస్యతా ఉద్యమాన్ని (1988-2009) చేపట్టి అప్పటికి 15 ఏండ్లు దాటి వయసున్న వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దటానికి జాతీయ సాక్షర ఉద్యమాన్ని నడిపింది. ఇది మన ఒక్క దేశమే కాదు ఆనాటి ఐరాసవారి కోరికపై ప్రపంచంలోని మిగతా దేశాలతోపాటు ప్రత్యేకంగా ఆసియా దేశాలన్నీ అక్షరాస్యతా ఉద్యమాన్ని నడిపాయి. అయితే ఆసియా దేశాలు అక్షరాస్యతా ఉద్యమంతో తమ తమ దేశాలలో 90 శాతంపైగా అక్షరాస్యతను సాధించగా మన దేశంలో మాత్రం అది 65% దాటలేదు. కారణం మన రాజకీయనాయకులకు దేశ ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం కావడం. సార్వజనిక అక్షరాస్యతను మాతృభాషలలో అంటే ప్రాంతీయ, స్థానికభాషలలోనే జరపాలి. అప్పుడే కొద్ది కాలంలో, ఎక్కువ మందికి తక్కువ వనరులతో అక్షరాస్యులుగా చేయటం వీలవుతుంది. ఈ జాతీయ సాక్షర ఉద్యమం ద్వారా 12.75 కోట్లమంది అక్షరాస్యులయ్యారని అంచనా. అంటే అప్పటి మన జనాభాలో షుమారు 12% శాతం కావచ్చు. అయితే దీన్ని 2009లో ఆపివేశారు. అయినా ఇంకా నిరక్షరాస్యులు అప్పటి జనాభాలో 26 కోట్ల వరకూ ఉండగా ఆ తరువాత మూడు సంవత్సరాలపాటు సాక్షర భారత్ అనే పేరుతో 8వషెడ్యూలులోలేని భాషలు మాట్లాడేవారి ప్రయోజనంకోసం అక్షరాస్యతా ఉద్యమాన్ని నడిపారు.

ఈ ఉద్యమం ద్వారా 7 కోట్లమందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరిగింది. అయితే ఆ పైన వయోజన సాక్షరతా కార్యక్రమాలను పట్టించుకున్నట్లు కనబడదు. మన జాతీయ అక్షరాస్యతా సగటు 74 శాతానికి కారణం సాక్షరతా ఉద్యమాలే. ఆయితే ఇతర ఆసియా దేశాలు సాధించిన అక్షరాస్యతను మనం సాధించలేకపోవటానికి కారణం మాతృభాషలలో నడుస్తున్న చదువులను గత మూడు దశాబ్దాలనుండి చాపకింద నీరులా చేరిన ఆంగ్లమాధ్యమ బోధనే అని తెలుస్తోంది. ప్రపంచంలో ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న దేశాల జాబితా చూస్తే అవన్నీ బోధనా మాధ్యమంగా మాతృభాషలు ఉన్న దేశాలేననీ అందుకనే అవన్నీ అక్షరాస్యతలో 90 శాతం దాటిన దేశాలనీ తెలుస్తోంది.

ఐరాస వారి దేశాలవారీ అక్షరాస్యతా గణాంకాలు (2015)

దేశం	వయోజనులు	యువజనులు వయసు 15-24
చైనా	96.4%	99.7%
శ్రీలంక	92.6%	98.8%
మ్యాన్మర్	93.7%	96.3%
ప్రపంచసగటు	86.3%	91.2%
భారత్	72.1%	86.1%
నేపాలు	64.7%	86.9%
బంగ్లాదేశ్	61.5%	83.2%
పాకిస్తాన్	58.5%	74..8%

భారత గణాంకాలు - అక్షరాస్యత (వయసు 7.)

దశాబ్దం	పురుషులు%	స్త్రీలు%	మొత్తం%
1971	45.96	21.97	34.45
1981	56.38	29.76	43.57
1991	64.13	39.29	52.21
2001	75.26	53.67	64.83
2011	82.14	65.46	74.04

ఉదారవాద విద్యావిధానం -మానవీయ విలువలు

ఉదారవాద విద్యావిధానం (లిబరల్ ఎడ్యుకేషన్) అనేది స్వేచ్ఛా మానవుని వికాసానికి అనువైన విద్యా వ్యవస్థ. ఇది 19 వ శతాబ్దపు ఉదార కళలకు సంబంధించిన భావనలపై ఆధారపడింది. ఐతే ఇప్పుడు దీనిని జ్ఞాన యుగపు ఉదారవాదం అనీ అంటారు. దీనినే విద్యా తత్వశాస్త్రం అనీ అభివర్ణిస్తారు. ఇది విస్తృత జ్ఞానబోధ చేయగల నైపుణ్యాలూ విలువలూ, నీతిమంతమైన పౌర సంబంధ కార్యక్రమాల పట్ల బలమైన భావన కలిగిన వ్యక్తులకు మాత్రమే అధికారాన్ని సమకూర్చాలని చెబుతుంది. ముఖ్యంగా సమస్యలనూ సవాళ్ళనూ ఎదుర్కోవటమే ఈ ఉదారవాద విద్యావిధాన ప్రధాన లక్షణం. ఇక్కడ చదవడం కంటే నేర్చుకోవడమే ముఖ్యం. ర్యాంకులు ప్రధానం కాదు,7 నేర్పే ముఖ్యం, మాతృభాషే మాధ్యమం.

నేటి సాంకేతిక విద్య, విస్తృతంగానూ ప్రబలంగానూ ఉన్న ప్రస్తుత రూపంలో, విద్యార్థులను స్వతంత్రంగా ఆలోచించడానికి తగినంతగా శక్తినివ్వడంలేదు అనేది అందరూ ఒప్పుకొనేదే. పర్యవసానం, సామాజిక పరమైన ఒత్తిడి వల్లనో తల్లిదండ్రుల బలవంతం వల్లనో, మేధోపరంగానూ మానసికంగానూ సంతృప్తినివ్వని ఉద్యోగాల కోసం కుటుంబంలోనూ సమాజంలోనూ గందరగోళాన్ని పెంచే సంపద కోసం గుడ్డిగా పరుగులెత్తించే విధానానికి దారితీస్తోంది.

విద్య అనేది నైపుణ్యాల అభ్యాసం (ఎలా) గురించి మాత్రమే కాదు ఏమి చేయాలి? ఎందుకు చేయాలి? అనేవాటిని నిర్ణయించే శక్తి సామర్థ్యాల్ని అభివృద్ధి చేయడం గురించి కూడా. విద్య, విద్యార్థులలో సమాజంలో అంతర్గతంగా ఉన్న మౌలికాంశాలకూ బాహ్య

గుండె లోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేదీ 'అమ్మనుడి'లోనే

రూపాలకూ మధ్య తేడాని గుర్తించే విధంగానూ, జీవితంలో నైతిక విలువలూ మేలిమెరుగుల మధ్య తేడాను గుర్తించే క్లిష్టమైన సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి దారితీయాలి. సమాజంలో మనం ఎదుర్కొంటున్న రెండు ప్రధాన సమస్యలు పేదరికమూ నిరుద్యోగమూ. నేటి సమాజంలో ప్రబలంగా ఉన్న ఆధిపత్యధోరణీ దోపిడీతనం వంటి మానవ సంబంధ సమస్యలను పరిష్కరించకుండా ఎలాంటి జ్ఞానం ఉన్నా సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా ప్రయోజనం లేదు.

ఈ సంకట స్థితినుండి బయటపడాలంటే యువత; మానవ సంబంధాల పట్ల అవగాహనను పెంపొందించుకోవాలి. సమాజాన్ని పాలనా ఆధారిత సంబంధాల నుండి మానవీయ విలువల ఆధారిత సంబంధాల వేపు జరిగేట్లుగా మార్పు చెందేట్లుగా ఉండాలి. అందుకు మాతృభాషా మాధ్యమ బోధన తప్పనిసరి.

మన చుట్టూతా ఉన్న ప్రపంచంలో మౌలికమైనదీ అతిముఖ్యమైనదీ సంబంధాలమధ్య సామరస్యం. యువత దాన్ని అర్థం చేసుకోవడానికీ అవసరమైన విధివిధానాలలో చురుకుగా పాల్గొనడానికీ వారిని శక్తిమంతం చేయడానికి విద్య కనీస పరిజ్ఞానాన్ని అందివ్వాలి. మౌలికమైన మానవీయ విలువల ఆధారిత సంబంధాలపట్ల అవగాహన లేనప్పుడు, విద్యార్థి సమాజానికి అనవసరమైనవాటిపట్ల, ప్రలోభపూరితమైన వాటిపట్ల మోజు పెంచుకొని తప్పుడు సంతృప్తికి లోనుకావటమో లేక నిరాశ చెందటమూ జరుగుతోంది.

స్వార్థం నుండి పరార్థం – మానవ గమనం

అసలు మనిషి నిరాశావాది కానేకాదు. మొట్టమొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామం నుండి మన దేశం స్వతంత్ర దేశంగా అవతరించడానికి ఒక శతాబ్దం పైగానే పట్టింది. ఇన్నేండ్లు పట్టినా స్వతంత్ర పోరాటాన్ని ఆపలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రావతరణకు ఆరు దశాబ్దాలపైనే పట్టింది. అయినా ఆగలేదు. సమయమూ సందర్భమూ సరైన వాటిని అంది పుచ్చుకొని ముందుకు నడిపించ గలిగినవారి కోసం వేచిచూస్తూనే ఉంటాయి. మాతృభాషలకు కాలం చెల్లింది అనుకొని నిరాశావాదం లోకి కూరుకుపోవాల్సిన అవసరం లేదు. తమను కప్పేస్తున్న తగల బడ్డ స్వార్థశవాల బూడిద కుప్పల్లో నుంచి బైటకూ చీకట్లను చీల్చు కుంటూ వెలుగులోకి రాకతప్పదు.

కొందరు అంటున్నట్లు మనిషి ఏలాంటి ప్రోత్సాహకాలూ, ప్రేరకాలూ ఆకర్షకాలూ మొదలైన ప్రలోభాలకు లొంగకుండా ఏ పనీ చేయడు అనేది సత్యదూరం. చరిత్రను మలుపుతిప్పిన మహనీయులే కాదు కోటానుకోట్ల మంది పంట పండించే రైతులూ, చెమటోడ్చి సంపద సృష్టించే కూలీలూ, లక్షలాదిమంది విద్యార్థులకు చదువులు చెప్పి వారి జీవనయానానికి తోడ్పడుతూ శిథిల జీవితాలు గడుపుతున్న ఉపాధ్యాయులూ, దేశపుటంచుల్లో రక్తధారలవారబోసి మనకుమాత్రం స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను మిగుల్చుతున్న సైనికులూ వీరందరూ ఏ ప్రలోభాలకు లోనై మనకందరికీ అందమైన జీవితాన్ని అందిస్తున్నారు. అందుకనే మానవుడు పరోపకారి. మనిషి స్వార్థపరుడు కాదు. అతనిలో స్వార్థంకంటే పరార్థమే ఎక్కువ. మనిషి పరోపకారి కాకుంటే ఈ ప్రపంచం ఇంతకాలం ఇట్లా మనుగడ సాగించేది కాదేమో. మనిషే కాదు, ప్రాణులన్నీ పరోపకార జీవులే. జీవ పరిణామం పరోపకారత్వంతో ముడిపడివున్నదే.

జీవులమధ్య పరోపకారమే జీవపరిణామ సిద్ధాంతానికి కార్యకారణ సంబంధాన్ని తెలియపరుస్తోంది. తాత్వికవాది అగస్టో కోంటీ, పరిణామ సిద్ధాంతి చార్లేస్ డార్విన్, ఆధునిక ఉదారవాద సిద్ధాంతవేత్త అగ్రహార నాగరాజు లాంటి జీవనవిద్యావేత్తల అభిప్రాయం ప్రకారం పరోపకారత్వమే ప్రాణుల మధ్య సత్సంబంధాలకూ జీవపరిణామానికీ, తద్వారా ఈ భూమిపై ప్రాణుల ఉనికికీ చివరకు భూమి మనుగడకూ తోడ్పడుతున్న మౌలిక లక్షణం అని నిర్వచించారు. ఇట్లా ఈనాడు భూగోళం వేడెక్కి సంతులనాన్ని కోల్పోటానికి కారణం ఈ పరోపకారత్వానికి గండిపెట్టే మన చదువులు స్వార్థాన్ని పెంచిపోషించే దిశగా మళ్లుతున్నాయని చెబుతున్నాయి. విద్యను వ్యాపారవస్తువుగా మార్చడం విద్యాలయాలు లాభసాటి వ్యాపారనిలయాలుగా రూపొందడమే పరార్థం స్థానంలో స్వార్థం ప్రబలడానికి కారణం. మన బడుల్లో మన చదువుల్లో మానవతా విలువల బోధన అడుగంటింది. మాతృభాషలలో బోధన ఉన్నంతకాలం మానవీయ విలువలకు బోధనలో చోటుండేది.

బోధనలో మాతృభాషల పోకడ చదువులలో స్వార్థం రాకడ ఒక్కసారే జరిగింది. మళ్ళీ మాతృభాషలలో బోధనను పునరుద్ధరించడానికి కుల, మత, పార్టీలకతీతంగా ఉద్యమం ఊపందుకోవాలి. ఇది అందరి ఉద్యమం కావాలి. ఇది భూగోళాన్నీ పర్యావరణాన్నీ పరిరక్షించే ఉద్యమం కావాలి.

కవిత

బొటనవేలు

ఒకటా.. రెండా
వందల వేల లైక్ ల ప్రహసనాలు
బొటనవేలి దాహానికి పర్యవసానాలు
ముఖపుస్తకంలో ముఖాలను దాచుకుంటూ
అక్షరజ్ఞానుల వేలిముద్రలు
మనిషిలోని ప్రేమో.. పగో..
అర్థమయీ కాని యంత్ర “ జాలం”లో
ఒక్క వేలుతో శాసించే వెర్రి షో లు
ఎవరినైనా నిలువెల్లా స్కానింగ్ చేయొచ్చుకానీ
బొటనవేళ్ల లైక్ ల భాష్యాలను
పరిష్కరించే డిటెక్టర్ దొరుకుతుందా !

– డా.సి.భవానీదేవి
9866847000

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

డా॥ ఈమని శివనాగిరెడ్డి- స్థపతి
9848598446

'జెన్' బోధిధర్ముడు తెలుగువాడే



చైనాలో ప్రచారంలో ఉన్న ఒక కథ ప్రకారం, బోధిధర్ముడు కంచి నుంచి పాలించిన పల్లవరాజు మూడో కొడుకు. మహా కాశ్యప పరంపరకు చెందిన ప్రజ్ఞాతార, బోధిధర్ముని గురువు. బోధిధర్ముని అసలు పేరు బోధితారక్షత్రియ. ప్రజ్ఞాతారుడు ఒకసారి కాంచీపురానికి వచ్చినపుడు, పల్లవరాజు ఆయన్ను స్వయంగా ఆహ్వానించి, ఆయనకు ఒక రత్నాన్ని బహూకరించాడు. దాన్ని తీసుకొన్న ఆ బౌద్ధాచార్యుడు, రాజు ముగ్గురు కొడుకులను పిలిచి, వారితో, 'ఈ రత్నం కాంతిమంతంగా మెరుస్తుంది. దీనితో పోల్చదగినదేదైనా ఉందా?' అని అడిగాడు.

రాజు ఇద్దరు కొడుకులు లేచి, 'ఆచార్యా! సప్త రత్నాలలో ఈ రత్నమే శ్రేష్ఠమైంది. ఇంత విలువైన రత్నాన్ని స్వీకరించే అర్హత మీకు కూడా లేదు', అని జవాబిచ్చారు. అప్పుడు రాజు మూడో కొడుకైన బోధితారుడు, 'ఆచార్యా! ఈ రత్నం ఇహలోకపు నిధి మాత్రమే. అత్యున్నతమైనదని చెప్పే గుణం మాత్రం ఇందులో లేదు. ఈ రత్నం నుంచి వెలువడే కాంతులు కూడా ఇహపరమైనవే. ప్రజ్ఞ వెదజల్లే కాంతి సర్వోత్కృష్టమైంది. అన్ని రకాల కాంతులకంటే బోధిమండలం వెదజల్లే కాంతే అత్యుత్తమం. ఈ రత్నం దానంతట అది వెలుగులీనలేక పోతుంది. అదే ప్రజ్ఞారత్నమైతే ఇహపరమైన కాంతిని మించిన కాంతితో ప్రకాశిస్తుంద'ని చెప్పాడు.

ఈ సమాధానంతో సంతృప్తి చెందిన ప్రజ్ఞాతారునికి, బోధితారుడు ధార్మికోన్నత ప్రగతి సాధించగలడన్న నమ్మకం కుదిరింది. పల్లవరాజు అనుమతితో బోధితారుడు ఇల్లు వదిలి, అనగారికుడై, ప్రజ్ఞాతారుని శిక్షణలో, సంబోధిని పొందిన తరువాత కాంచీపురం నుంచి చైనాకు వెళ్లాడు. ఆమాటకొస్తే, క్రీ.శ. 400-460 మధ్య కాలంలో బుద్ధభద్రాచార్యుడు ఉత్తర దేశం నుంచి భూమార్గం ద్వారా, గుణ భద్రాచార్యుడు దక్షిణ భారతదేశం నుంచి సముద్ర మార్గం ద్వారాను చైనా చేరుకొని బుద్ధధర్మాన్ని ప్రవర్తింపజేశారు. వారు పరినిర్వాణం చెందిన తరువాత, చైనాలో బుద్ధ ధర్మాన్ని బోధించేవారు లేరని తెలుసుకొన్న బోధిధర్ముడు, సంబోధిని సంప్రాప్తింపజేసిన ప్రజ్ఞాతారుని స్థూపాన్ని సందర్శించి, తండ్రితో తాను, తూర్పు దిశగా నున్న చైనాకెళ్లాలన్న తలంపును వెల్లడించాడు, అంగీకరించిన రాజు, కంచి నుంచి రేవు పట్టణం వరకూ పరివారంతో వెళ్లి, ఒక పడవను ఏర్పాటు చేసి, వీడ్కోలు చెప్పినపుడు అందరూ కన్నీటి పర్యంతమైనారు. సుదీర్ఘ సముద్రయానం తరువాత బోధిధర్ముడు క్రీ.శ. 520 లో దక్షిణ చైనాలోని గాంగ్జూ చేరుకొన్నాడు. స్థానిక ప్రభువైన జియావో అంగ్, బోధిధర్ముని స్వాగతించాడు.

ఇది తెలుసుకొన్న చైనా రాజు ఊ, తన రాజధాని నాన్జింగుకు ఆహ్వానించి రాజసభలో గొప్ప విందు భోజనాన్ని ఏర్పాటు చేశాడు. విందు ముగిసిన తరువాత రాజు బోధిధర్ముని, 'పూజనీయా!, మీ దేశాన్నుంచి ఏయే బుద్ధ సూత్రాలు తీసుకొచ్చారు?' అని అడిగాడు రాజు.

'నేనే ప్రవచనాన్నీ తేలేదు' బోధిధర్ముడు జవాబిచ్చాడు.

'పూజనీయా, నేను ఎన్నో చైత్యాలు కొట్టాను. అనేక సూత్రాలు అనువదింపజేశాను. ఎంతో మంది భిక్షువులకు దీక్ష నిప్పించాను. వీటివల్ల నాకు లభించే పుణ్యం గురించి వివరించండి' అని అడిగాడు రాజు.

'రాజా! మీకు ఎటువంటి పుణ్యమూ దక్కదు' అని చెప్పాడు బోధి ధర్ముడు.

'అదెలా?, పూజనీయా!' ప్రశ్నించాడు రాజు.

'రాజా! అవన్నీ మనం కల్పించుకొనే ఆలోచనలే. అన్నీ అంతమయిపోయేవే. ఒక వస్తువును నీడ ఎలా వెన్నంటి ఉంటుందో, అలాగే ఆ వస్తువే లేకపోతే నీడ లేదో, పుణ్యం కలుగుతుందనేది కూడా భ్రమే' అని చెప్పాడు బోధిధర్ముడు.

'ఆచార్యా! చతురార్య సూత్రాల్లో మొదటిదేదీ? అని అడిగాడు రాజు.

'ఆర్యత్వం లేని శూన్యం' అని బదులిచ్చాడు ఆచార్యుడు.

'నా ముందున్నదేమిటి?' అడిగాడు రాజు

'తెలియదు' అన్నాడు బోధిధర్ముడు.

తాను చెప్పింది రాజు అర్థం చేసుకోలేదని తెలుసుకొన్న బోధిధర్ముడు, అక్కణ్ణించి బయలుదేరి యాంగ్జియాంగ్ నదిని దాటి ఉత్తర చైనా చేరుకొన్నాడు.

యాంగ్‌నింగ్ ఆరామానికి చేరుకొని, రమణీయమైన ప్రకృతి నడుమ ఉన్న పగోడాలను చూచి ఆనందించాడు బోధిధర్ముడు. అక్కడ కొన్ని రోజులు గడిపిన తరువాత, షావోలిన్ ఆరామానికి చేరుకొన్నాడు.

ఆ ఆరామంలోని ఒక గోడను ప్రతిరోజూ గంటల కొద్దీ చూస్తూ, ధ్యానం చేస్తూ తొమ్మిదేళ్లు గడిపాడు. ప్రవచనాలు లేని ధ్యాన ప్రక్రియను కొందరు మెచ్చుకొని, ఆచరించి, ఆర్హంత లైనారు. నచ్చనివారు ఆయనపై దుమ్మెత్తి పోశారు.

బోధిధర్ముడు గోడను చూస్తూనే ధ్యానం చేస్తూ గడుపుతున్నపుడు, షెన్‌గాంగ్ అనే భిక్షువు, షావోలిన్ చేరుకొని, లోతుగా అధ్యయనం చేయాలనుకొని, ధర్మాన్ని గురించి అడిగిన ప్రతిసారీ, మౌనం తప్ప మాటల్లేవు. అతన్నెలాగైనా మాట్లాడించి, ధర్మాన్ని వివరించమని అడగాల నుకొని, దట్టంగా మంచు కురుస్తున్న డిసెంబర్ నెలలో బోధిధర్ముడుండే గది బయట అర్ధరాత్రి నుంచి నిలబడి గడిపిన షెన్‌గాంగ్, మంచులో కూరుకుపోయాడు.

తెల్లవారిన తరువాత గమనించిన బోధిధర్ముడు, నోరు తెరచి, 'మంచులో నువ్వెందుకు నిలబడ్డావు' అని పెన్‌గాంగ్‌ను అడిగాడు.

'ధర్మ ద్వారాన్ని తెరవండి. అనుకంపతో అందరికీ దుఃఖ నివృత్తి చేయండి' అని షెన్‌గాంగ్ వేడుకొన్నాడు. అంగీకరించిన బోధిధర్ముడు, షెన్‌గాంగ్‌ను శిష్యునిగా చేర్చుకొని ధమ్మ ద్వారాన్ని తెరిచాడు. అతనితో పాటు దోయూ, జాంగ్సి అనే వారిని కూడా శిష్యులుగా చేసుకొని ధమ్మాన్ని బోధించాడు. వారితో, బోధిధర్ముడు, 'నా ఎముకల్లో మూలుగును, ఎముకలను, మాంసాన్ని మీరూ సొంతం చేసుకొన్నారు. నేనొచ్చిన పని అయిపోయింది', అంటూ తన చీవరాలను (భిక్షువస్త్రాలను) షెన్‌గాంగ్‌కిచ్చి, ధర్మ సారధ్యాన్ని కూడా అప్పజెప్పాడు.

క్రీ.శ. 528 లో పరినిర్వాణం చెందిన బోధిధర్మునికి లోయాంగ్ వద్ద ఒక స్థూపాన్నీ, కాంగ్ - జింగ్‌సి అనే ఒక ఆలయాన్ని నిర్మించారు చీనీయులు. క్రీ.శ. 763-79 మధ్య పాలించిన చైనా చక్రవర్తి దైజాంగ్ బోధిధర్ముని గొప్పతనాన్ని తెలుసుకొని అతడొక శూన్యతా బోధిసత్వుడని కొనియాడాడు. వచనాలు, ప్రవచనాలు, సూత్రాలపై ఆధారపడకుండా, బుద్ధిని కేంద్రంగా 'తథత' ను ఆకళింపు చేసుకొని బుద్ధత్వాన్ని పొందాలని చెప్పి, చైనాలో ఇప్పటికీ గొప్ప బౌద్ధాచార్యునిగా కొనియాడబడుతున్నాడు బోధిధర్ముడు.

చైనా చేరుకున్నప్పుడు స్వాగతించిన రాజు, ఊ, బోధిధర్ముని పరి నిర్వాణ విషయాన్ని తెలుసుకొని, అతని గొప్పతనాన్ని కీర్తిస్తూ ఒక శాసనాన్ని వేయించాడు. బోధిదర్ముని ధ్యాన పద్ధతి ఛాన్‌గానూ, తరువాత జెన్‌గానూ గుర్తింపు పొంది, చైనా, జపాన్‌లలో బహుళ ప్రచారంలో ఉంది.

కంచి నుంచి బయల్దేరిన బోధిధర్ముడు, మామల్ల (మహాబలి) పురం నుంచి తొలుత శ్రీలంక చేరుకొని, రెండు నెలల తరువాత సుమత్రా, అక్కణ్ణించి చైనా చేరుకొన్నాడు. ధ్యాన ప్రజ్ఞ ద్వారా త్వరితగతిన బుద్ధత్వాన్ని సంతరించుకొనే జెన్ బౌద్ధాన్ని అందించిన బోధిధర్ముని మూలాలు తెలుగునేలపైనే ఉన్నాయి. ఇక్ష్వాకుల తరువాత, ధాన్యకటకం - దర్శి మధ్యగల ఇప్పటి పల్నాటి ప్రాంతాన్ని, ధాన్యకటకం రాజధానిగా పాలించిన తొలి పల్లవ తెలుగు వంశీయుల్లో ఒకరైన వీరకూర్చవర్మ, రాజకీయ కారణాల వల్ల, రాజధానిని, ధాన్యకటకం నుంచి, కంచికి మార్చాడు. *('కంచి' విశాల తెలుగు ప్రాంతంలో భాగమే. ఇప్పటి భారతదేశంలో భాషా రాష్ట్రాల ఏర్పాటులో 'కంచి' తమిళనాడులో గుర్తించబడుతున్నది - సంపాదకుడు)* అతని వారసుడైన రెండో నరసింహ వర్మ మూడో కుమారుడే బోధి ధర్ముడు. చైనా నుంచి జపాన్ దాకా ధ్యాన (జెన్) వెలుగుల్ని విరజిమ్మిన బోధిధర్ముడు మన తెలుగువాడే.

శ్రద్ధాంజలి



తెలుగు భాషోద్యమ నేత

నైనప్పగారి దశరథ రామయ్య కన్నుమూత

శ్రీదశరథరామయ్యగారు (1.7.1937 - 4.7.2019) తెలుగు భాషోద్యమములో ప్రముఖ పాత్ర వహించారు. 2004 సం॥లో ప్రారంభించబడిన నెల్లూరు జిల్లా తెలుగు భాషోద్యమ సమితికి వ్యవస్థాపక కార్యదర్శిగా సేవలందించారు. వ్యక్తిగత ఆరోగ్య సమస్య కారణంగా చివరి రోజుల్లో మాత్రమే విశ్రాంతి తీసుకున్నారు.

2004 సం॥ గుంటూరులో జరిగిన తెలుగు భాషోద్యమ సమాఖ్య సమావేశాలకు హాజరయిన దశరథరామయ్యగారు ఆ స్ఫూర్తితో నెల్లూరుజిల్లా తెలుగు భాషోద్యమ సమితిని ప్రారంభిం చారు. విద్యారంగం, పాలన రంగాలలో మాతృభాష ప్రాధాన్యతను వివరిస్తూ ఎన్నో సభలు, సదస్సులు నిర్వహించారు. ఎంతోమంది కార్యకర్తలను ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశారు. కార్యకర్తలను సమన్వయపరుస్తూ సమావేశాలు నిర్వహించారు. జిల్లా పాలనా యంత్రాంగంతో సన్నిహిత సంబంధాలు పెంచుకొని, అధికారభాషా సంఘ కార్యక్రమాలలో చురుకుగా వ్యవహరించారు.

నెల్లూరు పట్టణ పరిధిలోని దుకాణములు, కార్యాలయాల నామ ఫలకాలు తెలుగులోనే వుండాలని ప్రచారం నిర్వహించి, జిల్లా పాలనా యంత్రాంగం సహకారంతో 94 శాతం తెలుగులో వుండేట్లు కృషి చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని, అప్పటి జిల్లా కలెక్టరు శ్రీ రవిచంద్ర గారు, డి.ఆర్.డి.ఓ. చెన్నకేశవరావు గారు, జడ్.పి.సి.ఇ.ఒ. శ్రీ పెంచల రెడ్డిగారి సహాయంతో, అధికార భాషా సంఘం కృషితో గణనీయ మైన అభివృద్ధి సాధించారు.

పాఠశాలల్లో విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉద్యమంలో భాగస్వాములుగా చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా కథలు, శతక పద్యాల పోటీలు నిర్వహించి సమితి తరఫున బహుమతులు అందజేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో తెలుగుభాషోద్యమ సమాఖ్య సమావేశాల్లో పాల్గొని తగిన సూచనలు చేస్తూ భాషోద్యమానికి అన్ని విధాల తోడ్పడ్డారు. 4.7.2019 తేదీన ఆయన ఆకస్మిక మరణం ఆయన సన్నిహితులను విషాదంలో ముంచింది. ఒక నిజాయితీగల కార్యకర్తను తెలుగుభాషో ద్యమం కోల్పోయింది. ఆయనకు సమాఖ్య తరఫున ఘన నివాళులు అర్పిస్తున్నాము.

చెలంచర్ల భాస్కరరెడ్డి
గౌరవ అధ్యక్షులు, నెల్లూరు జిల్లా
తెలుగు భాషోద్యమ సమితి

అనురాధ భట్ట
9010016555

ఇండోనేషియాలో తెలుగుజాతి ఘనచరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు



బొరొబుదూరు వద్ద రచయిత్రి

ఇండోనేషియాకు తెలుగునేల చాలా వేల కిలోమీటర్ల దూరమే ఉంది, ఇప్పటికీ డైరెక్ట్ విమాన సదుపాయం లేదు. కానీ పదిహేను వందల ఏళ్ల క్రితం తెలుగు తీరం నుంచి బయల్దేరిన ప్రతి నౌకా అలనాటి జావా, సుమత్రా అంటే నేటి ఇండోనేషియాకు వెళ్లాయని చెప్పడానికి అక్కడ నేటికీ ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయి.

ఓ జర్నలిస్టుగా విదేశాల్లో తెలుగుజాతి ఆనవాళ్లపై పరిశోధనలు చేస్తూ మయన్మార్, మలేషియా, శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం దేశాలు వెళ్లొచ్చాను. నా పరిశోధన కొనసాగింపుగా ఇండోనేషియాలోని ప్రాచీన రాజ్యాలను అధ్యయనం చేయడం ప్రారంభించాను. ఈ విషయంలో సుప్రసిద్ధ చరిత్రకారులు భావరాజు వేంకట కృష్ణరావుగారు 1923 లో రచించిన 'ప్రాచీనాంధ్ర నౌకాజీవనము' రోడ్ మ్యాప్ లా ఉపయోగపడింది. ఈ గ్రంథంలో 'పల్లవ యుగము' శీర్షికలో "నాల్గవ శతాబ్దమందు వేంగీరాజులయిన పల్లవులు జావా, సుమత్రా ద్వీపములను జయించినట్లు గానబడుచున్నది. ఇటీవల కోహెను స్టువర్టుగారిచే గనుగొనబడిన రెండు శాసనముల వలన కాయి జావా లిపుల యుత్పత్తి బోధపడింది. ఈ శాసనములు రెండును సంస్కృత భాషయందు రచియింపబడియున్నది. వీనిలిపి ప్రాచీన వేంగీశాసనముల లిపిని బోలియున్నది.

ఆ ద్వీపములో బెయిటను బర్గునకు ఆనతిదూరముననున్న జాంపియా, జాంబో యను ప్రదేశములలోని కొండలపైని సంస్కృత శ్లోకము లతిమనోహరములుగా జెక్కబడియున్నవి.

ఈ కొండలపై హిందూ రాజుల పాదములు చెక్కబడియున్నవి. అచ్చటి శాసనము లందా ద్వీపములను జయించి రాజ్యమును స్థాపించినవాడు పూర్ణవర్మయని తెలుపబడినది. ఇంకను పూర్ణవర్మ శాసనములను బోలినశాసనములు మరికొన్ని కలవు.....".

అని ఆయన స్పష్టపరచారు. గట్టి ఆధారమే లభించిందని మరింత లోతుగా అక్కడ వలస రాజ్యాల గురించి తెలుసుకోవడం ప్రారంభించాను.

ఈ క్రమంలో నేను సేకరించిన సమాచారం గురించి ముందుగా ప్రస్తావిస్తాను.

శ్రీశైలం నుంచి వెళ్లినవారు....

ప్రముఖ స్కాలర్ లోకేష్ చంద్ర రచించిన 'లార్డ్ శివ అండ్ బుద్ధా ఇన్ ద గోల్డెన్ ఐల్స్.. ఇన్ సెర్చ్ ఆఫ్ క్లాసికల్ ఇండోనేషియా' పుస్తకం కొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలియజేసింది. Shailendras ruled in Central Java and migrated from Srisailam around the middle of the 6th century. They were adherents of Vajrayana, whose centre was Srisailam also Known as Sriparvata and Vajrapura.

ఇండోనేషియాలోని జావా ద్వీపంలో అతిగొప్ప రాజ్య పాలకులుగా పేరుతెచ్చుకున్న శైలేంద్రులు మన శ్రీశైలం నుంచి వలస వెళ్లినవారా? ఆర్. సి. మజుందార్ పరిశోధన గ్రంథం 'హిందూ కాలనీస్ ఇన్ ది ఫార్ ఈస్ట్' లో జావా, సుమత్రాల గురించి సవివరంగా ఉంది.


పశ్చిమ జావాలో అయిదు లేదా ఆరో శతాబ్దిలో పూర్ణవర్మ అనే రాజు శైలేంద్ర రాజ్యాన్ని స్థాపించాడని పేర్కొన్నారు.

మధ్య జావాలో ఎనిమిదో శతాబ్దిలో 'మాతరం' అనే మరో హిందూ రాజ్యం ఉండేదని కూడా మజుందార్ తెలిపారు. అయితే ఈ మాతరం రాజ్యాన్ని స్థాపించిన రాజు పేరు 'సన్న'. చక్కనిచిక్కని తెలుగు పేరు. శైలేంద్ర రాజులకు సంబంధించి అరబ్ రచయిత ఇబిన్ ఖుర్దాద్బెహ్ తొమ్మిదో శతాబ్దిలో పేర్కొన్న అంశం ఎంతో ఆలోచింపజేసేలా అన్పించింది. ఆనాడు జావాలో కోళ్ల పందాలు ఎక్కువగా జరిగేవట. రాజుకు ప్రతి రోజూ వచ్చే ఆదాయంలో పావు భాగం ఈ కోళ్ల పందాల నుంచే వచ్చేదని ఆ

అరబ్బు రచయిత పేర్కొనడం విశేషం. మన తెలుగు ప్రాంతాల్లో ఈనాటికీ కోడి పందాలు ఎంతటి ఉన్నత స్థితిలో ఉన్నాయో వేరే చెప్పక్కర్లేదు.

శైలేంద్ర రాజుల ఘనకీర్తికి మచ్చుతునక 'బొరొబుదూర్' అనే అద్భుత కట్టడం. ఇండోనేషియాలో నేడు టూరిజం పరంగా అత్యంత ప్రసిద్ధిచెందిన ప్రదేశం 'బొరొబుదూర్'. ప్రపంచంలో అతి పెద్దదైన రాతి స్థూపం ఇది. ఓ కొండనంతా తొలచి స్థూపంగా మలిచారు. ఎనిమిది అంతస్తులుగా ఉన్న ఈ స్థూపంలో ప్రదక్షిణ పథమంతా బుద్ధుడి కథల శిల్ప ఫలకాలతో అలంకరించారు. తొమ్మిదో శతాబ్దికి చెందిన ఈ స్థూపంలో బుద్ధుడికి సంబంధించిన శిల్ప ఫలకాలు 120 ఉంటే, సుధనుడు అనే ఓ యువకుడికి సంబంధించిన శిల్పఫలకాలు 460 ఉన్నాయి. రెండు, మూడు, నాలుగు అంతస్తులంతా ఈ సుధనకుమారుడి కథకే కేటాయించారు. బౌద్ధ వాఙ్మయంలో సుప్రసిద్ధమైన 'గండవ్యూహ సూత్ర' కథనంతా ఇలా శిల్పఫలకాల్లో రచించారు. ఈ కథంతా సుధనుడి చుట్టూ తిరుగుతుంది. బోధిసత్వుడిగా మారేందుకు మార్గాన్ని అన్వేషిస్తూ అతడు సుమారు 50 మంది గురువులను కలుస్తాడు. గండవ్యూహ గ్రంథ రచన క్రీస్తు శకం రెండు లేదా మూడు శతాబ్దాల్లో జరిగింది. విస్మయం కలిగించే విషయం ఏమిటంటే ఈ సుధనుడు మన ధాన్యకటకానికి చెందిన వ్యాపారి కొడుకని ఆ గ్రంథంలో స్పష్టంగా పేర్కొనడం. ధాన్యకటకంలో మొదలయ్యే ఈ కథ అక్కడే ముగుస్తుంది. మన అమరావతి అదే అలనాటి ధాన్యకటకం వ్యాపారి కొడుకు చరిత్రకు ఇండోనేషియాలో అంతటి ప్రాధాన్యం ఇచ్చారు.

బొరొబుదూరు వాస్తు గురించి ' జేమ్స్ ఫెర్గుసన్ తన ' హిస్టరీ ఆఫ్ ఇండియా అండ్ ఈస్టర్న్ ఆర్కిటెక్చర్' రెండో


బొజ్జన్నకొండ

వాల్యూమ్ లో బొరబొదూర్ స్థూపాకృతికి ప్రేరణ 'సంఘారామం'గా పేర్కొన్నారు.

విశాఖపట్నానికి సమీపంలోని బొజ్జన్నకొండకు సంఘారామమని మరో పేరు. ప్రముఖ చరిత్రకారులు మారేమండ రామారావు 'ఆంధ్రాస్ త్రూ ఏజెస్'లో 'గ్రేటర్ ఆంధ్రా' ఛాప్టర్లో ఈ విషయాన్ని బలపరచారు. అంతేకాదు బొరబొదూర్‌లోని శిల్పఫలకాలు అమరావతి స్థూపంలోని శిల్పఫలకాల మాదిరిగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఆనాడు జావాలో పూర్ణవర్మ రాజు 'గోసహస్ర దానం' చేశాడనీ, ఇక్ష్వాకులు, పల్లవులు, విష్ణుకుండినులు కూడా ఇలాంటి దానం చేయడం ఇక్కడ గుర్తుచేసుకోవాలని రామారావుగారు స్పష్టపరచారు.

ఇలా ఎన్నిటితోనో సంబంధం ఉన్నట్టుగా అన్పిస్తోన్న శైలేంద్రులు ఎక్కడి వాళ్లు, తెలుగు నేలతో వారికి ఉన్న అనుబంధం ఏమిటి? అన్న దిశలో లోతుగా పరిశోధనలు ప్రారంభించా. నా ప్రశ్నకు సమాధానం బెంగాల్ చరిత్రకారులు హెచ్.బి.సర్కార్ రచించిన 'ది కింగ్స్ ఆఫ్ శ్రీశైలం అండ్ ద ఫౌండేషన్ ఆఫ్ ది శైలేంద్ర డైనాసిటీ ఆఫ్ ఇండోనేషియా' వ్యాసంలో దొరికింది. ఇందులో ఆయన శైలేంద్ర డైనాసిటీకి సంబంధించి లభించిన తొలి శాసనం లిగర్ అని పేర్కొన్నారు. దక్షిణ భారత దేశానికి చెందిన పల్లవ లిపిలో ఉన్న ఈ శాసనం మలయా ద్వీపంలో దొరికింది. జావాలో లభించిన ఆనాటి శాసనాలు 'సిద్ధం' లేదా 'స్వస్తి'తో మొదలవుతున్నాయి. కృష్ణా డెల్టాలో లభించిన ఇక్ష్వాకులు, పల్లవుల శాసనాలు కూడా ఇలాగే మొదలవడం విశేషం. వీటిలో శక సంవత్సరాలనే వాడారు. ఇక్ష్వాకులకు శ్రీపర్వతీయులుగా పేరు. మేనరికపు పెళ్లిళ్లు చేసుకునే ఆచారం ఉండేది. శైలేంద్రులు కూడా ఇదే ఆచారాన్నిపాటించారు. ఇక్ష్వాకుల రాజధాని విజయపురి. నేటి నాగార్జునకొండ సమీపంలో ఉండేది. ఆనాడు విజయపురి దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రసిద్ధిచెందిన బౌద్ధ కేంద్రం. దేశవిదేశాల నుంచి అనేక మంది ఇక్కడికి వచ్చిపోతుండేవారు.

ఇక్ష్వాకులు తదనంతరం రాజ్య పరిపాలకులు తమ పేర్లకు మొదట రాజధాని పేరును కలుపుకునే క్రమాన్ని పాటించేవారు. గుంటూరు జిల్లాలో దొరికిన కొన్ని శాసనాలు శ్రీవిజయ స్కందవర్మ, శ్రీవిజయ శాతకర్ణి, శ్రీవిజయబుద్ధవర్మ అనే పేర్లతో లభించాయి. మలయా ప్రాంతంలో లభించిన లిగర్ శాసనంలో శ్రీవిజయేంద్రరాజ అనే ఉంది. విష్ణుకుండినుల మూల దేవత శ్రీపర్వత స్వామి. ఇక్ష్వాకుల అనంతరం, విష్ణుకుండినుల ప్రారంభానికి ముందు సుమారు 150 యేళ్ల పాటు ఈ ప్రాంతం అంతా రాజకీయ అనిశ్చితిలో ఉంది. ఈ సమయంలో ఇక్కడి నుంచి కొంతమంది రాజవంశీయులు జావా, సుమత్రా దీవులకు వెళ్లి వలస రాజ్యాలను స్థాపించి ఉంటారని హెచ్బీ సర్కార్ తేల్చిచెప్పారు.

భద్రంగా ఉన్న శాసనాలు...తెలుగు నేలతో ప్రత్యక్షంగా ఇంత అనుబంధం కలిగి ఉన్న ఇండోనేషియాను తప్పకుండా చూడాలనే ఉద్దేశంతో గత నెలలో ఆ దేశానికి వెళ్లొచ్చా, కూడా మా శ్రీవారూ వచ్చారు.. రాజధాని జకార్తాలో అడుగుపెట్టగానే తొలిసారిగా ఆ దేశంలో పర్యటిస్తున్నందుకు అభినందిస్తూ వీసా మినహాయింపు ఇచ్చింది అక్కడి ప్రభుత్వం. జకార్తా పెద్ద నగరమే. పెద్ద పెద్ద రోడ్లున్నాయి కానీ ట్రాఫిక్ కూడా ఎక్కువే. టూవీలర్ల సంఖ్య కార్లను మించిపోయింది. ముందూ వెనకా ఎవరు

పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

పాదముద్ర



పూర్ణపత్ర



కూర్చున్నా తప్పకుండా హెల్మెట్లు పెట్టుకుంటున్నారు. టూరిస్టులు ఫ్రీగా సిటీ అంతా తిరిగేందుకు ప్రభుత్వం ఏసీ డబుల్ డకర్ బస్సుల్ని ఏర్పాటుచేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ బస్సుల్లో ఎన్ని సార్లైనా ఎక్కి ఏ ప్రదేశమైనా వెళ్లిరావచ్చు నయా పైసా ఖర్చులేకుండా.

టూరిస్టు ప్లేసులకన్నా నా ధ్యాసంతా శాసనాల మీదే. అందుకే ముందుగా మేం నేషనల్ మ్యూజియం వెళ్లాం. సువిశాల కారిడార్లో ఎన్నో శిలా శాసనాలు ఆరు బయటే ఉన్నాయి. వాటిల్లో మన జాంబి శాసనాలు ఎక్కడున్నాయో అని వెతికాను. కానీ నిరాశే. నాలుగు అంతస్తులుగా ఉన్న మ్యూజియం భవనంలోకి ప్రవేశిస్తుంటే పక్కనే కన్పించింది 'తెలగ బాతు శాసనం'. పల్లవ లిపిలో ప్రాచీన మలయా భాషలో ఈ శాసనం ఉన్నట్టుగా అక్కడ పేర్కొన్నారు. ఇదో ప్రమాణ శాసనం. రాజుకు ఎల్లవేళలా విధేయుడిగా ఉంటామని సిబ్బంది చేత ప్రమాణం చేసేది. ఒకటో అంతస్తుకు వెళితే.. పూర్ణవర్మ శాసనాలు, అతడి పాద ముద్రలుగా పేర్కొంటోన్న పెద్ద రాతి బండను కూడా హాలు మధ్యలో ప్రదర్శనలో ఉంచారు. ఎంతో ఆశ్చర్యం కలిగింది. వందేళ్ల క్రితం భావరాజుగారు పేర్కొన్న పూర్ణవర్మ పాదముద్రలు నేటికీ చెక్కుచెదరలేదు. ఏసీ గదిలో భద్రంగా ఉన్నాయి. పదిహేను వందల సంవత్సరాల తరవాత నాలాంటి దూరపు చుట్టాలు వచ్చి పలకరిస్తారేమో అని ఎదురుచూస్తున్నట్టుగా ఆ పాదముద్రలు కన్పించాయి. అక్కడ పూర్ణవర్మ వేయించిన కొన్ని శాసనాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ జాంబి అనే ప్రదేశంలో దొరికాయట. జాంబి అనేది నేటి సుమత్రా ద్వీపంలోని పాలెంబాంగ్ సమీపంలోని ప్రదేశమట. ఈ ద్వీపంలో అతి పెద్ద నది పేరు మూసి. ఈ నది పాలెంబాంగ్ ను రెండుగా విడదీస్తోంది. 'తెలగ బాతు శాసనం', 'తెలంగ్ తువో శాసనం', 'తూగు శాసనం' ,కోటకాపుర్ శాసనం'.. ఇలా ఇక్కడి శాసనాల పేర్లు కూడా తెలుగు భాషతో దగ్గర సంబంధం ఉన్నట్టుగా అన్పించింది. కోటకాపుర్ అనే గ్రామంలో దొరికిన శాసనానికి ఆ పేరే స్థిరపడిపోయిందట.

మ్యూజియంలో అన్ని అంతస్తులూ సెంట్రలైజ్డ్ ఏసీ, ఎస్కలేటర్, లిఫ్టులతో అధునాతనంగా ఉన్నాయి. రెండో అంతస్తులో కూడా మరి కొన్ని శిలాశాసనాలు ఉన్నాయి.

'కారెక్టర్స్ అండ్ లాంగ్వేజ్ ఇన్ ఇండోనేషియా పల్లవ, నగరి అండ్ తమిళ్' అనే కాప్షన్ కింద ఇండోనేషియాలో ఇండియాలాగానే ఎన్నో జాతులు, వాటికి సంబంధించి అనేక భాషలు, లిపులు ఉన్నాయని అక్కడి గోడ మీద నిలువెత్తు అక్షరాలతో పేర్కొన్నారు. వీటిలో కొన్ని క్రీస్తు శకం 5 నుంచి 15 శతాబ్దిలోపు పల్లవ, నగరి, తమిళ లిపుల నుంచి అభివృద్ధి చెందాయని రాశారు. పల్లవ లిపి దక్షిణ భారత దేశ పల్లవ సామ్రాజ్యం ఏర్పడిందని, ప్రాచీన జావ, సుండనీ, బాలి లిపులకు మూలం పల్లవ అక్షరాలే అని అక్కడ స్పష్టపరచడం విశేషం.

మన పల్నాడు నుంచే ప్రారంభమైన పల్లవుల చరిత్ర గురించి ఆ దేశ మ్యూజియంలో తెలుసుకోవడం కించిత్ గర్వంగా అన్పించింది.

అతి పెద్ద రాతి స్థూపం ఇక నా పరిశోధనలో ఎంతో ఆసక్తిగా అన్పించిన బోరొబుదూర్ కు వెళ్లాలంటే జకార్తా నుంచి మధ్య జావాలోని జోగ్యకర్త అనే నగరానికి వెళ్లాలి. ఓ గంట విమాన ప్రయాణం. జోగ్ సాధారణ నగరం.

అక్కడి నుంచి కారులో గంటన్నర ప్రయాణం చేస్తే బొరొబుదూర్ ముందు వాలిపోవచ్చు. బొరొబుదూర్ ప్రపంచ వింతల్లో ఒకటి.

బొజ్జనకొండ స్ఫూర్తితో నిర్మించిన బొరొబుదూర్ ను చూడడానికి రెండు కళ్లూ చాలవు. విదేశీయులకు 25 యుఎస్ డాలర్లను ఎంట్రీ ఫీజుగా తీసుకుంటున్నారు. బొరొబుదూర్ ఆర్కియాలాజికల్ పార్క్ కాంప్లెక్స్ చాలా సువిశాలమైంది. అల్లంత దూరం నుంచి చూస్తే ఓ పెద్ద చతురస్రాకార భవనంలా ఈ స్థూపం కన్పిస్తుంది. 35 మీటర్ల ఎత్తుతో మండలం ఆకారంలో ఎనిమిది అంతస్తులుగా దీన్ని నిర్మించారు. ఓ పెద్ద కొండనంతా

తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి



తొలచి స్థూపంలా మలచారు. నాలుగు వైపులా మెట్ల దారుల్లో కొండ పై భాగానికి చేరుకోవచ్చు.

మొత్తం 504 బుద్ధ విగ్రహాలు ఈ స్థూపంలో ఉన్నాయి. రెండు అంతస్తులుగా ఉండే బొజ్జన్నకొండలో కూడా కొండను తొలచి బుద్ధుడి విగ్రహాలను చెక్కారు. ఓ గూటిలాంటి అమరికలో బుద్ధుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. రెండిటిలో సారూప్యత కొట్టొచ్చినట్టుగా కన్పిస్తుంది. అయితే బొజ్జన్నకొండ క్రీస్తు శకం 4 నుంచి 6 శతాబ్దికి చెందింది. బొరొబుదూర్ తొమ్మిదో శతాబ్దికి చెందింది. బొజ్జనకొండ ఓ అద్భుతం అయితే బొరొబుదూర్ కాలక్రమేణా రూపాంతరం చెంది మహాద్భుతంగా వెలసింది. సుధన కుమారుడిని చూడాలన్న ఆత్రంతో పక్కనే ఉన్న గైడ్ ను అడిగాను. ఆ దేశంలో ఇంగ్లిష్ వాడకం తక్కువ. నేను అడిగింది అతడికి అర్థం కాలేదు. మరో ప్రయత్నంగా 'గండవ్యూహ ప్యానల్స్' అని చెప్పాను. అతడు రెండో అంతస్తుకు తీసుకువెళ్లాడు. అక్కడి శిల్పఫలకాల్లో గురువు దగ్గర వినయంగా కూర్చున్న సుధనుడి శిల్పాన్ని పోల్చుకోవడం కష్టం కాలేదు. అలా మూడు అంతస్తుల్లో సుధనుడి కథ ఉంది. అమరావతి శిల్ప రీతికి సంబంధించిన మరో విశేషమూ అక్కడ ఉంది. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిహ్నమైన అమరావతి స్థూపానికి చెందిన పూర్ణఘటం మాదిరిగా ఉన్న శిల్ప ఆకృతులు అక్కడ ఎన్నో చోట్ల కన్పించాయి. దీన్ని నిర్ధారించుకునేందుకు ప్రముఖ ఆర్కియాలజిస్ట్ ఈమని శివనాగిరెడ్డిగారికి బొరొబుదూర్ స్థూపం పై నుంచే వాట్సప్ కాల్ చేశా. ఆ ఇమేజ్ లను షేర్ చేశా. ఆయన వెంటనే స్పందిస్తూ అది పూర్ణఘటం కాదని బుద్ధుడి ధాతువులున్న పాత్రలని పేర్కొన్నారు. అయితే వీటి డిజైన్లో మాత్రం సారూప్యత ఉందని ఆయనా అంగీకరించారు. అలాగే స్థూపం విశేషాలను చూస్తూ పై భాగానికి చేరుకున్నాం. చుట్టూ కొండలు, పచ్చని పొలాలు.. ఎంతో అహ్లాదకరంగా ఉంది. అయితే భూకంపం బారిన పడి ఇదంతా కొన్ని శతాబ్దాల పాటు మరుగున పడిపోయిందట. 1815లో సర్ స్టామ్ ఫర్డ్ రాఫెల్స్ ఈ స్థూపాన్ని కనుగొని పరిశుభ్రపరచాడట.

1956లో యునెస్కో సహాయంతో అక్కడి ప్రభుత్వం స్థూపాన్నంతా పునరుద్ధరించి నేటి ఈ రూపును తీసుకువచ్చింది. ఎందరో టూరిస్టులు బొరొబుదూర్ స్థూపం చూడడానికి వస్తున్నారు. అందులో విదేశీ, స్వదేశీ టూరిస్టులు ఉన్నారు. నేడు ఇండోనేషియా ప్రపంచంలో అతి పెద్ద ముస్లిం దేశం. కానీ వాళ్లు తమ వారసత్వ సంపదలైన హిందూ, బౌద్ధ నిర్మాణాలను ఎంతో గొప్పగా సంరక్షిస్తున్నారు. బొరొబుదూర్ ను నిర్మించి పన్నెండు వందల ఏళ్లయింది. ఎన్నో సార్లు భూకంపాలు, అగ్నిపర్వతాల దాడులకు గురైంది. అయినా అక్కడి ప్రభుత్వం ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేస్తూ పరిరక్షిస్తోంది. అందుకే అలనాటి రూపం చెక్కుచెదరకుండా ఉంది. ఎన్నో శిల్ప ఫలకాలను కలిగిన అమరావతి, నాగార్జునకొండ స్థూపాలు యథావిధిగా నేడు ఉన్నట్లయితే బొరొబుదూర్ ను మించిన ఖ్యాతి మన నేలకు వచ్చేది. ప్రపంచ టూరిస్టు మ్యాప్ లో తెలుగు, నేల ముందుండేదని అన్పించింది.

విదేశాల్లో తెలుగు జాతి వారు వేల ఏళ్ల క్రితం నిర్మించిన కట్టడాలు అలాగే నిలచి ఉండి మన కీర్తిపతాకాల్ని రెపరెప లాడిస్తున్నాయి. 'ఈ బొరొబుదూర్ స్థూపానికి ప్రేరణ మా బొజ్జన్న కొండ.. ఇక్కడ మా ధాన్యకటకం వ్యాపారి కొడుకు సుధనకుమారుడి గురించి కథలు కథలుగా చెక్కారు... అన్నిటికీ మించి ఈ స్థూపాన్ని నిర్మించింది మా తాతముత్తాతలు ...' అని ఆ స్థూపం పై నుంచే ఎలుగెత్తి చాటాలన్న ఆవేశం వచ్చింది. కానీ అక్కడ నా భాష ఎవరికీ అర్థం కాదు. కనీసం ఈ వ్యాసం చదువుతున్న మీకైనా అర్థం అవుతుందని ఆశిస్తున్నాను. క్రీస్తు శకం 14 వ శతాబ్ది కాలంలో అరేబియా సముద్రంలో యూరోపియన్లు ఎలాంటి సాహసాలు చేశారో...

అంతకు రెట్టించిన సాహసాలను క్రీస్తు శకం తొలినాళ్లలోనే మన తెలుగు జాతి వారు హిందూ మహాసముద్రంలో చేశారు. అనుకూలించిన ప్రతి నేల మీదా వలస రాజ్యాలను స్థాపించారు. చారిత్రక ఆనవాళ్లను విడిచిపెట్టారు. వాటిని వెలికి తీయడానికి మనకు కాస్త ఓపికా, తీరికా ఉండాలి అంతే.

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
9441427977

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీ భాషా దశాబ్దం



'ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడికన్పించని కథలన్నీ కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం' శ్రీశ్రీ

కె.యం.మున్షీ గుజరాత్ సాహిత్య చరిత్ర (1935) ముందు మాటలో మహాత్మా గాంధీ 'ఇదంతా లిఖిత సాహిత్య చరిత్ర. కానీ చాలా జాతులు,తెగలు మాట్లాడే భాష మనకు అర్థమే కాదు,వాళ్ళ సాహిత్యం ఉంటుంది.కానీ మనకు తెలియదు'అంటూ విచార పడతారు. అభివృద్ధి,సంస్కారం పేరిట చూపించే ఆధిపత్య ధోరణులవల్ల నలిగి, చితికిపోతున్న అదోజగత్సహోదరులు ఆదివాసుల ఆత్మఘోష వినిపించే ఐక్య రాజ్య సమితి ప్రయత్నమే ఈ సందర్భం.

తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఇటువంటి ప్రయత్నాలను సవరభాష బోధించటానికి కృషిచేసిన గిడుగు రామమూర్తి పంతులుగారిని తలచుకుంటూ మొదలు పెట్టాలి. అయన వాచకాలతో, కథలసేకరణతో ఆగలేదు.కారా మాస్టారి యజ్ఞం కథను తలపించే మధుకేశ్వరుని స్థలపురాణం తెలియచేసే శ్రీముఖలింగం శాసనం పరిష్కరించారు.

గుణుపూరు పితూరీ/ తిరుగుబాటులగూర్చి సవరలచేతనే చెప్పించారు.జిల్లా జడ్జిగా పనిచేసిన జయంతి రామయ్య పంతులు గారినుండి గిరిజనులను విచారించిన కొన్ని తీర్పులను సేకరించి, తప్పుడు సమాచారంతో కేసులను నడిపిస్తున్న తీరును, తన విడుదలకు ఉపయోగించుకునేది బదులు దొంగ సాక్ష్యాలను ఎండగట్టే సవరల ముక్కుసూటితనాన్ని వివరించారు.(సవర కథలు ఎమెస్కో ప్రచురణ) చాలా తెలుగుప్రాంతాలు ఒరిస్సా రాష్ట్రంలోకి వెళ్లిపోయినందుకు బాధతో, కోస్తా ప్రాంతానికి తరలి పోవటంతో గిరిజనుల గూర్చి అయన ప్రారంభించిన బహుముఖమైన కృషి ఆగి పోయింది. కానీ ఆ ప్రయత్నం , నాటి దొరతనం గిరిజనప్రాంతాలకు అప్పటికేఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ వ్యవస్థకు తగిన రూల్స్ ను 1924లో రూపొందించటానికి తరువాత,తరువాత దారి తీసింది.

అయితే మైదాన ప్రాంతాలలో యానాది ఎరుకల చెంచు తెగలను అదుపుచేయటానికి నేరస్థ జాతుల చట్టం ద్వారా హింసించటాన్ని 1940లనుండి ఎదిరించి,ఆ వర్గాలలో ఆత్మవిశ్వాసం పెంచటంతో పాటు,వారిసంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేసి, ఆంగ్లంలో తెలుగులో అనేక రచనలు చేసిన వెన్నెలకంటి రాఘవయ్య పౌరహక్కుల ఉద్యమానికి మూలపురుషుడు.ఆయన రచనలలో 'యానాది'ని నెల్లూరు యానాది సమగ్ర గిరిజనాభి వృద్ధి సంస్థ పునర్ముద్రించింది. అయన నెల్లూరు యంగ్ ఇండియా పత్రికలో వ్రాసిన తనజీవిత చరిత్ర,కథలతో పాటు ఆయన రచనలన్నీ సేకరించి ప్రచురించాలి.

నల్లమల ముఖద్వారం వినుకొండదగ్గర కొన్ని గ్రామాలకు చెంచు పాలెగాడు రామనాయక్. అతడు తెల్లవారినుండి తప్పించుకుని వచ్చిన తిరుగుబాటుదారుకు ఆశ్రయమిచ్చాడు.రామనాయకుడిని ఉరితిసి, అతడిని పట్టి ఇచ్చిన జమీందారుకు ఆ గ్రామాలు బహుకరించారు. పాలెగాళ్ళ వారసుడు నల్లమల మరో ముఖద్వారం నంద్యాల లోపల గిద్దలూరు నుండి పోరాడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో పాటు, ఇటువంటి గిరిజన వీరులను కూడా తలచుకోటం మనం మరిచి పోకూడదు.చెంచులక్ష్మి, ఎరుకలసాని, హాథీరాం బావా ,భక్త కన్నప్పలను తలచుకోవటం సరిపోదు, ఈ ప్రజాస్వామ యుగంలో ఆ యా వర్గాలకు దేవాలయ మర్యాదలలో సముచిత స్థానం ఇవ్వాలి.

తూర్పు కనుమలలో సవరలు కోందులు మొదలైన తెగలు వేద శాస్త్ర కాలాల నుండి ప్రసిద్ది పొందినవారు. అక్కడి రాజులందరూ ఈ కొండరాజులతో 'నేస్తం' కట్టుకుని,ఇచ్చిపుచ్చుకుని ,సంబంధాలు కలుపుకుని తమకు అండగా మలుచుకునేవారు.

తెల్లవాళ్ళ దెబ్బకు ఈ రాజులు లొంగారు. కానీ కొండవాళ్ళు లొంగలేదు. వారిమీద దాడిచేయటానికి నరబలిని అరికట్టటం అనే సాకుతో ప్రవేశించి సాయుధ సంస్కరణలకు పూనుకున్నారు.నరబలి బదులు దున్నపోతులు,గుమ్మడికాయలు ఇలా మనం క్రమంగా మార్చుతున్న పద్ధతులను అధికారమదం వల్ల తెల్లవాడు అర్థం చేసుకోలేక పోయాడు. బంజారాల గురువు సేవాలాల్ మద్యం మాంసం ముట్టవద్దని ప్రబోధిస్తాడు.ఇలా కాలానుగుణంగా మార్పుకోసం గిరిజనులు తమవంతు ప్రయత్నాలు చేస్తూనే వచ్చారు.

అంతేకాదు, ఒక చోట ఉండరని,పోడువ్యవసాయం చేసి అడవి పాడు చేస్తారని, స్థిరమైన జీవనాధారం లేని దేశదిమ్మరులని, కుదురుగా కాపురం చేయరనే నెపం వేసి మైదాన ప్రాంతాలలో గిరిజనులను కట్టడి చేయటాన్ని రాఘవయ్యగారు దుయ్యబడతారు.

కృష్ణదేవరాయలు కళింగ దండయాత్రలో గజపతులను ఓడించాడు.గజపతుల సామంతులైన కోస్తా పాలకులు కొందరు అడవులు పట్టారు.తూర్పుకనుమలలో కొండదొరల ప్రాచీన రాజధాని నందపురం(తరువాత జైపూర్) కొలువులో చేరారు.వారినుండి దిగువప్రాంతాలలో మొఖాసాలు పొందారు.సింహాసనంకోసం

పోటీపడిన అన్నదమ్ములలో ఒకరిని సమర్థించారు. బదులుగా నందపురంతో పాటు, సాలూరు పాలకొండ, కురుపాం, మాడుగుల, గొలుగొండ గిరిజన సంస్థానాలను తమ సామంతరాజ్యాలుగా ప్రకటించుకుని, విజయనగర సంస్థానంగా బలపడి, వారిమీద పెత్తనం చేయసాగారు. వారి ధోరణికి నిరసనగా, పద్మనాభంలో బ్రిటిష్ వారికీ విజయనగరం వారికీ జరిగిన యుద్ధంలో కొండదొరలు తటస్థంగా ఉండిపోయారు.

విజయనగరం విద్యలనగరంగా అభివృద్ధి చెందుతుంటే , కొండదొరలు విశాఖపట్నం అభివృద్ధి చేసారు.జైపూరు సంస్థానం చివరి పాలకుడు విక్రమదేవవర్మ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి భూమి, భూరి విరాళమిచ్చి కులపతి అయినాడు. రాజమహేంద్రవరంలో విక్రమహాల్, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో కాలేజ్ ఆఫ్ సైన్సు టెక్నాలజీ దానిముందు అయన విగ్రహం, హవామహల్ ,కురుపాం మార్కెట్,విశాఖ తాజమహల్, రాణి చంద్రమతి ఆసుపత్రి ...ఇవన్నీ విశాఖ నిర్మాణంలో గిరిజనుల/కొండదొరల పాత్రను గుర్తుచేస్తాయి. వీరందరూ యధాశక్తి కవి పండితులను పోషించారు.కళలను ఆదరించారు.

గిరిజనజీవితంలో వస్తున్న ఒడిదొడుకులకు వారిసంప్రదాయ సాహిత్యం అద్దం పడుతుంది. తెలంగాణా లో సమ్మక్క సారక్క జాతర, ఆంధ్రప్రదేశ్‌లో మోదకొండమ్మ పండుగలను గిరిజనోత్సవాలుగా రాష్ట్రప్రభుత్వాలు ప్రకటించాయి. సమ్మక్క సారక్క కథలు కాకతీయులతో గిరిజనుల సంబంధాలను వివరిస్తున్నట్లే, మోదకొండమ్మ గేయగాధ- కొండ, దిగువ వారి మధ్య చోటుచేసుకుంటున్న వివాహ సంబంధాలను, వారిమధ్య అపోహలు విషాద పరిణామాలకు దారితీయటం,మరోపక్క మన్యంలో పెరుగుతున్న అంతరాలు, అస్పృశ్యతలు వీటిని పరిష్కరించుకుని ముందుకు పోవలసిన ఆవశ్యకతను నొక్కిచెపుతుంది.

నందపురం రాకుమారులు దేసిరాజులు, దిగువన మత్స్యదేశం రాకుమార్తెలు దుర్గండ్లకు మేనరికం వరుస. కానీ దిగువరాజుకు కొండవారంటే చిన్నచూపు.కుమార్తెలకు దిగువ సంబంధాలు చూస్తుంటాడు కానీ అవి ఎంతకూ కుదరటం లేదు.. ఇంతలో దేసిరాజులు- దుర్గండ్లు ఇష్టపడి కల్యానపులోవలో గాంధర్వ వివాహం చేసుకుంటారు.అది దిగువరాజు దృష్టిలో దొంగపెండ్లి.దానికి దేసిరాజులను లాంచనంగానన్నా శిక్షించకపోతే రాజ్యంలో తన పరువుపోతుంది.

అతడు, దేసిరాజులను పిలిపించి సంకెళ్ళు వేసి, ఏడు గడియల శిక్షవిధించి, ఖైదు చేస్తాడు.మామ చేతిలో ఇటువంటి శిక్షను అవవమానంగా భావించి వారు ఆత్మ హత్యచేసుకుంటారు.అప్పటికి మోదమ్మ గర్భవతి.ఆమెకు పుట్టిన కొడుకు సంజీవరాజు, మాలగంగు ప్రేమలో పడతాడు. ఆమె గ్రామబారిక కూతురు. మన్యప్రజలకు- దిగువ బేరగాళ్ళతో, అధికారులతో పనులు జరిపించేది గ్రామ నౌకరులైన ఈ బారికలే.

అంటరాని కులంపిల్లను ప్రేమించిన సంజీవరాజును మన్యం కట్టుబాటు ప్రకారం వెలివేయాలి.వెలివేస్తే అతనికి రాజ్యార్హత పోతుంది. దిగువ పద్ధతి ప్రకారం ఉంపుడు గత్తెగా ఉండటానికి అభిమానవతి అయిన గంగ ఒప్పుకోదు. ఎదీ తేల్చుకోలేని దుర్గండ్లు నందపురం రాణి మహంకాళి శక్తికి కబురు పంపుతారు. ఆమె గంగ మర్యాద మన్ననలకు, ఆత్మాభిమానానికి సంతోషిస్తుంది. చుట్టుముడుతున్న తెల్లవాళ్ళు, దిగువవాళ్ళతో నెగ్గుకు రావాలంటే వ్యవహార దక్షులైన నౌకరులని అస్పృశ్యులని దూరంగా పెట్టడం, తక్కువగా చూడటం తగదు,వాళ్ళను కలుపుకు పోవాలి అని రైతు, రాణువను ఒప్పించి వారికి గౌరవంగా పీటలమీద కళ్యాణం చేసి పట్టాభిషేకం చేస్తుంది.

మరో నందిపండుగ పదంలో 'పంచపాండవులపంట దుర్యోధనుడి వంట కొండవారి పంట దిగువవారి వంట' అంటూ మహాభారతకదను తమ కనువుగా మలుచుకొన్నారు ఇటువంటి గిరిజన సంప్రదాయసాహిత్యాన్ని రచయితలెవరూ పట్టించుకోలేదు. కానీ ఇటీవలే ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సంచాలకులు రూపక రచయిత శ్రీ విజయభాస్కర్ మోదకొండమ్మ పాటను,నందిపదాన్ని రంగస్థలానికి అనువుగా మలుస్తున్నారు..

హైదరాబాదు కేంద్రీయ విశ్వ విద్యాలయంతో కలసి,పారిస్ లోని ఇనాల్కో సంస్థ లో తెలుగు బోధించే మానవ శాస్త్ర వేత్త శ్రీ డానియల్ తెలుగు గిరిజనుల పటాలను ఫ్రెంచ్ లోకి అనువదిస్తున్నారు.గొండు,ప్రధాన,కొలామి పాటలను ఆదిలాబాద్ ఆకాశవాణి రికార్డ్ చేస్తున్నది. గిరిజనులు చాలామంది కథలు రాస్తున్నారు.

సంప్రదాయజ్ఞానాన్నిసేకరించేందుకు యువతరం ముందుకురావటం విశేషం.

ఉద్యమసాహిత్యం,అనువాద సాహిత్యం తప్ప, భూమి అడవి నీరు కోసం గిరిజనులు చేస్తున్న ప్రయత్నాలలో ఆలోచనపెంచే ప్రయత్నాలు రచనలలో కనిపించవు. దళిత గిరిజనుల సాధికారితకు కృషిచేసిన శ్రీ శంకరన్ హయాంలో ఏజెన్సీ భూముల సర్వే చేపట్టారు. నేడు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి శ్రీ పి.వి.రమేశ్ ఆదిలాబాదు జిల్లా సబ్ కలెక్టర్ గా చేపట్టిన ఈ సర్వేమీద అయన రాసుకున్న వ్యాసాన్ని అనువదించి 2007లొ నడుస్తున్న చరిత్ర ప్రచురించింది. అటవీ హక్కుల గుర్తింపుకోసం తెగల వారీగా వాడుకునే పదాలను ప్రకటించారు. దిగజారిపోతున్న గిరిజనుల బతుకులను చిత్రించే రచనలు చాలా వస్తున్నాయి కానీ ఈ జ్ఞానాన్ని ప్రజలోనికి తీసుకుపోయి అధికారులను ప్రశ్నించే చైతన్యం గిరిజనులలో పెంచే రచనలు రావటంలేదు.గిరిజన సంక్షేమ శాఖలో, బయటా పేరు మోసిన రచయితలు వక్తలు తత్వవేత్తలు ఉన్నారు. వారు గిరిజన వారసత్వాన్ని, చట్టాలు తెచ్చి ఆచరణలో పక్కదారి పట్టిస్తున్న పోకడలను చిత్రిస్తూ, జాగరూకులనుచేసే ప్రయత్నం చేయాలి. మన సమకాలికులైన మనపూర్వులు గిరిజనులలో మన భాష ,సంస్కృతి మూలాలను వెతుక్కోవాలి.

'చావలేదు, అంధ్ర గిరిజనుల మహోజ్వల చరిత్ర.
హృదయములు చీల్చి చదువుడో సదయులార!'

విశాఖలో మోదకొండమ్మ తుమ్మెద పదం



మినుములూరులో మోదకొండమ్మ పాదాలు



పాతపాడేరులో గంగుగారిపాదాలు

'శరణు శరణు దుర్గాలమ్మలు మీ చరణాలు తప్పలేను
మీ చరణాలు తప్పినగాని మీ కరుణలు తప్పలేము.
మీలాటి కాలము రాగ మిమ్ము తలచి పాడుతాము.'

విశాఖ మన్యంలో గిరిజనుల ఇలవేల్పు మోదకొండమ్మ. ఆమె కథను ఆల, తుమ్మెద పదాలుచేర్చి గిరిజనులు పాడుకుంటారు. చరిత్ర మీద ఆధారపడి అల్లుకున్న ఈ పదంలో కొండ, దిగువ వారి ఆలోచనలు,ఇచ్చి పుచ్చుకోటాలలో తేడాలు, తగాదాలు మాత్రమే కాక, మన్యంలో తెగలమధ్య ఎక్కువ తక్కువలు చిత్రిస్తూ,ఎటువంటి మార్పురావాలో సూచిస్తుంది.

ఒడిశా రాష్ట్రంలో కోరాపుట్ జిల్లాలో జైపూర్ సంస్థానం చాలా ప్రాచీన మైనది. ఆ సంస్థానం ఆఖరి పాలకుడు విక్రమదేవ వర్మ ఆంధ్ర విశ్వవిద్యాలయం కులపతి. హవామహల్ వారి విడిది.

జైపూర్ పూర్వపు రాజధాని నందపురం .ఈ నందపురం, ఉజ్జయిని పాలించిన, అయోధ్యలో రామాలయం నిర్మించిన విక్రమాది త్యుని కుమార్తె ప్రభావతి దేవి రాజ్యంలోది. నందపురం లో 32 మెట్లతో విక్రమాదిత్యుడి సింహాసనం ప్రసిద్ధమైన చారిత్రక కట్టడం.

'అందమైన నందపురము నంది ఆటలె వద్దాం, తియ్య గుమ్మడి తీసి వద్దాం, మళ్ళు గుమ్మడి మరలి వద్దాం' అని గిరిజనులు పాడుతుంటారు

ఆ నందపురం రాణి మహాకాళి/మాకలి శక్తి. ఆమె కుమారుడు భైరవుడు. అతని భార్య దేవేంద్రాలు కొండ దిగువన వద్దాది రాజధానిగా మత్స్య దేశాన్ని పాలించే దేవేంద్రుని చెల్లెలు. దేవేంద్రుని భార్య రాచగన్నియ భైరవుని చెల్లెలు. నందపురం యువరాజులు దేసిరాజులు. వద్దాది రాకుమార్తెలు దుర్గండ్లు.

ఇటుకల పండుగలో ఒకో ప్రాంతం చూసుకుంటూ దేశిరాజులు మత్స్య రాజ్యంలోకి ప్రవేశిస్తారు. ఆటపాటలతో బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తూ బంతి భోజనాలు పెట్టటానికి వడ్డుదంచుతున్న దుర్గండ్లు దేసిరాజులు ఎదురు పడతారు. చాటున ఉండి అల్లరి చేస్తున్న దేసిరాజులను వారు తిట్టిపోస్తారు. క్రమంగా ఒకరికొకరు తమ మేనరికపు వరుసలు తెలుసుకుని ప్రేమలో పడతారు. సరదా సంతోషాలలో మునిగి పోతారు. తమ తండ్రి తమకు దిగువ సంబంధాలు చూస్తున్నాడని, దేసిరాజులతో తమపెళ్లికి ఒప్పుకోడని బాధపడతారు..

ఇద్దరికీ ఇష్టమైతే, తమ దేశం పద్ధతిప్రకారం గాంధర్వ వివాహం అంటే దొంగ పెళ్లి చేసుకోవచ్చని దేసిరాజులు దుర్గండ్లకు నచ్చ చెపుతారు. తొందర పెడతారు. వారు దొంగపెళ్ళి చేసుకున్నదే 'కళ్యాణపు లోవ'

ఈ వార్త తెలిసి, 'మా అప్ప మాకలి శక్తికి బుద్దిలేద!మా బావ భైరవుడికి జ్ఞానం లేద!! ఎదురుగ వస్తే ఇయ్యకపోదున!!! ఈ దొంగ పనులేమిటి' అంటూ దేవేంద్రుడు మండిపడతాడు. అడిగితే పీటలమీద గౌరవంగా పెండ్లి చేద్దునుగద అంటూ కోప పడతాడు. దొంగపని చేసినందుకు అల్లుళ్ళను సంకెళ్ళతో బంధించి తెప్పించి, ఏడు గడియల శిక్ష వేసి జైలులో పెడతాడు. వెలి, తప్పు, జరిమానా, ప్రాయశ్చిత్తం తప్ప ఇటువంటి శిక్షలు ఎరుగని దేసిరాజులు అవమానంతొ కుంగిపోయి ఆత్మహత్య చేసుకుంటారు. తన అల్లుళ్ళు పోయినందుకు దుర్గండ్ల తల్లి, నందపురం ఆడపడుచు రాచగన్నియకూడా పొడుచుకుని చచ్చిపోతుంది.

అప్పటికే దుర్గండ్లకు పెద్దది మోదమ్మ గర్భవతి. ఆమె మినుములూరు ప్రవేశించి మోదకొండమ్మ అయి కొండరాజ్యాన్ని పాలించ సాగింది.

కొడుకులు దేసిరాజులను పోగొట్టుకున్న తన దురదృష్ఠానికి విచారపడుతూ నందపురం భైరవరాజు తీర్థయాత్రలకు బయలు దేరతాడు. 'పల్లాన పదివేయిల మాయల వాడు' దేవేంద్రుడుకూడా అతనితో కలిసి లేనిపోని పరీక్షలు పెడతాడు. మాయలు చేస్తాడు. శుద్ధికోసం సముద్రస్నానాలు చేద్దాం అని తీసుకు వెళతాడు. సముద్రం ఎరుగని భైరవుడు కెరటాలకు కొట్టుకు పోయి మునిగిపోతాడు.

మోదకొండమ్మకు భుజం మీద దేగతో సంజీవరాజు జన్మి స్తాడు. ఒకరోజు అతడు వేట మార్గాన బయలుదేరతాడు. ముందు

దేగ దారి తీస్తుంది. అదేసమయంలో గ్రామనౌకరు/బారిక/కోలగాని సామాజిక వర్గానికి చెందిన గంగు గారు, వారి అప్పతో కలసి పాత పాడేరు లోని పూలగండువనంలో ఆలపాటలు పాడుతూ అడవి కూరలు ఏరుతుంటుంది.

దేగను చూసిన గంగుగారు, వెనక వస్తున్న సంజీవరాజును ఆట పట్టించాలనుకుంటుంది.

'ఓ పాడవీటి పట్టపు దేగ - పాటకైన నా వాడ రావో,

సరవాల సంజీవి దేగ సరదాకైన నావాడ రావో' అని కోరుకుంటుంది.

'చిట్టిమువ్వల చిన్న మరిది - శిరసుకు దండమ్ముబంగారు మువ్వల బాల మరిది-నీ పాదాలకు వందనము వేనూరిచ్చిన వెండి కుచ్చుల దేగ -బంగారు కుచ్చుల బాలదేగ' అంటూ దేగతో, మరిది వరుసకలుపుకుంటూ దాన్ని బుట్ట కింద దాస్తుంది. సంజీవరాజు దేగను జాడ చెప్పమని వారిని బతిమిలాడతాడు. కూర కావళ్ళుమోసి సాయం చేస్తే వెతుకుతామని వాళ్ళు అతన్ని ఇంటికి తీసుకు వెళతారు. భోజనం చేయమని బలవంతం చేస్తారు. ఆ మాంసం అలవాటులేక కక్కుకుంటున్న రాజుకు వనంతరాలతో నూరిన మందు తినిపిస్తారు. ఇలా రోజంతా గంగ చుట్టూ తిరిగిన సంజీవరాజు ఆమె ప్రేమలో పడతాడు. చివరకు దేగను తీసుకుని మినుములూరు బయలు దేరతాడు.

అతడు వెళ్ళే లోపలే, గంగతో యువరాజు సరసాలు దుర్గం ద్లకు తెలుస్తాయి. తక్కువకులం పిల్లతో సంబంధం తగదని మందలిం చాలనుకుంటారు. కానీ చిన్నబుచ్చుకుని ఏమైపోతాడోనని మధన పడుతుంటారు. రాజ్యమంతా ఈ వార్త వ్యాపిస్తుంది.

దిగువ పద్ధతిలో చాటు మాటున ఉంపుడుగత్తెగా ఉండటానికి గంగను ఒప్పించటానికి కొందరు పెద్దలు రాయబారాలు నడిపిస్తారు. అభిమానవతి యైన గంగు ఒప్పుకోదు. యువరాజును వెలివేయాలని కొందరు పెద్దలు పట్టుపడతారు. వెలివేస్తే, సంజీవరాజు రాజ్యం వదిలేసి గంగుగారి వాడలో మకాం పెట్టాలి. ఇలా రాజ్యం లో రకరకాల వాదనలతో చికాకు పెరుగుతుంది. ఏం చేయాలో తోచక దుర్గంద్లు, నందపురం మాకలిశక్తికి కబురు చేస్తారు.

నా పిల్లలు యాత్రలకు పంపిస్తే దొంగ పెళ్ళిళ్ళు అయినారు. శిక్షలు వేస్తే ప్రాణాలు తీసుకున్నారు. ఇపుడైనా గౌరవంగా పెళ్లి చేయాలి' అని మాకలి శక్తి ఆలోచించి నేరుగా పూలగండువనం వెళ్లి, గంగుగారి మర్యాద మన్ననలకు ముచ్చట పడుతుంది. ఆమె యువరాజుకు తగిన జోడీగా భావిస్తుంది. గంగ లోకజ్ఞానం, గడుసుతనం, మాటతీరు ఆమెకు నచ్చుతాయి.

దిగువవారిమాయలు తట్టుకోలేక వెనుకపడి పోతున్నమన్యం ప్రజలలో అన్ని తరగతుల వారిని, గంగ సంజీవ రాజుల జంట ఏకం చేస్తుందని, వారి జోడీ రాజ్యాన్ని ముందడుగు వేయిస్తుందని రైతు రాణువను ఒప్పిస్తుంది. వైభవంగా కళ్యాణం జరిపించి వారి పట్టాభిషేకం చేయిస్తుంది.

'లక్ష్మి కళ్యాణమో శుభలగ్నమో గౌరి కళ్యాణమో వైభోగమో'

శ్రీమతి కిముడు అచ్చమ్మ
మఠం గ్రామం, పాడేరు మండలం, విశాఖ జిల్లా

కవిత

ఆదివాసీలు

ఆకాశ నక్షత్రాల నిశ్శబ్దం
ఏకాంత పర్వతాల గాఢనిద్ర
వాగులు వంకలు
అడవులు పక్షులు
ఇవేకదా
ఆదివాసీల చదువులు
ఏది అరుపో
ఏది దరువో
పాటలు నాట్యాల్లో
వెల్లడయేవే కదా
వారి నిత్యానుభవాలు
వారి చుట్టూ నదులు,
కొండలు, చెట్లు
ప్రకృతి సమస్తం
తమదైన మాతృభాషను ప్రసాదిస్తున్నా -
వారి కలలూ జ్ఞాపకాల్లానే
మాతృభాషను కూడా
పోగొట్టుకుంటున్నారో ఏమో
అభివృద్ధి
ఆక్రమణల
అక్కడి నిర్వాసితులకు
కొండలు కాని మహాసౌధాలు
అడవులు కాని చెట్లు
వాగులూ వంకలూ కాని కుళ్లు కాలువలతో
వదిలి వచ్చేసిన ఇంటిని
నెమ్మది నెమ్మదిగా మరచిపోతున్నట్టు
వారి భాష
మారిన ఇంటిలో
తెలియకుండా ఇమిడిపోతునట్టు
మరో భాష
అయితేనేం
వారు ఏది మాటాడినా
వారికి తెలియకుండా
మాటాడించేది వారి లోపలి భాషే!

- ముకుంద రామారావు
9908347273

ధారావాహిక

జోగిని మంజమ్మ ఆత్మకథ



కన్నడ మూలం
డా. చంద్రప్ప సొబటి

అనువాదం
రంగనాథ రామచంద్రరావు
9059779289

మా అమ్మ ఇరవై ఒక్క పిల్లల తల్లి

ముందుగా నా తల్లితండ్రులకు నమస్కారాలు.

తరువాత నా గురువు కాళవ్వ జోగమ్మ పాదాలకు నమస్కారాలు.

ఈ వేదిక మీద ఆసీనులైన పెద్దల్లారా, వేదిక ముందు కూర్చున్న అధికారుల్లారా, విద్యార్థినీ, విద్యార్థుల్లారా, బళ్ళారి జిల్లా హొసపేట తాలూకా దణాయకనకెరె పంచాయితీకి చేరిన గొల్లరహళ్ళి గ్రామానికి చెందిన బెల్లంకొండి మంజమ్మ జోగిని నమస్కారాలు. ఈ విశ్వవిద్యాలయం చేస్తున్న 'పట్టాంగ' కార్యక్రమం ఉద్దేశ్యం చాలా బాగుంది. ఈ వేదిక మీదికి రావటానికి మునుపు "మీరు మీ కళ గురించి, మీ జీవితంలోని అనుభవాలను వివరించాలని గౌరవనీయులైన కులపతిగారు తెలిపారు". మా సుఖదుఃఖాలను, సాధనలను చెప్పుకోవటానికి విశ్వవిద్యాలయంలో ఒక వేదిక ఇచ్చారు కదా అని సంతోషం కలిగింది. స్వేచ్ఛగా చెప్పుకోవాలన్న కోరికతో నా జీవితంలోని కొన్ని విషయాలను మీ ముందు ఉంచబోతున్నాను.

నా సొంత ఊరు బళ్లారి జిల్లా, బళ్లారి తాలూకా లోని కల్లుకంబ గ్రామం. అయితే నేను ఆ ఊరిలో పుట్టలేదు. పెరగనూ లేదు. అక్కడ అప్పుడప్పుడు కొన్ని రోజుల కాలం గడిపిన జ్ఞాపకాలు ఉన్నాయి. జోగమ్మగా మారటానికి కొన్ని రోజుల ముందు ఆ ఊళ్ళో గడిపినటువంటి రోజులు ఎక్కువగా జ్ఞాపకంలో ఉన్నాయి.

ఆ సమయంలో నాన్న, మామయ్య చేత తిన్న దెబ్బలు నేను ఎప్పటికీ మరిచిపోలేను. అయితే కల్లుకంబ మా తాత, తండ్రుల ఊరు. ఇప్పటికీ మా వంశస్థులు అక్కడున్నారు. వంశీయుల ఆస్తిపాస్తులు అక్కడ ఉన్నాయి. నేనూ అప్పుడప్పుడు అక్కడికి వెళ్ళి వస్తుంటాను. అయితే అది చాలా తక్కువ. నేను లేదా నాలాంటి 'మంగళ ముఖిలు', మగ జోగమ్మలు అంటే సంచారులు. మాకు ఒక నేల లేదు. స్థిరనివాసం లేదు. నాకూ ఇరవై ఏళ్ళ క్రితం ఏ ఊరూ ఉండలేదు. నాలాగే మా తండ్రికీ ఏ ఊరు అంటూ ప్రత్యేకంగా ఉండలేదు. అతనూ ఒక విధంగా సంచారే. అందువల్ల తాతగారి ఊరినే నా ఊరని చెప్పుకుంటూ వచ్చాను. గొల్లరహళ్ళిలో ఈ రోజు సర్కారువాళ్ళు కట్టించి ఇచ్చిన ఇల్లు ఉంది.

మరియమ్మనహళ్ళిలో కాళవ్వ జోగమ్మగారి ఇల్లు ఉంది.

ఆమె చనిపోయాక ఆ ఇంట్లో నేను, నాతో ఉన్న జోగమ్మలు నివాసం ఉంటున్నాం.

ఇప్పుడు మరియమ్మనహళ్ళి, గొల్లరహళ్ళి గ్రామాల్లో ఉంటాను.

నా జన్మనామం మంజునాథ.

పాఠశాల ధాఖలాలలో కుమార బి. మంజునాథ శెట్టి అని ఉంది.

మంజునాథ అనే పేరు నాకు కేవలం పద్దెనిమిదేళ్ళ వరకే ఉపయోగపడింది.

ఆ తరువాత 'మంజమ్మ' అనే పేరు వాడుకలోకి వచ్చింది.

కాలం అనేక మార్పులను తెస్తుందికదా ?

ఆ కారణంగా కాలపుదారిలో 'మంజమ్మ' అయిపోయాను.



డా. చంద్రప్ప సొబటి



రంగనాథ రామచంద్రరావు

నేను ఈ విధంగా అయిపోయానని అనటం కంటే నా దేహం, నా మనస్సు ఈ విధంగా మార్చింది. దాన్ని ఆపటానికి ఎవరివల్లా సాధ్యంకాలేదు. ఎవరెందుకు? నా వల్ల కూడా సాధ్యంకాలేదు. ఇదొక దైహిక, మానసిక రోగం. ఈ రోగానికి నేను బలయ్యాను. ఇదంతా దైవిక శక్తి వల్లనే అయిందని నా గాఢ విశ్వాసం. మా ఇంటివాళ్ళు కూడా దీన్నే నమ్మారు. నేను మాత్రమే కాదు. నాలాంటి వేలాది జనం ఈ జబ్బుకు గురయ్యారు, ఇంకా గురవుతున్నారు. కర్ణాటకలో సుమారు అయిదువేలకన్నా ఎక్కువమంది 'మంగళముఖి'లున్నారు. ఆ విషయాన్ని పత్రికలలో చదివాను. ఇదొక రోగం అనే స్పృహ ప్రజల్లో లేదు.

వైద్యులు ఇదొక అంగవైకల్యం అంటారు. గుడ్డివాడైతే ప్రజలకు తెలుస్తుంది. కుంటివాడైనా తెలుస్తుంది. ఈ జబ్బు అలా కనిపించే జబ్బు కాదు. కనికరం కలిగించే అంగవైకల్యం కానేకాదు. అందువల్ల మా పట్ల ప్రజల్లో మేము వికలాంగులం అనే భావన లేదు.

నా తండ్రి శ్రీ హనుమంతయ్య శెట్టి, తల్లి శ్రీమతి జయలక్ష్మీ.

మా అమ్మ చాలా గట్టిది. ఆమె ఇరవైఒక్క మంది పిల్లల్ని కన్నతల్లి !

రెండుసార్లు ఒకేసారి ముగ్గురు పిల్లల్ని కన్నది. ఆ ముగ్గురు పిల్లలకు డాక్టర్ బ్రహ్మ, విష్ణు, మహేశ్వర అని పేర్లు పెట్టడం ఒకసారి నేనే చూశాను.

కాన్పు అయిన తరువాత డాక్టర్, "మీ నాన్నను పిల్చుకుని రా" అని మా అన్నను నాన్న పని చేస్తున్న ఫ్యాక్టరీకి పంపారు.

విషయం తెలిసి ఫ్యాక్టరీ ఉద్యోగులు 'ఒక కాన్పులో ముగ్గుర్ని కనటం సాధ్యమా?' అని నవ్వారట.

మా అమ్మకు ముగ్గురు పిల్లలు పుట్టిన విషయం రేడియోలో, వార్తాపత్రికలో వచ్చింది.

ఇది చూసి ప్రభుత్వంవారు ఒక ఊయలను ఫ్రీగా ఇచ్చారట. వాళ్ళు ఇచ్చిన ఆ ఊయలను చూసి అమ్మ చాలా సంతోషించిందట. కొద్ది రోజుల తరువాత అంటే రెండవ బిడ్డ చనిపోయినపుడు ప్రభుత్వం ఒకే ఊయల ఇచ్చింది. అందువల్లే తనకు ఒకే బిడ్డ దక్కిందని అమ్మ బాధపడుతుండేది. అంతేకాకుండా అప్పుడప్పుడు ప్రభుత్వం వారిని తిడుతుండేది. ఈ ముగ్గురు పిల్లలు పుట్టిన వార్త విని నాన్నతోపాటు పనిచేస్తున్న వారంతా కలిసి వంట చేసి, బుత్తి కట్టి పంపించారు. ఆ ముగ్గురు పిల్లల్లో ఒక బిడ్డ ఒక నెలలో, మరొకటి రెండు నెలల తరువాత చనిపోయారు. బతికి బట్టకట్టినవాడు ఒకడు తన ఇరవై ఒకటవ సంవత్సరంలో ఉన్నప్పుడు కాన్సర్ కారణంగా చనిపోయాడు.

కాన్పు గురించి, పిల్లల శుశ్రూష గురించి, తల్లుల శుచిత్వంపట్ల జనజాగృతి కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నప్పుడు అమ్మ తప్పకుండా జ్ఞాపకం వచ్చేది. ఏడాదికొకటి, రెండేళ్ళకొకటి అన్నట్టు కనీసం ఇరవై నుంచి ఇరవై రెండేళ్ళు ఆమె కనటం అనే పని చేసిందండి. అదెలాంటి ప్రాణమో ఆమెది ! దురదృష్టం ఏమిటంటే ఆ ఇరవై ఒక్కమంది పిల్లల్లో పదిహేడుమంది ఆమె కళ్ళ ముందే చనిపోయారు. అందులో పసిపిల్లలే ఎక్కువ. పిల్లలు చనిపోయిన ప్రతిసారి అమ్మ కుళ్ళికుళ్ళి ఏడ్చేది.

ఇప్పుడు నేను అన్న, ఇద్దరు చెల్లెళం మాత్రమే మిగిలాం.

మా అన్నపేరు శ్రీవీరాంజేయశెట్టి. అతను దావణగెరెలో గ్యాస్ స్టౌ, గీజర్ రిపేరీలు చేసేవాడు. అతడు నన్ను, మా చెల్లెళ్ళను సాకాడు. అమ్మకు ఆరోగ్యం బాగులేనప్పుడు, కాన్పు అయినప్పుడు, అమ్మ ఎక్కడికైనా వెళ్ళినపుడు వంటచేసి మా అందరికి అన్నాలు పెట్టేవాడు. అమ్మ జోకొట్టి నిద్రపుచ్చుతున్నట్టు మమ్మల్ని జోకొట్టి నిద్రపుచ్చేవాడు. ఆ చిన్న వయస్సులో అమ్మకు చాలా ఆసరా అయ్యేవాడు. ఆ కారణంగా అతనంటే అమ్మ ప్రాణాలు పెట్టేది.

అమ్మ చనిపోయి రెండేళ్ళు అయింది. చనిపోయేటప్పుడు నా దగ్గరే ఉంది. చివరి పదేళ్ళు నన్ను చాలా ఇష్టపడింది. ఎందుకో జోగమ్మగా మారినపుడు బాధపడ్డట్టు, చివరి రోజులలో బాధపడలేదు. ఎందుకు? అని అడిగితే జోగమ్మగా సాధన చేశావు కదా, అది చాలు. ఆ దేవత నిన్ను బాగా చూసుకుందికదా ! అందుకే తను ప్రశాంతంగా ఉన్నానని అనేది.

నాన్న కంప్లి ఫాక్టరీలో పనిచేస్తున్నప్పుడు కంప్లిలోని 'తెగ్గినమఠ' అనే వీధిలో పుట్టానట. నేను ఎన్నవ సంతానమో నాకు తెలియదు. అమ్మను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. నేను పెద్దవాడిని అయ్యేలోపు అయిదు మందిమి ఉన్నాం. అప్పుడే చెప్పానుకదా, ఒక తమ్ముడు కాన్సర్ వచ్చి చనిపోయాడని. నాకు అయిదేళ్ళు ఉన్నప్పుడు నాన్న కంప్లిలోని ఫ్యాక్టరీ ఉద్యోగం వదిలివేసి, హరిహరలోని బిర్లా ఫ్యాక్టరీలో చేరాడు. ఫ్యాక్టరీ పక్కనే ఉన్న చెరువు ఒడ్డున మా ఇల్లు ఉండేది. అక్కడ వీధిలోని పిల్లలు, మేము ఇసుక గూళ్ళు కట్టుకుని ఆడుకునేవాళ్ళం.

ఆ ఇంటి ఆటలోనూ నేను అమ్మాయిగా పని చేసేదాన్నని నేను జోగమ్మగా మారాక అమ్మ అప్పుడప్పుడు చెప్పేది.

కృష్ణుడిలా కాకుండా బృహన్నలలా అయ్యాను !

హరిహరలో నన్ను బడిలో చేర్చారు. నేను నల్లగా ఉండటం వల్ల అమ్మ నన్ను ప్రేమగా 'కృష్ణా' అని పిలిచేది. ఎన్నోసార్లు కృష్ణుడి వేషం వేసి ముద్దుచేసేది. అలా ముద్దు చేయటం ఇప్పటికీ నాకు జ్ఞాపకం ఉంది. ఆ సంఘటనలను జీవితాంతం నేను మరిచిపోలేను.



బాల్యంలో కృష్ణుడి వేషంలో మంజమ్మ

ఒకసారి అమ్మ నా ఫోటో తీయించింది. ఫోటోను ఇప్పటికీ జాగ్రత్తగా కాపాడుకుంటూ వచ్చాను. అయితే నా జీవితం కృష్ణుడిలా కాకుండా బృహన్నలలా అయ్యింది. ఇది చూసి మా అమ్మ ఎంత బాధపడిందో? ఆ బాధ చెప్పుకోవటం విన్నాను. అందుకు బాధపడ్డాను కూడా. చెప్పుకోలేక తన మనసులోనే పెట్టుకుని ఆమె అనుభవించిన బాధను అడగలేకపోయాను. బడిలో చేర్చే రోజున కృష్ణుడి వేషం వేసి, కృష్ణ కొప్పు కట్టి, మెడలో బొరుగుల దండ, కల్లంగడి (పుచ్చకాయ) విత్తనాల, కర్బూజ విత్తనాల దండవేసి పూజచేశారు. కొబ్బరికాయ, బెల్లం, మరమరాలు అంతా కలిపి పంచారు. ఆ రోజుల్లో బడిలో చేరటం అంటే సంభ్రమం. ఇప్పుడు అలాంటి సాంప్రదాయం లేదు. సంభ్రమం లేదు. ఆ సంతోషమూ లేదు.

నాన్న ఫ్యాక్టరీ నుంచి చెరుకు పాలు తెచ్చేవాడు.

నేను కావలసినంత తాగేవాడిని.

నాన్నకు ఉదయమే కడుపునిండా భోజనం కావాలి.

ఉదయం షిఫ్ట్ పనికిపోతే నేను బుత్తి తీసుకుని పోయి ఇచ్చే వాడిని. నాన్నకు అది చాలా ఇష్టం. చిన్న వయస్సులోనే ఇంత పనిచేస్తున్నావుకదా అని నన్ను ఎత్తుకుని ముద్దాడేవాడు. ఫ్యాక్టరీ లోపలికి పిల్చుకునిపోయి చెరుకుపాలు తాగించేవారు. నా కొడుకు చాలా తెలివైనవాడని అందరితో చెప్పుకునేవాడు. వాడు ఫ్యాక్టరీ మేనేజర్ అయ్యేలా చదువుతాడని అనేవాడు. నాన్నకు ప్రేమించే గుణం ఉన్నట్టే; కోపగించుకునే గుణమూ ఉండేది. అమ్మతో తీవ్రంగా పోట్లాడేవాడు.

నాన్న కంప్లి ఫ్యాక్టరీలో పని చేస్తున్నప్పుడు శివగంగమ్మ అనే ఆమెతో అనైతిక సంబంధం పెట్టుకున్నాడట.

ఆ కారణంగా అమ్మ అప్పుడప్పుడు నాన్నతో పోట్లాడేది.

నాన్న ఆలస్యంగా ఇంటికి వస్తే చాలు, "నువ్వు ఆమె దగ్గరికి వెళ్ళి వచ్చావు" అని గొడవ పెట్టుకునేది.

"లేదు, ఆమె దగ్గరికి వెళ్ళలేదు. ఓ.టి. చేసి వచ్చాను" అని నాన్న ఎంత చెప్పినా వినిపించుకునేదికాదు.

అమ్మ వాదించి వాదించి నాన్నకు కోపం తెప్పించేది.

దాంతో అతనికి కోపం వచ్చి చేతికి అందిన వస్తువులను, వంటపాత్రలను ఆమె మీదికి విసిరికొట్టేవాడు. మేమంతా నాన్నను గట్టిగా పట్టుకున్నా అమ్మను కొట్టడం ఆపేవాడు కాదు. తాను నిలబడ్డ స్థలం నుంచే ఆమెకు తగిలేలా పాత్రలు విసిరేవాడు. అప్పుడు మేము బిగ్గరగా ఏడ్చేవాళ్ళం. ఒకవేళ మేము అడ్డుకోబోతే మమ్మల్ని పైకెత్తి విసిరేసేవాడు.

ఆ శివగంగమ్మకు నేనంటే చాలా ఇష్టం. ఇప్పుడు ఆమె దావణగెరెలో ఉంది. పాపం ఆమెకు పిల్లలు కలగలేదు. అందువల్ల మేమంటే పడిచచ్చేది. నాన్న ఇచ్చిన డబ్బును దాచిపెట్టేది. ఖర్చుచేయకుండా కూడబెట్టి మాకు బట్టలు, వస్తువులు కొనేది. అందువల్ల నాన్నకు ఆమె పట్ల చాలా ప్రేమ ఉండేది. ఒక్కొక్కసారి నాన్న ఆమెను ఇంటికి పిల్చుకుని వచ్చేవాడు. అప్పుడు అమ్మకూ, ఆమెకూ జగడమే జగడం. నాన్న లేనప్పుడు అమ్మ, శివగంగమ్మల మధ్య గొడవ జరిగేది. రోజూ వాళ్ళ మధ్య జగడమే. వాళ్ళు గొడవపడిన విషయాన్ని శివగంగమ్మ నాన్న రాగానే చెప్పేసేది. అదివిని నాన్న అమ్మను చితకబాదేవాడు. అప్పుడు మేము ఎవరమూ విడిపించడానికి వెళ్ళేవాళ్ళం కాదు. ఇంత జరిగినా అమ్మ శివగంగమ్మతో గొడవపడటం మానేదికాదు.

మగపిల్లవాడినైనా ఆడవాళ్ళ పనులంటే నాకు చాలా ఇష్టం.

నేను ఏడవ తరుగతి చదువుతున్నప్పుడు నా శరీరంలో అనేక మార్పులు కలగసాగాయి.

ఏవేవో విచిత్రమైన ఆలోచనలు రాసాగాయి.

విచిత్రమైన భావాలు కలగసాగాయి.


వాటివల్ల కలిగే యాతనలు ఎవరికీ రాకూడదు.

ఎవరి ముందు చెప్పుకోవటానికి సాధ్యం కానటువంటి విషయాలు, బాధలూ అవి.

ఇటు అబ్బాయికి కలిగే భావాలు కావు.

అటు ఆడపిల్లకు కలిగే భావాలూ కావు.

వాటిని కుర్రవాళ్ళ దగ్గర చెప్పుకోవటానికి కుదరదు. అలాగే అమ్మాయిల దగ్గర కూడా చెప్పుకోవడానికి కుదరదు. ఇటు అబ్బాయిలతో సర్దుకోవడానికి సాధ్యమయ్యేదికాదు. అటు



అమ్మాయిలతోనూ సర్దుకోవడానికి సాధ్యమయ్యేదికాదు. అబ్బాయిలను పలకరించడానికి చాలా సిగ్గు వేసేది. వాళ్ళంటే ఏ మాత్రం ఇష్టం కలిగేది కాదు. అమ్మాయిలను పలకరించాలనే కోరిక ఉండేది. ఇష్టం ఉండేది. మనస్సు లోలోతుల్లో తపించేవాడిని. అయితే ధైర్యం కలిగేది కాదు. ఒకింత ధైర్యం చేసి అమ్మాయిల దగ్గరికి వెళితే ఆ అమ్మాయిలు నన్ను తమ దగ్గరికి రానిచ్చేవాళ్ళు కాదు. నేను వాళ్ళ దగ్గరికి వెళ్ళటాన్ని కూడా ఇష్టపడేవారు కాదు. అది వారి తప్పు అని చెప్పటం లేదు. వాళ్ళ అలా చేయటం సమంజసమే. ఎందుకంటే, 'అతను నిక్కర్ వేసుకుంటాడు. ప్యాంటు వేసుకుంటాడు. అతనెందుకు మా వెంబడి వస్తాడు. ఈ వయస్సులో అతనికి ఈ చాపల్యం ఏమిటి? పైగా ఆడపిల్లలా ప్రవర్తిస్తాడు. ఆడదాని పట్ల చపలత్వం' అని వాళ్ళు మాట్లాడుకునే మాటలు వాస్తవమే.

ఇంత జరిగినా నాకు ఈ ఆడపిల్లల మాటలు వినాలి. వాళ్ళలా ఉండాలి అనే భావనలు కలిగేవి. ఆ భావనలను చెప్పటం ఎలా? వాళ్ళకు ఎలా చెప్పాలనే ఇబ్బందికరమైన పరిస్థితి నాది.

ఏడవ తరగతిలో మొదలైన ఈ పరిస్థితి తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు మరింతగా పెరిగింది. ఇక అప్పుడైతే అమ్మాయిల్లాగే ఉండాలని అనిపించేది. మరొక విషయం ఏమిటంటే ఇలాంటి ఆలోచనలు కలుగుతున్న సమయానికే మా ఇంటి చుట్టుపక్కల ఉన్న జనానికి నా శరీరంలోని మార్పులు, నా ప్రవర్తన అర్థమవుతుండేది.

ఏడవ తరగతి చదువుతుండగా బడిలో 'తిరు నీలకంఠ' అనే నాటకాన్ని ప్రదర్శించాం. బసప్ప మాస్టరుగారు నా ఆలోచనలను గుర్తించినట్టు ఆ నాటకంలో నాకు పరమాత్ముడి పాత్రను ఇచ్చారు. అందులోని పరమాత్ముడిది మగపాత్ర. అది నిజమే. అయితే ఆ మగవాడి పాత్రను నాకు ఇచ్చిన ఉద్దేశ్యం వేరు. తిరునీలకంఠ, నీలాంబికెను ఒక్కటిగా చేసే సమయంలో ఒక విధంగా నటించాల్సి ఉంటుంది. అదే సందర్భంలో బసప్ప మాస్టరు, నన్ను "డ్యాన్స్ చేయగలవా?" అని అడిగారు. నేను వెంటనే డ్యాన్స్ చేయడానికి ఒప్పుకున్నాను. నాకు అలాంటి అవకాశం దొరకాల్సివుంది. దాన్ని నేను అనుభవించాల్సివుంది.

ఆ రోజు లంగా, చోళీ వేసుకుని నృత్యం చేశాను.

నాకు అత్యంత సంతోషం కలిగింది.

లంగా వేసుకున్నందువల్లనే డ్యాన్స్ బాగా చేశాను.

ఇది జరిగిన తరువాత,అంటే ఈ నాటకం వేసిన తరువాత ఏదైనా చిన్నా చితకా కార్యక్రమాలు ఉంటే అందులోని స్త్రీ పాత్రలను నాకే ఇచ్చేవారు. ఇలా రెండు మూడేళ్ళు గడిచాయి. ఈ సమయంలో నాలోని స్త్రీ లక్షణాలు ప్రజలకు తెలిసిపోయాయి. అది నాలో ఒక విధమైన ధైర్యం కలిగించింది. ప్రజలకు తెలియదు అనటం కన్నా తెలిసిపోయిందనే విషయం ఇచ్చే ధైర్యం గొప్పది. ఎస్.ఎస్. ఎల్. సి. చదువుతున్నప్పుడైతే నా శరీరంలో అనేక మార్పులు కలగటం ఆరంభమయ్యాయి. అప్పుడు నాకు తెలియకుండానే సహజంగానే ఆడవాళ్ళ పనులు చేస్తుండేవాడిని. అంటే ఇంట్లో ఉన్న టవల్ తీసుకుని చీర కొంగులా వేసుకోవడం, ప్యాంట్, జుబ్బా ధరించినా దాన్ని చీరలా చుట్టుకుని, నీళ్ళకోసం వెళుతున్నట్టు నడవటం, ముగ్గులు వేయడం, పూజలు చేయడం, అమ్మకు సహాయం చేయడం, అంట్లు తోమడం, వంట చేయడం-ఇలాంటి పనులన్నీ చేసేవాడిని. అమ్మ ఎంత తిట్టినా అమ్మ దగ్గరే ఎక్కువ సమయం ఉండటానికి ఇష్టపడేవాడిని. నాలో కలిగిన ఇలాంటి అయోమయపు పెరుగుదల నా చదువును పాడుచేసింది. ఆ కారణంగా ఎస్.ఎస్.ఎల్.సి.లో సైన్స్, ఇంగ్లీషులలో ఫెయిల్ అయ్యాను.

అప్పుడు నాన్న, "నువ్వు బడికి వెళ్ళటంలో అర్థం లేదు, బడికి వెళ్ళటం మానెయ్" అని చెప్పి, నన్ను బడి వొదిలించి, కల్లుకంబలో ఉన్న మా అన్నయ్య దగ్గరికి పంపాడు.

అయితే కల్లుకంబలో శారీరక హింస కన్నా అన్నయ్య తిట్ల వల్ల కలిగే హింస ఎక్కువైంది.

నొప్పించే అన్నయ్య మాటల ముందు శారీర బాధలు అల్పంగా తోచాయి.

కల్లుకంబలో మా అన్నకు కిరాణా అంగడి ఉండేది.

అక్కడ అతనికి సహాయం చేయడానికి ప్రయత్నించేవాడిని.

అయితే ఏ పని చేయడానికి నా వల్ల అయ్యేదికాదు.

అతనూ చెప్పేవాడు కాదు.

దాంతో ఒంటరితనం నాకు దగ్గరయ్యింది.

ఒంటరితనాన్ని ఇష్టపడసాగాను.


రోజుల కొద్దీ ఒంటరిగా ఉండేవాడిని.

(తరువాయి వచ్చే సంచికలో...)

'మునగాల పరగణా - కథలు-గాధలు' రచయిత గుడిపూడి సుబ్బారావుగారితో....

శ్రీ గుడిపూడి సుబ్బారావు (83సం.) రచయిత. సౌహార్దశీలి. స్వస్థలం సూర్యాపేట జిల్లాలోని అన్నవరగూడెం. ఆనాడు మునగాల పరగణాలోనిది. వీరు కరివిరాల గ్రామం నుండి ఇక్కడకు వలసగా వచ్చారు. ఆ చుట్టుపక్కల గ్రామాల గురించి చిన్నతనం నుండి ఎన్నో విషయాలు విన్నారు. తాము వలస వచ్చిన విధానం, మునగాల రాజావారి హయాంలో జరిగిన సంఘటనలు తెలుసుకోవాలనే కోరికే "మునగాల పరగణా - కథలు - గాధలు" పుస్తకం రచన. మౌఖికంగా ఎంతో సమాచారం సేకరించి, చారిత్రక ఆధారాలతో పోల్చి రాసిన విధానం కొత్తది. జనం నోళ్ళలో నానిన, విలువైన వినికిడి సమాచారాన్ని ఒక క్రమ పద్ధతిలో పేర్చడం చరిత్రకారులకి సాధ్యం కాదు. ఈ విషయంలో గుడిపూడిగారు సఫలం అయ్యారు. దస్తావేజులు, కైఫీయత్తుల సమాచారంతో పోల్చి నిజాలు వెలికి తీశారు.

ఉరుదూలో విద్యాభ్యాసం చేసిన వీరు తెలుగులో కథలు రాశారు. అనేక వ్యాసాలు రాశారు. నిగర్వి. నిండుకుండ. స్నేహశీలి. అన్నింటికి మించి మంచి మనసు. పేరుకోసం కాకుండా అవసరం అనిపిస్తేనే కలం పడతారు. వారితో జరిపిన ముఖాముఖీ సంభాషణలో వారు తెలిపిన ఎన్నో విషయాలను ఇప్పుడు చదవండి :



ప్రశ్న : మీ బాల్యం ఎలా గడిచింది

సుబ్బారావుగారు : నా బాల్యం సీతాకోకచిలుక లాగే గడిచింది. మొఖద్ధం మాల్వీ కొత్వాలి మేనల్లుణ్ణవడం వల్ల మేమాడింది ఆట, పాడింది పాట! అలా అని స్వైరవిహారులం కాదు. నా మేనమామలు మేమెవరం పిచ్చి వేషాలు వేసినా తోడకలు తీసేవారు. ఇహ మా నాయనమ్మకు నేనంటే బాగా ఇష్టం. నేను పుట్టింది (మాతరంలో) తమ యింట్లోనేనని! మా అక్కగారు, అన్నగారు మా మేనమామల యింట్లో పుట్టారు. చిన్నప్పుడు మంచి స్నేహితులు దొరికారు. మా ఊర్లో వున్న గుట్టలన్నీ మావే! బావులన్నీ మావే. ఎవరి తోటలైతే మాకేం! అన్ని తోటలూ మావే. చిన్నప్పుడే మా మేనమామలు నాకూ, మా అన్నయ్యకూ నాకు హ్యాట్లు తెచ్చారు. అవి పెట్టుకుని సెలవురోజంతా తిరగడం - ప్రొద్దున తిన్న చద్ది అన్నం, ఒంటిగంట రెండు గంటల దాకా మా ఆకలి నుండి మమ్ము రక్షించేది. ఆ తరువాత మా నాయనమ్మ భోజనానికి రమ్మని పిలుస్తుండడంతో ఆ పని కానిచ్చే పనిలో చారెడంత నెయ్యిపోసినా నాయనమ్మా నెయ్యి చేతిలో పడటమే లేదు అని మరింత నెయ్యి వేసుకునేవాణ్ణి. ఇంకా వీలైనప్పుడల్లా మా మేనమామల గుర్రాలపై సవారీ చేసేవాళ్లం యిష్టమైన స్నేహితులతో!

ఊళ్లోకి గారడివాండ్లు వచ్చేవాళ్లు. వాళ్లు చేసే పనులు చూసి మేమూ వాళ్లని అనుకరించేవాళ్లం. అలా అనుకరించి నా ప్రియమిత్రుడు క్రిందపడి దెబ్బలు తగిలించుకున్నాడు. భయంతో వాడి తల్లిదండ్రులు తిడ్తారని రెండు మూడు రోజులు వాడింటికి వెళ్లనేలేదు. ఇహ మాయింటి ప్రక్కనే పీసు మామిడి చెట్టు, దాని క్రింద భిక్షగాళ్లు, అనేక రకాల సంచార జీవనం గడిపే వాళ్లు దిగేవాళ్లు. కొంతమంది వద్ద గాడిదలు, మరికొంత మంది వద్ద గుర్రాలు, కోళ్లు, కుక్కలు, కోతులు ఇలా ఏవేవో పెంపుడు జంతువులు ఉండేవి.

చదువులో నేను యావరేజ్ స్టూడెంటుని. ఉర్దూ మీడియం. చిన్నప్పుడే మా ఉపాధ్యాయులు ఉర్దూలో మాట్లాడడాన్ని ప్రోత్సహించేవారు. నా మిత్రులందరూ ఉర్దూ మర్చిపోయారు గానీ నేను మరువలేదు. అలా మమ్మల్ని గాడిన పెట్టిన మాస్టారు కొమాండూరి రంగాచార్యులు. వీరి స్వగ్రామం కడివెండి. జనగామ తాలుకాలోది. ఈ కడివెండి - దేవరుప్పల గ్రామాల నుండే ఆంధ్రమహాసభ కార్యకర్తలు- కమ్యూనిస్టులు ముఖ్యంగా విసునూరు దొరను ఎదుర్కోవడంలో ముందు నిలిచారు.

ఇంతటితో నా బాల్యం, నా ఊరు, నా భూములు, చెట్టు చేమలు, ఈత బావులు, సీతా ఫలాల కోసం గుట్టలపై ఇష్టారాజ్యంగా తిరగడాలు అన్నీ ఆగిపోయాయి. మా నాన్న నన్ను, మా అన్నయ్యతో పాటు ఖమ్మంలో చేర్పించారు. నాకు మదర్సేఫోఖాన్యాలలో సీటు

దొరకకపోవడంతో మర్కజీ లో చేర్పించారు. మా బంధువులు అందరూ ఖమ్మం జిల్లాలో ఉండడంతో నేను సూర్యాపేట తాలూకా వాణ్ణయినప్పటికీ అక్కడ హాస్టల్ వుందని అక్కడ బాగా బాగుంటుందని చేర్పించారు. దురదృష్టం. ఆ రోజుల్లో కరువు రావడంతో బర్మా బియ్యం వండించి హాస్టల్లో పెట్టారు. నేను అన్ని సబ్జెక్టుల్లోనూ బలహీనుడిగానే వుండిపోయాను. ఉర్దూ మీడియం నుండి తెలుగు మీడియంకు వచ్చేసరికి నాకు ఏమీ అర్థమయ్యేది కాదు. దానితో భయపడిపోయాను. ఉపాధ్యాయులు నన్నెవరూ పట్టించుకోలేదు. బొటాబొటి మార్కులతో బయట పడేవాణ్ని. నేను పెద్ద తెలివి గలవాడినేమీ కాదు. ఆ విషయం నాకు చిన్నప్పుడు చదువు కుంటు న్నప్పుడే తెలుసు. 1955లో నా హెచ్.ఎస్.సి. అయిపోయింది. ఆ తరువాత హైదరాబాద్ వివేకవర్ధిని కాలేజీలో బి.ఎ. వరకు అసంపూర్తిగా కొనసాగింది.

ప్రశ్న : మునగాల పరగణాతో మీకున్న బంధం ఏమిటి? మునగాల పరగణా పుస్తకం రాయడానికి ప్రేరేపించిన అంశాలు ఏవి?

సు : మునగాల పరగణాతో నా సంబంధం గురించి చెప్పాలంటే ఆఖరి కుతుబ్షాహీల పాలన జరుగుతున్న రోజుల్లోనే మా కుటుంబం మునగాల పరగణా 'కరివరాల' గ్రామం నుండి బయలుదేరి నైజాంకు ఇప్పుడున్న వూరు అన్నవరగూడెంకు చేరుకుంది. మునగాల పరగణాకు ఆనుకుని కొన్ని ఐదారు కిలో మీటర్ల దూరంలో మా గ్రామాలున్నాయి. ఇప్పుడున్న మా ఊరికి మా పూర్వులు ఒరవడి పోసి అభివృద్ధి చేసుకున్నారు. అప్పట్లో మునగాల పరగణా జమీందారులు కీసరివారు. వారు సిరిపురం గడీలో వుండేవారు. వివరాలు తెలియవు కానీ, మా మేనమామల పూర్వీకులకు – ఆనాటి జమీందార్లయిన కీసరివారికి పడేది కాదు. దానితో గొడవలయ్యి రాత్రికి రాత్రి మా మేనమామల పూర్వీకులు కరివిరాలలో ఉన్న అన్ని భూములు ఆస్తులు అన్నీ వదిలి రెండు కోసుల దూరంలో ఉన్న నైజాం రాజ్యంలో భూములు సంపాదించి ఇప్పుడున్న ఊళ్లో సెటిలయిపోయారు. దాంతో కరివిరాల గ్రామంలో ఉన్న అన్ని కులాల ప్రజలు మా పూర్వులను అనుసరించారు. ఆనాటి నుంచి మాకే కాకుండా అన్ని కులాల వారితో పరగణా గ్రామాలతో ఇచ్చి పుచ్చుకోవడాలు అనేకంగా జరుగుతూ వస్తున్నాయి.

చాలా సంవత్సరాలుగా మునగాల పరగణాను గురించి, మా వలసను గురించి బాగా తెలుసుకోవాలన్న జిజ్ఞాస నన్ను వెంటాడింది. దీనికి తోడు మా అత్తవారి ఊరు జగన్నాథపురం మునగాల పరగణాలోనిది కావడంతో నేను అత్తారింటికి పోయినప్పుడల్లా నా బావమరుదులు, అక్కడ పెద్దలు మునగాల జమీందార్ల ఆగడాలు, వారి జీవనయానం, ఇలా వారి సన్న సువారం, మొద్దు సువారం గురించి ఎన్నెన్నో విషయాలు చెప్తుండేవారు. మొదట్లో నాకు ఏమనిపించలేదు కానీ, యివన్నీ వింటున్నప్పుడు ఈ విషయాలు నలుగురికీ తెలియాలి అనిపించింది. ఇలా ఎన్నో విచిత్రమైన సంఘటనలు, జమీందార్ల విపరీతపోకడలు, వారి వదాన్యత గురించి కూడా చెప్పేవారు. అదే కాకుండా మా అమ్మగారు – సిరిపురం గడీ భట్రాజుల శాపంతో నశించిపోయిందన్న విషయం తన బాల్య మిత్రులతో చెప్తుండడం నేను అనేక సార్లు విన్నాను. శాపం ఏమిటి..? గడీ నాశనం కావడమేమిటన్న జిజ్ఞాస నాలో పాతుకుపోయింది. దీనితో నేను అనేక గ్రామాల్లో ఎంతో మందిని కలిసి విషయ సేకరణ చేసాను. ఈ పై కారణాల వల్ల 'మునగాల పరగణా కథలు గాథలు' అన్న పుస్తకం వెలువరించడానికి కారణమైంది. ఈ పుస్తకానికి ముందే వెలగా వెంకటప్పయ్యగారు అప్పటివరకున్న నా రచనలను మునగాల పరగణా కథలుగా మరో పుస్తకాన్ని ప్రచురింపచేశారు.

హైదరాబాద్ సుల్తాన్ బజార్లో ఉన్న శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయానికి 50 సంవత్సరాల పాటు అధ్యక్షుడుగా పనిచేశారు జమీందారు నాయని వెంకటరంగారావుగారు. కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా కూడా పనిచేశారు. మరి తెలంగాణలో రజాకార్లు ఊళ్ల మీద పడి నానా బీభత్సం సృష్టిస్తుంటే నాయని రంగారావుగారు తెలంగాణవాడై ఉండి, కాందిశీకులుగా తెలంగాణ ప్రజ మునగాల పరగణా గ్రామాలను శరణు జొచ్చిన విషయం రంగారావుగారికి తెలిసీ, ఒక్క సారయినా కనీసం, నా తెలంగాణ ప్రజ తన పరగణాకు తలదాచుకోవడానికి వచ్చారని వారి బాగోగులు విచారించిన పాపాన పోలేదు. అవసరం తనకుందన్న విషయాన్ని విస్మరించడమే కాదు ఆ విషయాలు తనకవసరమయినవి కావని మౌనం వహించారు. ఇలా ఎన్నో రకాలుగా ప్రజలను పీడించిన జమీందారు చివరకు ముగింపు హైదరాబాదులో జరిగిపోయిన విషయాలను ఈనాటి యువతకు చెప్పాలని చేసిన ప్రయత్నం ఇది. ఈనాటి పరగణా ప్రజలు తమ పూర్వులు, తాము ఈనాడు సుఖంగా జీవించడానికి పూర్వం ఆ రోజుల్లో తమ ముత్తాతలు ఎంతగా రాజావారితో పోరాడారో ఆ పోరాటంలో ఎంత మంది చనిపోయారో, ఎన్ని ఇడుముల పాలయ్యారో తెలపడానికి చేసిన ప్రయత్నం ఇది. ఆనాటి వారి స్ఫూర్తిని పరగణా ప్రజ ఎన్నడూ మర్చిపోకూడదని, వారు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని కోరుకున్నాను. ఇప్పటికీ మునగాల చాలా మంది యువకులకి పరగణాలో ఎన్ని గ్రామాలున్నాయో కూడా తెలి యదు. రాజావారు ఏం చేశారో, ఎంతమంది కొంపలు కూల్చారో, రాజావారి దాష్టీకానికి ఎన్ని సంసారాలు నిప్పచ్చరం అయ్యాయో తెలపడానికి ఈ రచన చేశాను.

ప్రశ్న : మౌఖిక విషయాలు, కథనాలు చరిత్ర అవుతుందా?

సు : అవుతుంది. గతంలో వచ్చిన చరిత్రలన్నీ విన్నవాటి ఆధారంగా శాసనాల ఆధారంగాను, మరింకెన్నో ఆకరాల ఆధారం గాను తయారయిన మాట నిజమే. కానీ పూర్తిగా కాకపోయినా మునగాల పరగణా విషయంలో నేను పుస్తకంలో చెప్పినట్లుగా అవే మాటలు అలాగే ఉండకపోయినా సంఘటనలన్నీ జరిగిన మాట వాస్తవమే. నిజం కానిది ప్రజల్లోకి ఏ మాటా రాదు. ఉట్టి మాట చెప్పడానికి ఎన్ని గుండెలు కావాలి? నిప్పు లేనిది పొగరాదు. చెప్పడంలో తేడా ఉంటుంది కాని జరిగిన విషయాలు వాస్తవమే. ఆనాటి రాజావారి గుమస్తాలు, మేనేజర్లు, పెద్దలు, కరణాలు,

భాష నశిస్తే జాతి నశిస్తుంది. వాడని భాష వాడిపోతుంది

మునసబులు, గడీలో పనిచేసిన పనివారు, ఇంకా రాజా వారి వల్ల ఇబ్బందులు పడినవారు, రాచబంధువులు, రాజావారితో దగ్గర సంబంధాలున్నవారు చెప్పిన విషయాలన్నీ నిజాలే. కాకపోతే వారి వారి భాషలో వారి ఆనందాలు, వారి వారి తప్పిదాలు, ఇబ్బందులు చెప్పుకున్నారు. ఈ విషయాలన్నీ గఢీ పనివారల నుండి, వారి గుమస్తాల నుండి బయటకు వచ్చినవే. ఇప్పటికే మునగాల పరగణా ప్రజలు (పరగణా అంటే కొద్ది గ్రామాల సమూహం) పోయినవారు పోగా, మిగిలినవారు సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పు కుంటూ ఉంటారు. కనుక వీటిని నమ్మవచ్చు. ఇందులో కల్పితాలేవీ లేవు. జరిగిన సంఘటనలు, వాస్తవాలే ఇంత నికృష్టంగా ఉన్నప్పుడు కథ కల్పించాల్సిన అవసరం లేదు. ఇప్పుడు మనం చదువుతున్న చరిత్రలన్నీ తత్సంబంధీకులు చెప్పి రాయించినవని చదువుతు న్నామా? ఇప్పటికీ మనము పేపర్లలో అవాస్తవమైన విషయాలు ఎన్నో వింటున్నాం కదా! ఈ తెలిసిన విషయాలు, సేకరించిన విషయాలను తత్సంబంధిత వ్యక్తుల నుండి సేకరించిన విశేషాలే ఈ మునగాల పరగణా కథలు, గాథలు. నేను చెప్పిన తీరులో భాషలో తేడా ఉండవచ్చు కానీ, అసలు విషయాలు నూటికి నూరుపాళ్లు వాస్తవాలే. అవును. చరిత్ర నిర్మాణానికి, తెలిసిన విషయాలు, విన్న విషయాలతో చరిత్రను నిర్మించవచ్చా? నిర్మించవచ్చుననే నా సమాధానం. తన దత్తత చెల్లదని తనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన జ్ఞాతులపై ప్రీవీ కౌన్సిల్ వరకు లండన్ పోయారు ఈ రంగారావుగారు. చిన్న కోర్టుల నుండి జిల్లా కోర్టులు, హైకోర్టు వరకు చివరికి లండన్లో ప్రీవీ కౌన్సిల్ వరకు ఎదబెట్టిన ఈ డబ్బులన్నీ ఎక్కడివి? ప్రజలవి కావా? ఇవన్నీ పరగణా ప్రజలవే. వారు కష్టార్జితంతో సంపాదించినవే. మునగాల పరగణా ప్రజ కార్చిన కన్నీళ్లకు విలువకట్టకలిగిన షరాయిలెవరు? రాజావారికి ఎంతో మంది గొప్పవారి సహచర్యం లభించింది. కానీ వారి సుగుణాలలో ఏ ఒక్కటీ రాజావారికి అంటనే లేదు, అబ్బలేనేదు. ఈ విషయాలన్నీ ప్రజలకూ తేటతెల్లమే. నేను చెప్పిన ఈ విషయాలన్నీ పరంపరగా ప్రజల్లో వ్యాపిస్తూ వచ్చిన వాస్తవాలే. కనుక ఇవన్నీ నిజమేననడానికి ఇప్పటికీ బతికి ఉన్న ఒకరిద్దరు వృద్ధులు మనకు ఇంకా ఎన్నో విష యాలుచెబుతారు. మునగాల పరగణా చివరి జమీందారు నాయని వెంకటరంగారావుగారు ఎంత దిగజారారో ఎన్ని క్రూర కృత్యాలు చేశారో, డబ్బు కోసం ఎంతగా ప్రజలను పీడించారో ప్రజలందరికీ తెలిసిన విషయాలే. విచిత్రమేమంటే రాజావారు 1953 జూన్ 11న హైదరాబాద్లో చనిపోయే నాటికి రాజావారి సన్నిహితులెవరూ దగ్గర లేరు. వారందరూ ఎప్పుడో రాజావారి దుశ్చర్యలకు కినిసి వేరు వేరు కారణాలతో తమ తమ గూళ్లకు చేరుకున్నారు. ఇందుకు ఉదాహరణ కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు. తెలంగాణ శాసనాల పరిష్కారం పేరిట మద్రాసు చేరుకున్నారు. పింగళి వెంకయ్య గారు బెజవాడ చేరుకున్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణగారు రాజా వారిచ్చిన ఐదు ఎకరాల స్థలంలో శారదానికేతన్ కట్టుకుని ఆ పని నిమిత్తం అక్కడే ఉండిపోయారు. అయ్యదేవర కాళేశ్వరరావు వకాలత్ కొనసాగించారు. మిగతావారు కూడా ఎవరి స్థానాలకు వారు చేరు కున్నారు. దీనికంతటికీ కారణం రాజావారి ధోరణి నచ్చకనే. ఇది గమనించ వలసిన విషయం.


ప్రశ్న : ఇలాంటి పుస్తకాలను చరిత్ర విభాగం ప్రామాణికంగా తీసుకుంటుందా?

సు : చరిత్ర విభాగం ఈ గ్రంథాన్ని ప్రామాణికంగా తీసుకుం టుందా అన్నది ముఖ్యమైన ప్రశ్న. పీడితులు, తాడితులు తప్పకుండా ఈ గ్రంథాన్ని సమర్థిస్తారు. మునగాల పరగణా బయటి ప్రపంచంలో ఉన్నవారంతా, రాజావారి నుండి సహాయం పొందినవారు తప్ప, రాజావారి గుణగణాలు ఎరిగినవారు తప్పక ఈ పుస్తకానికి స్పందిస్తారు, ఆమోదిస్తారుకూడా. రాజావారు తమ కుమారులు ప్రేమ వివాహం చేసుకున్నందుకే తట్టుకోలేకపోయారు. నానాయాగీ చేశారు. కొడుకులనే గౌరవించలేనివారు ప్రజలను మాత్రం ఎంత బాగుగా పాలించగలరు గనుక. రాజావారు ప్రజల కోరికలను ఎంత బాగా మన్నిస్తారన్నది మీ లాంటి వారికి బాగా తెలుస్తుంది. ఉరుమురిమి మంగలం మీద పడినట్లు ఈ నెపమంతా రాజావారి భార్యపైన పడింది. పర్యవసానం, ఆ రోజులగాయతు రాజావారు తన భార్యతో చనిపోయేంతవరకు మాటాడనేలేదు. ఇలా ముప్పయిసంవత్సరాలు కొనసాగింది.

ప్రశ్న : మునగాలకి తెలంగాణాకి గల సంబంధం ఎలా ఉండింది.

సు : ఒకప్పుడు మునగాల పరగణా తెలంగాణ రాజ్యంలోనిదే. ఇది చరిత్ర చెప్పిన నిజమే. ఆసఫ్జాహీ ప్రభువులు వచ్చాక బెజవాడ వద్ద ఉన్న పరిటాల ప్రాంతంలో వజ్రపు గనులున్నాయని తమకు ముందు ఉన్న పాలకులు ఆ గనుల నుండి వజ్ర వైఢూర్యాలు సంపాదించారని, ఆ గనులను ఏనాటికైనా పునరుద్ధరించి వజ్రాలు పునఃసంపాదించాలని నిజాంల కోరిక. అందుకు బ్రిటీషు వారు ఒప్పుకోకపోవడంతో మునగాల పరగణాను బ్రిటీషు వారికి ఇచ్చి, పరిటాలను తమ ఆధీనంలో ఉంచుకున్న విషయం చరిత్ర పుటల్లోనే ఉంది. బ్రిటిష్ వారు కూడా ఆసఫ్ జాహీ రాజులతో జరిగిన ఒప్పందానికి సుముఖంగానే ఉన్నారు. దీనికి కారణం, ఎప్పటికైనా తమ మధ్య నిజాం మధ్య పొరపొచ్చాలు వచ్చినప్పుడు తమ సైనిక బలగాలను మునగాల పరగణాలో ఉంచి నిజాంలకు పక్కలో బల్లెంగా మారాలని వారు ఆకాంక్షించారు. పైగా స్ట్రాటజికల్గా మునగాల అవసరం బ్రిటీష్ వారికి ఎంతో ఉంది. మునగాల పరగణా ఆంధ్రాలో ఉండిందని అక్కడి సభ్యతా సంస్కారాలు వేరే విధంగా గొప్పగా ఏమీ లేవు. చుట్టు పక్కల గల తెలంగాణ వారి అలవాట్లు, పండు గలు, పబ్బాలు వైవాహిక సంబంధాలు అన్నీ తెలంగాణ వారితోటివే. మాటలో, చేష్టల్లో కానీ కృష్ణాజిల్లా నాగరికత, అలవాట్లు ఏమీ వీరికి అబ్బి ఉండి లేవు. తెలంగాణలోలాగే ఇక్కడా ఉంటుంది. మాటా, పాటా అన్నీ ఇక్కడిలాగే ఒకే విధంగా ఉంటాయి. మునగాల పరగణా ఆంధ్ర ప్రాంతంవారిదని, తెలంగాణ వారు పరగణాతో తమకు

సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు



గల సంబంధాలను ఏనాడూ ఎక్కడా వదులుకోనే లేదు. పైగా వీరు వారితో వారు వీరితో మమేకమై జీవించారు.

ప్రశ్న : మునగాల రాజావారు బయటి ప్రపంచంల్లో ఉదాత్తుల్లో గొప్పవారు. కాని పరగణాలో ఎందుకంత చెడ్డవారు?

సు : మునగాల రాజావారికి చాలా మంది పెద్దలతో సత్సంబంధాలున్నాయి. వీరందరికీ రాజావారి మనస్తత్వం బాగా తెలుసు. రాజావారు తనకి కావాల్సిన అనేక మందికి అన్ని విధాలా తోడ్పడ్డారు. పై పెద్దలు సహితం రాజావారి ద్వారా తమకు కావాల్సిన సహాయ సహకారాలు విరివిగానే పొందారు. వీటన్నింటికి డబ్బు ఎలా వచ్చింది. రాజావారు తమకు డబ్బు అవసరమైనప్పుడల్లా ప్రజలపై శిస్తులు పెంచారు. జుల్మానాలు విధించారు, భూములు లాక్కున్నారు. ప్రజలను కఠిన శిక్షలకు–తమ మాట వినని వారిని, తమకు ఎదురు వచ్చినవారిని అనేక రకాలుగా చిత్రహింసల పాలు చేశారు. తన కళ్లు తనంతటి స్థాయి రైతులను చూస్తే ఓర్వలేకపోయేవి. గొర్రెజీవాలున్నవారు తుమ్మ మండ కొడితే జుల్మానా, ఇంటికి కావాల్సిన బండ కొట్టుకుంటే జుల్మానా. ఇలా అనేక రకాలుగా శిక్షలు విధించి వచ్చిన డబ్బుతో బెజవాడలో, మద్రాసులో, హైదరాబాదులో లండన్ లో ప్రీవీ కౌన్సిల్లో జరుగుతున్న వారి దత్తత వ్యాజ్యం విషయమై ఖర్చుకు వాడుకున్నారు. పైగా తన పుట్టింటి వారి విషయంలోను, తన తోడల్లుడి ఆస్తుపాస్తుల విషయంలోనూ ఉన్న వివాదాలను మునగాల ప్రజలను పీడించగా వచ్చిన డబ్బే తన తల పైకి ఎత్తుకుని కోర్టుల చుట్టూ తిరగడానికి డబ్బు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు. బేతవోలు మత్తేదారుతో పంచాయతీ వివరీతమైనదేకాదు విస్తుపోయేది! మాధవరం చెరువు నుంచి ఎక్కువయిన నీరు అలుగు పారి క్రిందికి పోతుండడంతో ఆ నీరు బేతవోలు చెరువులోకి పోయి నందుకు గాను ఆ పంటలో తనకు సగం వాటా కావాలని బేతవోలు మత్తేదారులతో వివాదం పడటం ఎవరికి తెలియదు కనుక! రాజావారితో కూలీల కూలీ విషయంలో మద్రాసు నుంచి హెూం మినిస్టరు కూడా మునగాలకు రావాల్సి వచ్చిందంటే రాజావారి విషయం ఇప్పటికే తెలిసి ఉండాలి. జమీందారు పోలీసులతో జరి పించిన కాల్పులలో మా ఊరి అల్లుడు చీమ గురవయ్య చనిపోవడం మునగాలతో పాటు తెలంగాణకు తెలియనిది కాదు. రాజావారి మంచితనం బయటి వారికి తెలిసింది తాము పొందిన సహాయం వల్లనే. పరగణా ప్రజలకు రాజావారు దుర్మార్గుడని తెలిసింది రాజావారు చేసిన దుర్మార్గపు పనుల వల్లనే

ప్రశ్న : కష్టపడి ఈ పుస్తకం రాసిన ప్రయోజనం నెరవేరిందని అనుకుంటున్నారా?

సు : నేను ఆశించిన ప్రయోజనం ఈ గ్రంథం వల్ల పొంద వలసి నంతగా పొందలేకపోయాను. బాధాకరమైన విషయం ఏమి టంటే, నా ఈ పుస్తకాన్ని మునగాల పరగణా యువకులు, విద్యా వంతులు చదవాలనుకున్నాను. మారిన కాలంలో వారికి తీరిక ఎక్కడిది? వారి చదువులు వేరు, ఉద్యోగాలు వేరు. తెలిసిన వారు, చదువుకున్నవారు, విషయ సేకరణలో తోడ్పడినవారు చాలా మంది నా వెన్ను చరిచారు. శభాష్ అన్నారు. నా కృషి వృథా పోలేదు. ఇందుకు కారణం గొప్పగా స్పందించిన వావిలాల సుబ్బారావుగారి సమీక్ష చదివాక నా రచన, నా కృషి సఫలమైనదని తృప్తి చెందాను.

ప్రశ్న : ప్రజావ్యతిరేకత చూరగొన్న జమీందార్లు, దొరలు నేర్చుకోవలసిన పాఠం ఏమిటి?

సు : పాలకులు తాము ఎప్పుడూ ప్రజలవైపే ఉండాలన్న నిజాన్ని గ్రహించాలి తప్ప ప్రజావ్యతిరేకులుగా కాదు. ఇష్టం వచ్చిన రీతిగా వ్యవహరించడం వల్ల ఎక్కడో ఓ చోట బోర్ల పడక తప్పదన్న నిజాన్ని గ్రహించి తీరాలి. చరిత్ర వేయి కన్నులతో తమను గమనిస్తుం దన్న విషయాన్ని ఎప్పుడూ గ్రహింపులో ఉంచుకోవాలి. అందు నిమిత్తం ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రవర్తించాలన్న విషయాన్ని సదా గ్రాహ్యంలోకి తెచ్చుకోవాలి. ప్రజల మెప్పు పొంద ప్రయత్నించాలి కానీ, తమను కాకాపడుతున్న వారి మాటలను పట్టుకు ఊరేగడం, మంచి సలహాలు ఇచ్చినందుకు గాను వారిని తృణీకరించడం లక్ష్య పెట్టకపోవడం మంచి పద్ధతి కాదని, అటువంటి వారు చరిత్రలో దుమ్ముకొట్టుకుపోతారని గ్రహించాలి.

ప్రశ్న : నాయని వెంకటరంగారావు జీవితం చెప్పిన పాఠం ఏమిటి?

సు : ఎన్నో ఉరుకులు పరుగుల మీద పరగణా పాలన మోయడానికి దత్తత వచ్చిన రాజా నాయని వెంకటరంగారావుగారు చివరి దశలో తన తప్పిదాలను గుర్తించి ఉంటారు. కనుకనే హైదరాబాద్లో సుమారుగా 30 సంవత్సరాలు వుండి తిరిగి మునగాల పరగణా ప్రజల మొహం చూపడానికి చెల్లక రానేలేదు, ధైర్యమూ చేయలేదు. కొల్లు పాపయ్య చౌదరి పెద్ద రైతు. తను కట్టించే దాకా మునగాల పరగణాలో హైస్కూలే లేకపోయింది. కొల్లు పాపయ్య

శ్రద్ధాంజలి

ఆచార్య ఎన్ రామచంద్ర

కనువెలుగు 12.11.1939 – కనుమరుగు 29.6.2019



ఆచార్య ఎన్ రామచంద్ర ఇటీవల ప్రొద్దుటూరులో కనుమూశారు రామచంద్ర గారు కవి, విమర్శకులు, సమీక్షకులు నాటకరచయిత, వక్త, ఈతరం కవులకు సరైన మార్గనిర్దేశికత్వం చేస్తూ యువకులను ప్రోత్స హించేవారు. రాయలసీమలో ముఖ్యంగా కడప కర్నూలు అనంతపురం జిల్లాలలో ఎన్నో సాహితీ సంస్థలకు ఆయన పెద్దగా సలహాదారుగా వ్యవహరించేవారు ఆయనను ఈతరం కవులు పెద్దయ్యా అని పిలవటం పరిపాటి.

పెద్దయ్య తన 20వ ఏటి నుంచీ కవితలు వ్రాయడం అలవాటైనది. ఆనాటి గొప్పకవులందరిసాహిత్యాన్నీ శ్రద్ధగా చదివే వారు. భాషాప్రవీణ, ఎంఏ తెలుగు పీహెచ్డీ చేశారు. ప్రొద్దుటూరు ప్రభుత్వం డిగ్రీ కళాశాల అధ్యాపకులుగా పనిచేశారు. 1997లో పదవీ విరమణ పొందారు. అంతవరకూ ఎన్నో రచనలు చేసినా విరామానంతరం తన జీవితం పూర్తిగా సాహిత్యానికే కేటాయించారు.

అభ్యుదయ వాది, మానవుడే దేవుడు అనే భావజాలం ఆయనది. అలాగే కులతత్వం సమాజాభివృద్ధిని కుంటుపరిచే చీడ అని నమ్మి ఆచరించారు.

సమాజంలోని రుగ్మతలనూ దురాచారాలనూ దూరంచేసేలా వ్రాయగలవారు, ఆలోచింపచేసేలా వ్రాసేవారే అసలైన కవులు అంటారాయన. ఎన్నో రచనలు చేశారు. వివిధ సాహిత్యప్రక్రియలలో వీరి కలం వినూత్న పోకడలు పోయింది.

రచనలు...విమర్శా సాహిత్యం : చలం. సాహిత్యం సామాజిక దృక్పథం 2. సమగ్రాంధ్ర వాఙ్మయ చరిత్ర...(ప్రభుత్వం ప్రచురణ) 3.భారతీయ వారసత్వం-సంస్కృతి (డిగ్రీ పాఠ్యాంశం) 4.పరిశోధనా వ్యాసాలు 5. సర్వాంతర్యామి 6. సీమసాంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర బృహత్ గ్రంథం 7. హేతువాద దార్శనికుడు కవి..మనవేమన 8. తేనెమబ్బులు..తీపి గురుతులు, సాధికారిక సాహిత్యవిమర్శా వ్యాసాలు

సృజన సాహిత్యం : రక్తంచెమర్చిన కళ్లు...వచన కవితా సంపుటి; సాహితీ సౌరభం..ఆధునిక కవితాసంకలనం; .కోయిలమ్మ పదాలు...మాత్రా ఛందస్సులో; ఊకదంపుళ్లు..వచనకవితా సంపుటి; ముళ్ల గులాబీలు...3 నవలలు...నూర్జహాన్, నేను సైతం, రేనాడు; మాళవిక కథా సంపుటాలు...కథానికా ప్రస్థానం, పగటిచుక్కలు దారితప్పిన యాత్రికులు, స్వప్నచారులు, మనిషి మనిషి, మా పల్లె ముచ్చట్లు, కుముద్వతీ తీర కథలు, మాసీమ కథలు పౌరాణిక పద్య నాటకాలు పారిజాతాపహరణం, శ్రీకృష్ణమాయ.

బహుమతులందిన రచనలు, ఆయన అందుకొన్న సన్మానాలు అనేకం. భ్రమరగీతికలు అనేకవితాసంపుటి పూర్తిచేశారు ఆవిష్కరించే లోగా అనారోగ్యంతో కన్నుమూశారు

రాయలసీమ యువకవులను ప్రోత్సహిస్తూ పెద్దదిక్కుగా ప్రతి సాహితీ సమావేశాల్లో చురుగ్గా పెద్దరికం వహిస్తూ పాల్గొనే కవి పెద్దయ్య ఎన్ రామచంద్రగారికి కన్నీటి బాష్పాంజలి.

– కోడూరు సుమన 8562253427

చౌదరి నిర్మించిన హైస్కూల్లో చదివిన పిల్లలంతా ఈనాటికీ పాపయ్యచౌదరినే జ్ఞాపకం చేసుకుంటారు తప్ప రాజావారిని తలుచుకున్నవారే లేరు ఈనాటికీ. కారణం? రాజావారు ప్రజలకు చేసిన ఏ మంచి పనీ లేదు కనుక. పైగా పాపయ్య చౌదరిని హైస్కూల్ నిర్మించవద్దని హెచ్చరించినవారు కూడా. పాపయ్య చౌదరిని హైస్కూల్ నిర్మించడానికి ప్రోత్సహించింది రాజావారికి నమ్మకమైన తన మేనేజర్ పాపిరెడ్డిగారు కావడం గమనార్హం!

ప్రశ్న : ప్రజలు, జమీందారులని పోషించారా? జమీందారులు ప్రజల బాగుని చూసుకున్నారా?

సు : ప్రజలే జమీందారుని పోషించారు తప్ప, రాజావారు ప్రజలను పోషించలేదు, ఉద్ధరించనూలేదు. నిజంగా రాజావారు మొదట్లో పరగణాను అభివృద్ధి పథంలో పయనింపచేయాలని చూశా రని అంటారు. కానీ, ఆయన చుట్టూ కోర్టు కేసులు ముసురుకోవడం, ఎవరినీ సహించకపోవడం, దార్ష్టికం చూపించడం, ప్రతి ఒక్కరితోనూ పంచాయతీ కొనితెచ్చుకోవడం రాజావారికి అనుదిన చర్యగా మారింది. ఇందుకు బలహీనమైన కారణాలు ఇలా చెప్తారు. ఈ జరిగిన చర్యలన్నీ గుమస్తాలు, తైనాతీల వల్ల జరిగినవేనని చెబుతారు నిజమే. మంచినీటి బావులలో మూత్రం పోయించిన గుమస్తాలను రాజావారు ఇదేమిటని హెచ్చరించవద్దా – ఇది తప్పని. కానీ ఇది మర్చిపోయి, రాజావారు అబ్బో ఎంత సుగుణ శీలి, ఎంత అభ్యు దయ కాముకుడు అని మెచ్చబోతారు కాని ప్రజల జీవితాలు, వారి పేదరికం కారణంగా చదువులేని కారణంగా ఎన్నో బాధలుపడిన కారణంగా రాజావారిని ఎవరూ హర్షించని పరిస్థితి దాపురించింది.

ప్రశ్న : పుస్తకం ద్వారా మీరు ప్రకటించదలుచుకున్న విషయం ఏమిటి?

సు : నేను ఎన్నో విషయాలు రాజావారిని గురించిన ప్రతి విషయాన్ని ఈనాటి ప్రజలకు ముఖ్యంగా మునగాల పరగణా ప్రజలు అవగతం చేసుకోవాలని ఎంతో ఆశించాను. నాకు రాజావారి విష యమై ఎన్నో విషయాలు చెప్పిన పెద్దలు వృద్ధులయిపోయారు. కొందరు మంచాన పడ్డారు. వీరి నుండి రాజావారి పరిపాలన విష యాలన్నీ నేను వినడమేకాదు. ప్రజలందరూ తెలుసుకోవాలి, వారి జ్ఞాపకాలను సజీవంగా ఉంచాలి. ప్రజలకు పాఠం కోసం వారి తపనను వారు పడ్డ కష్టాలను అక్షర రూపంలో తేవాలని నేను ఎంతో కృషి చేశాను. మెరిసేదంతా బంగారం కాదని మరోసారి ప్రజలకు తెలియజెప్పాలి.

– తిరుమలరావు

కథ

ఆదూరి హైమావతి
9632503483

పండితుని ఉపాయం



విద్యానగరం జమీందారు వీర వెంకటరాయలు. ఆయన తన జమీని అన్నివిధాలా వృద్ధిచేశాడు. చోడవోలు అనే గ్రామం ఒక్క చదువులో వెనుకబడి ఉంది. ప్రజలంతా అన్నీ తెల్సుకున్నా, చదవను వ్రాయను మాత్రం రాకపోవడం ఆయనకు తలవంపు లుగా ఉండేది. ప్రజలు వారి వారి వృత్తులు నిర్వహించు కుంటూ తమపిల్లలకు వారి అను భవంతో వృత్తి విద్యలునేర్పుతూ హాయిగా జీవి స్తున్నా, అక్షర జ్ఞానం లేకపోవడం జమీం దారును చాలాఇబ్బంది పెట్టసా గింది. ప్రపంచం ఆధునికంగా ఎంతో మారుతున్నా, తన చోడవోలు గ్రామ ప్రజలకు చదువు రాక పోవడం వలన కష్టాలు కలుగుతాయని ఆయన చాలా బాధపడుతుండేవాడు.

పుల్లయ్య “అయ్యా! నాకు చదవను, వ్రాయనూ రాదుకదా! మరి ఎలా?” అని బాధతో చెప్పగా, పండితుడు నవ్వుతూ” నీకు ఇష్టమైతే నేను నీకు ఇక్కడే చదవను, వ్రాయను చెప్తాను నేర్పుతాను. మా నాగప్పకూ నేను పశువులను కాస్తూనే చదవను, వ్రాయను నేర్పాను. నీకూ అలానే నేర్పుతాను.” అని చెప్పాడు.

ఎవరినైనా పండితుని పిలిపించి తన జమీలోని చోడవోలు గ్రామంలో పాఠశాల నెలకొల్పాలని చాలా మార్లు ప్రయత్నించాడు. కాని ప్రజలెవ్వరూ తమ పిల్లలను పాఠశాలకు పంపకపోడంతో ఆ పండితులు “మేం ఊరకే కూర్చుని చదువు చెప్పకుండా జీతం ఎలా తీసుకుంటామని” వెళ్ళిపోసాగారు.

ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో తెలియక ఎంతో ఆలోచించి చివరకు, జమీం దారు తన దివాన్ సలహాతో తన జమీకి పొరుగునే ఉన్న “ మైత్రీ దేశం” గురుకులం నుండి ఒక పండితుని పిలి పించాడు.

జమీందారు ఆపండితునితో “పండిత శ్రేష్ఠా! ఎలాగైనా మా చోడవోలు ప్రజలను మీరు విద్యావంతులను చేయాలి. ప్రపంచం ఎంతో మారిపోతున్నా, మారుమూల ఉన్న మా చోడవోలు గ్రామప్రజలు విద్యాజ్ఞానం

లేక, బయటిదేశాలకు వెళ్ళినపుడు ఇబ్బందుల పాలవుతున్నారు. తమరెలాగైనా మా చోడవోలు గ్రామప్రజల పిల్లలకు చదువు నేర్పితే మేము సంతోషిస్తాం. కనీసం చదవనూ, వ్రాయనూ వస్తే చాలు, పెద్దపెద్ద గ్రంధాలు పఠించనక్కరలేదు. మీ కష్టం ఉంచుకోం." అని వినయంగా మనవి చేసుకున్నాడు.

ఆ పండితుడు "జమీందారుగారూ! మీరేం బాధపడకండి, నా ప్రయత్నం నేను చేస్తాను, మీరు మాత్రం నేను చదువు చెప్పను వచ్చిన ఉపాధ్యాయుడనని ఎవ్వరితో అనకండి. అంతేకాక తమరు ఒక పాఠశాల ప్రారంభించ బోతున్నట్లు కానీ, ప్రజలను తమ పిల్లలను పంపమని కానీ ఏప్రకటనా చేయకండి. మౌనంగా చూస్తుండండి. నేను చేయబోయే ప్రయత్నాన్ని ఈ నా స్వంతఆలోచన ఎంతవరకు ఫలిస్తుందో చూస్తాను. మరి శలవు." అని తనకు కేటాయించిన ఆ గ్రామ వసతి గృహంలోకి మకాం వచ్చి, ఆ రాత్రి విశ్రాంతి తీసుకున్నాడు.

✦

ఆ మరునాడు తానూ తన ఆవులను, గేదెలను జమీందారుగారిచ్చిన ఒక సేవకుని మారు వేషంలో తన కుమారునిగా చెప్పుకుని పశువులను మేపేందుకు వెళ్ళే వారందరితో కల్సి, పెద్దలు, పిల్లలందరితో "తాను పరదేశినని తనకు జమీందారుగారు పశువులను ఇచ్చారనీ వారితోపాటుగా తననూ తన పశువులను మేపుకోను రానివ్వమనీ" కోరాడు.

వారు ఎంతో సంతోషంతో "దానిదేముంది ఈ జమీ అంతా మా ప్రభువులది. ఆయనెంతో మంచిప్రభువు. మాకే కష్టం రానివ్వరు. ఆయన పాలనలో మేము సుఖంగా ఉంటున్నాం. మీరూ జమీందారుగారిచ్చిన పశువులను మేపుకోనవస్తున్నారు. సంతోషం గారండి." అని తోడుగా తీసుకెళ్ళారు.

అడవిలో పశువులను మేపుకుంటూ ప్రజలందరితో కలసిపోయాడు పండితుడు. క్రమేపీ వారికి ఎన్నో కథలు, పాటలూ, పద్యాలు వినిపించేవాడు. వాటి అర్థాలు చెప్పేవాడు. భారత, భాగవత, రామాయణ కథలన్నీ చెప్పగా, చెప్పగా వారు వాటిని ఎంతో ఇష్టంగా వినసాగారు. ఇలా ఆయన వారి అభిమానం చూరగొన్నాడు.

ఒకరోజున ఆ పండితుడు ఒక తాళపత్ర గ్రంధంతెచ్చి"దీనిలో ఉన్న పద్యాలు మీరెవరైనా చదండి, ఎంత బాగున్నాయో! ఈ గ్రంధంలో మనం చేసే పనులనుబట్టి మనకు రాబోయే జన్మలు ఏంటో తెలుస్తాయ్, కావాలంటే మీరే చదువుకోవచ్చు." అనగా వారు మౌనం వహించారు.

పండితుడు "ఏంటిమీకు ఇష్టం లేదా? పోనీ మీకు ఇంకో తేలికైన వచనంలో ఉన్న గ్రంధం చూపుతాను" అని, అడవిలో పశువులను మేపుతున్న కుమారుడని చెప్పుకున్న నాగప్పతో పండితుడు, "నాగప్పా! ఆ తాళపత్ర గ్రంధం పట్టుకురా! నీవు రాబోయే జన్మలో ఎక్కడ పుడతావో చూసి చెపుతాను." అని నాగప్పను పిలిచి, ముందుగానే అతనికిచ్చిన తాళపత్రగ్రంధం, తీసుకుని విప్పిచదివి " నాగప్పతో పాటుగా మీ అందరి భవిష్యత్తు కూడా కావాలంటే మీపేర్లను పట్టి చెపుతాను. కావల్సినవారు రండి" అని ముందుగా నాగప్ప పేరు తాళపత్ర గ్రంధంలో చూసి, వేళ్ళతో లెక్కించి, ఒక కాయితం మీద వ్రాసి "నాగప్ప మావాడు కనుక వాడికి రాబోయే జన్మేకాక ఇక కొద్ది కాలంలో జరిగే విషయాలన్నీ చెప్తున్నాను. వీడు నాదగ్గర కొంచెం చదువుకున్నాడు కనుక వీడి త్వరలో జమీందారు గారు తన ఆస్థానంలో ఒక ఉద్యోగం ఇవ్వబోతున్నారు. ఆ తర్వాత వీడికి ఉద్యోగం వచ్చిం దన్న పొగరుతో, తండ్రినైన నన్ను లెక్కచే యడు. దానివల్ల వీడికి రాబోయే జన్మ గాడిద జన్మ. వీడు కనుక ఈ విషయం తెల్సుకుని పొగరుగా ఉండక, తల్లి తండ్రులను గౌర వంగా, భక్తిగా చూసుకుంటే వీడు రాబోయే జన్మలో ఒక రాజుగా జన్మించ వచ్చు. అది వీడు ఇప్పుడు తెల్సుకుని ఆచరించే విధానాన్ని బట్టి ఉంటుంది." అని చెప్పాడు. అక్కడి పెద్ద లకు, పిల్లలకు అంతా తమ రాబోయే జన్మ గురించి తెల్సుకోవాలనే కోరిక కలిగింది.

ముందుగా పండితుడు, చిన్నపిల్లల పేర్లు అడిగి లెక్కలుకట్టి "నీపేరు పుల్లప్ప. నీకు స్థిరచిత్తం లేదు. నీవు ఒకపని మీద మనస్సు నిలుపలేవు. అందువల్ల నీకు అన్నం దొరకడం కూడా కష్టమవుతుంది. రాబోయే జన్మలో నీవు కోతిగా జన్మించి, ఈ అడవిలోనే చెట్లపై తిరుగుతూ, పండ్లు కూడా దొరక్క , ఊరిలో ప్రవేశిస్తావు, అక్కడ అందరూ నిన్ను రాళ్ళతో కొడతారు. నీబాధ పడలేక జమీందారుకు మొర పెట్టుకోగా, ఆయన ఒక కోతులు పట్టేవాడిని పిలిపించి, నిన్ను పట్టుకుని చంపితే వెయ్యి రూపాయలు ఇస్తానంటాడు." అని చెప్పగానే వాడు గట్టిగ ఏడ్వసాగాడు.

పండితుడు వాడి భుజం తట్టి "పుల్లయ్యా! ఇది రాబోయే జన్మకథ. నీవు అన్నీ తెల్సుకుంటే చెడ్డ పనులు చేయకుండా ఉంటే నీకా బాధలేవీ వుండవు. ఐతే నేను చెప్పిన విషయాలన్నీ మరచిపోకుండా నీవు ఒక కాయితం మీద వ్రాసుకుని అప్పుడప్పుడూ చదువుకుంటూ ఉంటే మంచిది. నీకో మంత్రం కూడా చెప్తాను, కాయితం తెచ్చి వ్రాసుకో" అని చెప్పాడు.

పుల్లయ్య "అయ్యా! నాకు చదవను, వ్రాయనూ రాదుకదా! మరి ఎలా?" అని బాధతో చెప్పగా, పండితుడు నవ్వుతూ" నీకు ఇష్టమైతే నేను నీకు ఇక్కడే చదవను, వ్రాయను చెప్తాను నేర్పుతాను. మా నాగప్పకూ నేను పశువులను కాస్తూనే చదవను, వ్రాయను నేర్పాను. నీకూ అలానే నేర్పుతాను." అని చెప్పాడు.

పండితుడు ఇంకా కొందరు పిల్లల పేర్లు అడిగి వారిరాసులు లెక్కించినట్లు నటించి, వారి అలవాట్లు, కోరికలు అడిగి, వారి రాబోయేజన్మల్లో ఏ ఏ జీవులుగా పుట్ట బోతున్నారో చెప్పసాగాడు. కొందరు, ఎలుకలుగా, కొందరు పిల్లులుగా, కొందరు కొంగలుగా, చిలుకలుగా, పండ్లచెట్లుగా మరి కొందరు పండితులుగా, ఇంకో కొందరు బాగా ధనవంతులుగా ఇలా వారి రోబోయే జన్మల్లో కాబోయే పుట్టుకలగురించి చెప్పగా వింటున్న పెద్దలంతా తామూ తమ రాబోయే జన్మలగురించీ తెల్సుకుంటే బాగుంటుందనే భావన కలగ సాగింది. సహజంగా ప్రతి ఒక్కరికీ తాము ఇంకా మంచి జన్మలు ఎత్తాలనే భావన, వాటి గురించీ తెలుసుకోవాలనే కోరిక కలగటం సహజం. ఆ భావనను ఉపయోగించుకుని మన పండితునికి తాను చేయ తలపెట్టిన పని సాధించగలననే నమ్మక పెరగసాగింది.

మిగిలిన పెద్దలందరితో "మీకూ కావలిస్తే మీ రాబోయే జన్మల గురించీ చెప్తాను. ఐతే మీ జన్మలు ఎలాంటివి వుంటాయో అందరి ముందూ చెప్తే మీకు బాధగా ఉండ

వచ్చు. కనుక మీ అందరికీ కాయితాలపై వ్రాసి ఇస్తాను. మీరు ఇళ్ళకెళ్ళి చదువుకో వచ్చు." అని పండితుడు అన్నాడు.

అందరూ "తమకు చదువురాదని, చదువు గురించీ తమ జమీందారు ఎంత చెప్పినా తాము పట్టించుకో లేదనీ, తమ రాబోయే జన్మల గురించీ తాము తెల్సుకో వాలంటే ముందుగా చదువు నేర్చుకుంటా మనీ, ఐతే తమ పొలం పనులు, మొదలైనవి మానుకోడం కూదరదనీ, తమ పిల్లల ను పాఠశాలకు పంపితే తమ పనులు ఆగిపోతా యనే భయంతోనే తాము జమీందారుగారు పెట్టిన పాఠశాలలకు తమ పిల్లలను పంప లేదనీ కూడా" చెప్పారు.

✦

పండితుడు, "మీరెవ్వరూ మీపనులు మానుకోనక్కరలేదు. పెద్దలకూ, మీపిల్లలకూ కూడా నేను ఇక్కడే మా నాగప్పతో కలిపి చదువు చెప్తాను." అన్నాడు.

అందరూ పండితుని మాటలకు అంగీకరించారు. ఇహనేముంది మన పండి తుల వారు మధ్యాహ్న సమయాల్లో అందరికీ నదీతీరంలో చెట్టుక్రింద ఉన్న ఇసుకలో అక్ష రాలు వ్రాయడం నేర్పుతూనే, శతక పద్యాలు, వాటి అర్థాలు, బాలరామాయణ శ్లోకాలు, మహాభారత, భాగవత కథలు, మొదలైనవి నోటితో చెప్తూ, నోటి గణితం కూడా చెప్ప సాగాడు. అందరూ వ్రాయడం చదవడం, గణిత సమస్యలు కూడా పోటాపోటీగా నేర్చు కోసాగారు. పండితులవారు పద్యాలు అనేక మార్లు పలికించడం వలన వారికి అర్థం కూడా బోధించడం వలన, అతిసులువుగా కంఠతా పట్టసాగారు.

పండితులవారు బోధించే మానవతా విలువలను గురించే కాక, మట్టిలో ఉండే ఖనిజాలు, మొక్కలతీరు తెన్నులు, మొక్కలకు వేసే సహజ ఎరు వులు, ఏపంటకు ఎంత ఎరువు వేయాలి, ఏపంటవేస్తే అధికంగా దిగు బడి ఉంటుంది, ఏ పశువులకు ఎలాంటి పోషణనివ్వాలి, నీటిని పొదుపుగా వాడటం గురించిన అనేక విషయాలు వారికి అవగాహ నయై, వారి నిత్య కృత్యాల్లో వాటిని పాటిస్తూ ఎంతో అధిక దిగుబడులు పొంద సాగారు.

అంతేకాక ఆరోగ్యం గురించీ, నిత్యం తీసుకోవలసిన ఆహారం గురించీ, బియ్యం మాత్రమేకాక, తాము పండించే రాగి, సజ్జ, జొన్నవంటి తృణ ధాన్యలవలన, కలిగే మేలు గురించీ, ఆకు కూరలు తినడం వలన ఎంత లాభమో ముఖ్యంగా పిల్లలకు వివరిస్తూ, తాను స్వయంగా ఆకు కూరలతో చేసిన వంట కాలు వారికి మధ్యాహ్న భోజన సమయంలో పెట్టి మంచి అవగాహన రుచి పూర్వకంగా కలిగించాడు.

అంతేకాక ఎవరు అధిక పద్యాలు కంఠతాపట్టి వప్పచెప్తారో వారికి బహుమతి కూడా ప్రకటించాడు. దీంతో పిల్లలతో పాటు గా పెద్దలు సైతం పండితుని ఇంటికి రాత్రులు వెళ్ళి పద్యాలు చెప్పించుకోసాగారు. మగ వారంతా చదువుకుంటుండగా ఆగ్రామంలో స్త్రీలు సైతం పండితుల వారి ఇంటికి సాయం సమయాల్లో తీరికవేళల్లో వెళ్ళి చదువు నేర్చు కోసాగారు. అలా అలా పండితుని ఇల్లు ఒక పాఠశాలగా మారింది.

తాను కోరిన మార్పు ఆ గ్రామ ప్రజ ల్లో వచ్చినందుకు పండితులవారు ఎంతగానో సంతోషించారు. ఆ సంక్రాంతి పండుగకు అందరికీ పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానోత్సవానికి జమీందారుగారిని ఆహ్వా నించారు.

జమీందారుగారు ఆ గ్రామ ప్రజలు నేర్చిన చదువు, శతక పద్యాలు, నోటి గణి తంలో సామర్థ్యం ఎంతో పెద్ద సమస్యలకు సైతం నోటి పరిష్కారం, తిలకించి ఎంతో ఆనందించారు. చిత్రలేఖనం, స్వంతంగా పాటలు కట్టి పాడే విధానంలోని పోటీ జమీం దారుగారినెంతో ఆనంద పరిచింది.

కొందరి చేతి వ్రాత ఆయనకు ఆశ్చ ర్యాన్ని కలిగించింది. పిల్లలతో పాటుగా మగ వారు, స్త్రీలు సైతం పోటీ పడటంఆయన ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా చేశాయి.

తన గ్రామ సమస్యను ఇంత సులు వుగా పరుష్కరించిన పండితులవారిని ఘనం గా సన్మానించారు జమీందారు గారు. పండి తుల వారు మాట్లాడుతూ "ప్రియమైన ఈ గ్రామ సోదర సోదరీ మణులారా! పిల్లలారా! ఈ రోజు నాకెంతో ఆనందంగాఉంది. నేను చదివిన చదువుకు సార్థకత లభించింది. చదువు పదిమందికీ ఉపయోగపడిన నాడే దాని విలువ మరీ పెరుగుతుంది. జమీం దారు గారు ఎంతో కాలంగా మీ గ్రామంలో పాఠశాల ప్రారంభించి మిమ్ము విద్యావంతు లను చేయాలని సంకల్పించారు. దానికై ఎన్నో ప్రయత్నాలు కూడా చేశారు. ఆపని ఈ రోజున భగవంతుని మా గురుదేవుని ఆశీ ర్వచనాలతో ఫలించడం నిజంగా నా అదృ ష్టంగా భావిస్తున్నాను. మీకు విద్య వలన కలిగే మేలు ఈ పాటికే తెల్సి ఉంటుంది. ఇతర గ్రామాలకు, ఇతరదేశాలకు వెళ్ళినపుడు మీరు మోస పోరాదని, ఇబ్బందులు పడ రాదని మన జమీందారుగారి ఉద్దేశ్యం. అది ఇపుడు ఫలించింది. మీ పంటలు, మీ పండ్లు ఇతర దేశాలకు పంపినపుడు లావాదేవీల విషయంలో మీరు ఇంతకాలం మధ్యవర్తు లపై ఆధారపడటం వలన వారు మీకు చదువురాదని గ్రహించి మిమ్ము మోసం చేస్తు న్నారని జమీందారుగారు గ్రహించారు. ఇపుడు మిమ్మల్ని మోసం చేయగల ధైర్యం ఎవ్వరికీలేదు. మీపిల్లలు, మీరు, మీ గ్రామం లోని స్త్రీలు సైతం చదవనూ వ్రాయనూ, లెక్కలు గుణించనూ నేర్చారు. చదువుకు పనులు అడ్డురావు.

మీరంతా పనులు ఆగిపోతాయని ఇంతకాలం చదవలేదు. చదవడం వలన పనులు ఆగవు, అని మీకు ఇపుడు తెలిసి ఉంటుంది. నిజానికి ఈ వ్యక్తినా కుమారుడు కాదు. జమీందారుగారు నాకు తోడుగా పంపిన సేవకుడు. ఇతనూ నాకెంతో సహక రించాడు ఓపిగ్గా.

నా పాచిక పారి మీరంతా మీమీ రాబోయే జన్మల్లో కాబోయే పుట్టుకలగురించీ తెల్సుకోవాలన్న కోరికతో మీకు తెలీకుండానే చదువుకున్నారు. మీ జమీందారు వంటి వారు పాలకులైన దేశంలో దేనికీ కొరవ ఉండదు. అల్లాంటిపాలకులు సాధించలేనిదీ ఉండదు. నిజానికి మీ జమీందారుగారు మీ పాలిటి దైవం. వారు నాకప్పగించిన పనిని నేను పూర్తిగా చేయగలిగాననే అనుకుంటు న్నాను. మీకంతా చదువురాకున్నా మీ స్నేహ భావానికి, కట్టుబాటుకు, నాపై చూపిన ఆద రానికీ, మీ జమీందారుగారి మీద మీకున్న గౌరవానికీ నాకు చాలా ఆనందంగా ఉంది. మీ వద్ద నిజం దాచినందుకు నన్ను మన్నిం చండి" అని చెప్పగానే ఆ గ్రామ ప్రజలు, జమీందారుసైతం కరతాళ ధ్వనులు చేశారు.

ఏపని సాధించనైనా పట్టుదలతో పాటుగా ఉపాయమూ అవసరం.

జాన్‌సన్ చోరగుడి
9866224828

దక్షణాదికి మరో 'రాజ్యాధినేత' ఆగమనం!



చరిత్ర దృష్టికోణం నుంచి దక్షణాదిని చూసినప్పుడు 24 జులై 2019 ఒక ప్రత్యేకమైన రోజు. ఎందుకంటే, రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధాని తన నూతన ప్రాదేశిక ప్రాంతంలోకి ప్రవేశించిన తర్వాత, దాని తొలి 'రాజ్యధినేత' (స్టేట్ హెడ్) గా ఆ రోజు ఉదయం పదవీ ప్రమాణ స్వీకారం చేసారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు, డా. బిశ్వభూషణ్ హరిచందన్ ఇప్పుడు ఆ పదవిలోకి వచ్చారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరగడం, ప్రభుత్వాధినేతలు రావడం వెళ్ళడం వేరు. కానీ రాజ్యధినేతగా గవర్నర్ పదవి చుట్టూ...దృగ్గోచరమైన రాజ్యాంగ సంబంధిత అధికార సాంద్రత వొదిగుంది. ప్రభుత్వాలు ఉన్నప్పుడు, లేనప్పుడు, మధ్య ఉండే...విరామకాలంలో కూడా అది యధావిధిగా ఉంటుంది, అందుకే గవర్నర్‌ను 'రాజ్యాధినేత' అనడం.

రాష్ట్ర విభజన 2014 జూన్ 2 న జరిగాక, రెండు రాష్ట్రాలకు శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ గవర్నర్‌గా ఇప్పటి వరకు హైదరాబాద్ రాజభవన్ లో ఉంటూ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించారు. అయితే ఈ రోజు నుంచి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ డా.బిశ్వభూషణ్ హరిచందన్ విజయవాడలోని రాజభవన్ నుంచి పరిపాలన సాగిస్తారు. ఈ నియామకంతో ఐదేళ్ళ క్రితం అమల్లోకి వచ్చిన 2014 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం అమలులో, ప్రధానమైన అంశం పూర్తి అయినట్టు అయింది.

చట్టం ఆచరణ, అమలులో మిగిలినవి ఇక ఇప్పుడు వేగవంతం అవుతాయి. వింధ్య పర్వతాలకు ఇవతల దక్కన్ పీఠభూమిలో హైదరాబాద్ నగరానికి దక్షణాన తూర్పు కనుమల పర్వత శ్రేణుల రక్షణ, నదీతీర మైదానం, బందరు నౌకాశ్రయానికి ఫెర్రీ, ఇన్ని వసతులు ఉన్న పట్టణం బెజవాడ. దాంతో మొఘల్ చక్రవర్తుల కాలంలో ఇది ఔరంగజేబ్‌కు మరాఠాలమీద పోరుకాలంలో సైనిక పటాలాల మజిలీ స్థావరమయింది. ఆ తర్వాత, ఈస్ట్ఇండియా కంపెనీకి చెందిన 'మద్రాస్ నేటివ్ ఇన్ఫెన్ట్రీ' 52 పటాలాలు 1858 తర్వాత బ్రిటిష్ మిలటరీ లో కలిసినప్పుడు, వాటిలో ఒకటైన 30 వ రెజిమెంట్‌కు ఇది కంటోన్మెంట్ అయింది. ఇలా మొదటి నుంచి కోస్తాంధ్రలో ప్రధాన కూడలి నగరం బెజవాడ.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, ఇన్నాళ్ళకు అది ఇప్పుడు గవర్నర్‌నివాస నగరం అయింది. క్రైస్తవులు చేసే పరలోక ప్రార్ధనలో 'నీ రాజ్యం వచ్చుగాక...' అనేట్టుగా, రాష్ట్ర విభజన తర్వాత, 'రాజ్యం' చిన్న చిన్న ప్రాదేశిక ప్రాంతాలకు తరలి వస్తున్న వైనం ఎటువంటిదో తెలుసుకోవడం ఈ సందర్భంగా ఆసక్తికరమైన అంశం అవుతుంది. ఈస్ట్ఇండియా కంపెనీ 1851 నాటికి దేశమంతటినీ తన అధీనంలోకి తెచ్చుకుంది. ఆ తర్వాత గవర్నర్ జనరల్ పరిపాలనా పరిధిలో గవర్నర్ల పరిపాలనలో కలకత్తా కేంద్రంగా బెంగాల్ ప్రెసిడెన్సీ, బొంబాయి కేంద్రంగా బొంబాయి ప్రెసిడెన్సీ, మద్రాస్ కేంద్రంగా మద్రాస్ ప్రెసిడెన్సీ, ఆగ్రా కేంద్రంగా నార్త్-వెస్టర్న్ ప్రావిన్స్ ఉండేవి.

స్వాతంత్ర్యం తర్వాత పండిట్ నెహ్రూ ప్రధానమంత్రిగా వున్న రోజుల్లో చిరకాల పోరాటం తర్వాత, భాషాప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికగా మెద్రాస్ నుంచి 1956 నాటికి ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఇది జరిగిన పదేళ్ళ తర్వాత 1969 నాటికి తెలంగాణ ఉద్యమం మొదలయింది. పలు దశల్లో దాని ఉత్థానపతనాలు తర్వాత 2014 నాటికి అది సాకారమయింది, రాష్ట్రం రెండు అయింది. నూతన ముఖ్యమంత్రి చెబుతున్నప్రతిపాదిత కొత్త జిల్లాలు కూడా వస్తే, అప్పుడు ప్రభుత్వ పరిపాలన మరింత సూక్ష్మస్థాయికి చేరుతుంది.

పదేళ్లపాటు హైదరాబాద్ రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధాని అనే వెసులుబాటు విభజన చట్టంలో వుంది. అయినప్పటికీ 2015 జూన్ నాటికి అప్పుడు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రాజధానిని విజయవాడకు మార్చింది. దాంతో అకస్మాత్తుగా సచివాలయంతో పాటుగా శాఖాధిపతుల కార్యాలయాలు బెజవాడకు చేరాయి. కాగా ఇప్పుడు ఐదేళ్ళ తర్వాత ఆంధ్రప్రదేశ్ కు గవర్నర్ నియామకం జరిగి, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ రాజకీయ నాయకుడు డా.బిశ్వభూషణ్ హరిచందన్ ఆంధ్రప్రదేశ్ 23 వ గవర్నర్ అయ్యారు. అయితే, ఆయన విభజిత ఆంధ్రప్రదేశ్ కు రెండవ గవర్నర్, బెజవాడలో మకాం చేస్తున్నమొదటి గవర్నర్.

అయితే, 'రాజ్యం ఎలా వస్తుంది...?' అనేది ఇప్పుడు ఇక్కడ ప్రశ్న. గతంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర గవర్నర్ చేసే పర్యటనలు అంటే అవి – విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి వంటి

నగరాలకు మాత్రమే ఎక్కువసార్లు పరిమితమై ఉండేవి. ఇప్పుడిక అవి ద్వితీయ శ్రేణి నగరాలైన – ప్రొద్దుటూరు, కావలి, గుడివాడ, పిఠాపురం, టెక్కలి వంటి చిన్న పట్టణాలకు విస్తరిస్తాయి.

అయితే, దానివల్ల ఏమవుతుంది? అనేది మనకు కలిగే సందేహం. కొత్త ప్రాంతాలు 'ఓపెన్' అవుతాయి. ప్రాంతాలు 'తెరవ బడటం' అనేది అన్నిసార్లు 'లింక్ రోడ్లు' వేయడంతోనే కావు. గవర్నర్ వంటి రాజ్యాంగ పదవిలో ఉన్నవారి సందర్శనలవల్ల అది మరింత భిన్నంగా జరుగుతుంది. అప్పుడు ఆయా ప్రాంతాలు పట్టణాల 'ఏథోస్' బయట ప్రపంచానికి వెల్లడి అవుతాయి. కొత్తజాతులు తెగలు లిపిలేని భాషలు వెలుగు నోచుకోని చిన్నపట్టణాల వైతాళికులు అప్పుడు బయటకు వస్తారు. అప్పుడు వారికి 'రాజ్యం' గుర్తింపు దొరుకుతుంది. భాషావేత్తగా మనకు బాగా తెలిసిన సి.పి.బ్రౌన్ బ్రిటిష్ ప్రభుత్వ అధికారి. ఆయన పూనికతో తెలుగు భాషకు జరిగిన మేలు మనకు తెలుసు.

విభజన తర్వాత ఇప్పటి వరకు మూడు కార్యాలయాలకు వసతినిచ్చిన బెజవాడ పి.డబ్ల్యు.డి. గ్రవుండ్ సమీపంలో ఉన్న ఒక నాటి నీటిపారుదల శాఖ ఆవరణం, మళ్ళీ ఇప్పుడు కొత్తగా 'రాజ్ భవన్' అయింది. ఒక ప్రాదేశిక ప్రాంతానికి కొత్తగా రాష్ట్ర ప్రతిపత్తి ప్రకటించాక, అందుకు అవసరమైన హంగులు ఏర్పడడానికి కనీస వ్యవధి అవసరం. అందుకే చట్టంలో కేంద్రం హైదరాబాద్ మీద పదేళ్ళు హక్కు ఏ.పి. కి ఇచ్చింది. అరవై ఏళ్ల క్రితం కర్నూలు నుంచి హైదరాబాద్ రాజధాని మారేసరికి, అప్పటికే 1948 నాటి 'పోలీస్ యాక్షన్' తర్వాత భారత ప్రభుత్వం స్వాధీనంలోకి వచ్చిన నిజాం నిర్మించిన సువిశాలమైన భవనాలు అప్పటి రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల వసతికి అక్కడ సిద్ధంగా ఉన్నాయి. అప్పుడు అవి అలా ఆదుకున్నాయి. ఇప్పుడు అక్కడున్న తొమ్మిదేళ్ళ వెసులుబాటును వొద్దు అనుకుని, ముందస్తు ఏర్పాట్లు లేకుండా హైదరాబాద్‌ను వొదిలి పెట్టి బెజవాడ వచ్చేసాక, అది ఏ ప్రభుత్వానికి అయినా సమస్యే. ఇక్కడికి వచ్చాక, ఆరు నుంచి ఎనిమిది మాసాలు ఉండే బెజవాడ వేసవి ఉష్ణతాపం, హైదరాబాద్ నగరానికి భిన్నంగా ఇక్కడ ఉండే ఉక్కబోత కారణంగా, 'వర్క్ ప్లేస్' అనుకూలత వచ్చిన వెంటనే సిబ్బందికి తొలి అవరోధం అయింది. దానివల్ల పని నాణ్యతమీద ఉండే ప్రభావం పైకి కనిపించేది కాదు. సరే, కుటుంబ సమస్యలు ఎటూ వుంటాయి.

ఐదేళ్ళు అయ్యాక క్రమంగా ఇప్పుడిప్పుడే ఇక్కడి పరిస్థితులు చక్కబడుతున్నాయి. మనవంటి కొత్త రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఇల్లు చక్కబెట్టుకుంటున్న స్థితి. మరో రెండు రోజుల్లో కొత్త గవర్నర్ విజయ వాడ 'రాజ్ భవన్' లోకి రాకముందు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తరపున ఇచ్చిన వీడ్కోలు సభలో మునుపటి గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ మాట్లాడుతూ 'యు హేవ్ ఎక్వైర్డ్ న్యూ ఎంపైర్' (నువ్వు కొత్త రాజ్యాన్ని జయించావు) అన్నారు.


ఐదేళ్ళు అయ్యాక క్రమంగా ఇప్పుడిప్పుడే ఇక్కడి పరిస్థితులు చక్కబడుతున్నాయి. మనవంటి కొత్త రాష్ట్రప్రభుత్వం ఇంకా ఇల్లు చక్కబెట్టుకుంటున్న స్థితి. మరో రెండు రోజుల్లో కొత్త గవర్నర్ విజయవాడ 'రాజ్ భవన్' లోకి రాకముందు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తరపున ఇచ్చిన వీడ్కోలు సభలో మునుపటి గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ మాట్లాడుతూ 'యు హేవ్ ఎక్వైర్డ్ న్యూ ఎంపైర్' (నువ్వు కొత్త రాజ్యాన్ని జయించావు) అన్నారు. అవును ఐదేళ్ళ రాష్ట్రం, ఐదు వారాల ప్రభుత్వం. రెండోసారి అధికారం చేపట్టాక, ఇప్పటికే 'వంద రోజుల కార్యాచరణ' మోడీ ప్రభుత్వం ప్రకటించింది. నూతన ప్రాదేశిక ఏ.పి. రాష్ట్రానికి రెండవ ముఖ్య మంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి 13 జిల్లాల రాష్ట్రాన్ని కొత్తగా 25 జిల్లాలు, 50 మున్సిపాలిటీలుగా మరింతగా చిన్న పరిపాలనా యూనిట్లుగా చేస్తూ పరిపాలనను 'మైక్రో' స్థాయికి అందించబోతు న్నారు. రేపు ఆగస్టు మూడున విజయవాడలో తన 85వ జన్మ దినం జరుపుకోనున్న రాష్ట్ర గవర్నర్ డా.బిశ్వ భూషణ్ హరిచందన్ అను భవం, సి.ఎం.జగన్ కార్యదక్షత కొత్తరాష్ట్రానికి మేలు చేయాలని ఆశిద్దాం.

'మహాభినిష్క్రమణం (రైతు కనుమరుగు)' పుస్తకావిష్కరణ.



ప్రముఖ కవి, రచయిత సడ్లపల్లె చిదంబరరెడ్డి రాసిన "మహాభినిష్క్ర మణం(రైతు కనుమరుగు)"అనే కవితా సంకలనం 14.07.2019 ఆదివారం హిందూపురంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో ఆవిష్కరింప బడింది. కేంద్ర సాహిత్య అకాడెమీ కౌన్సిల్ సభ్యులైన ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత ఐ.జి.షేక్ మహమ్మద్ ఇక్బాల్ విశిష్ట అతిథిగా హాజరై పుస్తకాన్ని నాలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖ కవులు, రచయితలు, సాహిత్య విమర్శకులు, రైతుల సమక్షంలో విడుదల చేశారు. అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లాశాఖ అధ్యక్షులు మల్లెల నరసిహ్మామూర్తి పుస్తకంలోని కవిత్వాన్ని సమీక్షించారు. పుస్తక రచయిత సడ్లపల్లె చిదంబరరెడ్డి కేవలం రాయలసీమ రైతు కుటుంబంలో పుట్టడమే కాకుండా సగం వయస్సుదాకా వ్యవసాయం చేయడము, సీమ రైతుల దయనీయ బతుకులను ఇప్పటికీ చూస్తూ ఉండడం వల్ల కళ్లకు కట్టినట్లు, హృదయం ద్రవించేలా రాశాడని....రైతు కనుమరుగు కావడమంటే సమాజానికి అరిష్టమని రైతుకంట కన్నీరు కార్చి వ్యవసాయాన్ని వదిలిన రోజు సమాజం మిగలదని ప్రభుత్వము సీమకు నీటిని, రైతుల జీవితాలకు భరోసాలు ఇచ్చి ఆదుకోవాలని పలువురు వక్తలు ఏక కంఠంతో నినదించారు.

చలసాని నరేంద్ర
9849569050



చిన్నారులపై అత్యాచారాలను మరణశిక్షలతో కట్టడి చేస్తారా?

చిన్నారులపై దేశంలో పెరుగుతున్న లైంగిక అత్యాచారాలు సహజంగానే తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వీటిని అరికట్టడం కోసం వ్యవస్థాపరంగా తీసుకోవలసిన చర్యల గురించి ఆలోచించకుండా, నేరవిచారణలో, సామాజిక జీవనంలో గల లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేయకుండా అటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారికి మరణశిక్ష విధిస్తూ చట్టసవరణ చేయడం ద్వారా ఇటువంటి రుగ్మతలను అరికట్టే మంత్రాన్ని మన పాలకులు కనుగొన్నారు.

సరిగ్గా ఏడేళ్ల క్రితం ఢిల్లీలో 'నిర్భయ్' దుర్ఘటన జరిగిన సమయంలో కూడా పాలకులు, ప్రజలు ఇదే విధంగా ఆవేశం ప్రదర్శించారు. ఈ సందర్భంగా లోతయిన అధ్యయనం జరిపి జస్టిస్ జె ఎస్ వర్మ కమీషన్ చేసిన సిఫార్సులను అమలు జరపడం పట్ల ఆసక్తి చూపకుండా 'నిర్భయ్ నిధి' ఏర్పాటు చేసి, శిక్షలను తీవ్రతరం చేసే ప్రయత్నం చేసినా చెప్పుకోదగిన ప్రయోజనం లేకపోయింది. ఇటువంటి దుర్ఘటనలు జరుగకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రభావం చూపలేక పోతున్నాయి.

చిన్నారులపై పెరిగిపోతున్న లైంగిక అఘాయిత్యాల కేసులను అడ్డుకోవడానికి, శిక్షల్ని పెంచడానికి, మరణశిక్షకు అవకాశం కల్పించే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును ఒక విధంగా ఇటువంటి దుర్ఘటనలు జరుపకుండా నిరోధించడానికి బ్రహ్మాస్త్రంగా కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లున్నది. చిన్నారులపై అశ్లీల చిత్రాల నిరోధానికి సంబంధించిన నిబంధనల్ని కూడా ఇందులో చేర్చారు.

ఇలాంటి నేరాలకు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు, జరిమానా కూడా విధించనున్నారు. పోక్సో చట్టం, 2012కు సవరణగా 'లైంగిక నేరాల నుంచి చిన్నారులకు సంరక్షణ (సవరణ) బిల్లు, 2019'ని కేంద్రమంత్రి స్మృతిఇరానీ పార్లమెంట్ లో ప్రవేశపెట్టారు.

మరణశిక్ష అనేది నేర నిరోధానికి ఉపయోగ పడటంలేదని, పైగా నేరమయ ప్రవృత్తిని కఠినతరం చేసేందుకు దోహద పడుతుందని ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఒక నాగరిక ప్రభుత్వం మరణశిక్ష విధించడం అత్యంత అమానుషమైన అంశం కాగలదు.

నేడు ప్రపంచం మరణశిక్షలు లేని వ్యవస్థవైపు ప్రయాణం చేస్తున్నది. ప్రపంచంలో 80 శాతంకు పైగా దేశాలలో చట్టాలలో మరణశిక్షలను రద్దు చేయడమో, చట్టాలలో ఉన్నప్పటికీ అమలు చేయక పోవడమే జరుగుతున్నది. భారత దేశంలో కూడా సుప్రీం కోర్ట్ అత్యంత అరుదైన సంఘటనలలో మాత్రమే మరణశిక్షను విధిస్తున్నది. మరణశిక్షను పూర్తిగా రద్దు చేయమని భారత లా కమీషన్ కూడా సిఫార్సు చేసింది.

మరణశిక్ష చట్టంలో ఉంటె నేర నిరూపణ కష్టం అయ్యే అవకాశం ఉంది. శిక్షనుండి తప్పించుకోవడం కోసం సాక్షులను, బాధితులను కూడా భౌతికంగా నిర్మూలించే ప్రయత్నం చేసే అవకాశం

ఉందని గుర్తించాలి.

అయితే బాలలు అత్యాచారాలకు గురికావడం దేశంలో తీవ్రంగా పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ సంవత్సరం మొదటి ఆరు నెలలో అటువంటి సంఘటనలు దేశంలో 24,212 జరిగాయి. వాస్తవానికి ప్రస్తుతం పార్లమెంట్ లో మరణశిక్ష విధిస్తూ ప్రవేశ పెట్టిన నరేంద్ర మోదీ ప్రభుత్వం గత పార్లమెంట్ లోనే ప్రవేశ పెట్టింది. అయితే బిల్ ఆమోదం పొందేసరికి పార్లమెంట్ గడువు తీరిపోయింది.

ప్రస్తుతం కేంద్రం తీసుకొచ్చిన సవరణ 21 రకాల లైంగిక నేరాలను పరిగణలోకి తీసుకొంటుంది. 10 నుండి 20 ఏళ్ళ వరకు ఉన్న గరిష్ట శిక్షను మరణ శిక్షకు పొడిగించారు. అయితే లోతయిన అధ్యయనం, ఆలోచనలు లేకుండా మరణశిక్షను గతంలో నాటి మంత్రి మనేక గాంధీ ఈ బిల్‌లో చేర్చిన్నట్లు కనిపిస్తున్నది. ఆమె హడావుడిగా ఈ బిల్ తీసుకొచ్చారు. ఢిల్లీ మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ స్వాతి మలివాల్ మరణశిక్షను గరిష్ట శిక్షగా చేయాలని డిమాండ్ చేయడంతో ఆమె ఒకవిధమైన ఆవేశపూర్వక వాతావరణంలో ఒప్పుకోవడం జరిగింది.

నేర విచారణలో, సామాజిక జీవనానికి సంబంధించిన అంశాలలో, మహిళల భద్రతకు సంబంధించి ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోకుండా కేవలం కఠిన శిక్షలను విధించడం ద్వారా నేరాలను అదుపు చేయడం సాధ్యం కాదని నిర్భయ్ విషయంలో వెల్లడైనది. పైగా అటువంటి నేరాల అదుపుకు అవసరమైన నిర్దుష్టమైన చర్యలు తీసుకోకుండా మరణ శిక్షను విధించడం వలన బాధితుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం లేకపోలేదు.

ఫిర్యాదు నమోదు చేయడానికి తిరస్కరించిన పోలీస్‌ను జైలుకు పంపించే నిబంధన నిర్భయ్ చట్టంలో ఉన్నప్పటికీ ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా ఒక్క పోలీస్ ను కూడా జైలుకు పంపిన సందర్భం లేకపోవడం గమనార్హం. దేశంలో నిత్యం వందలాదిమంది పేదలు, బడుగు వర్గాల ప్రజలు పలు సందర్భాలలో పోలీస్ స్టేషన్‌లకు ఫిర్యాదు చేయడానికి వెళ్లడం, వారు అవమానాలతో తిరిగి రావడం జరుగుతున్నది. పైగా అనేక సందర్భాలలో ప్రలోభాలకు లొంగి బాధితులపైననే కేసులు నమోదు చేయడం జరుగుతున్నది.

ఈ సంవత్సరం జనవరి నుండి జూన్ వరకు నమోదైన 24,212 బాలల అత్యాచారం కేసులలో ఇంకా 11,981 దర్యాప్తులో ఉండగా, కేవలం 12,231 కేసులలో మాత్రమే ఎఫ్ ఐ ఆర్ దాఖలు చేశారు. అంటే సుమారు సగం కేసులలో ఎఫ్ ఐ ఆర్ కూడా దాఖలు చేయలేదు. పోలీసులు ఏ విధంగా నిర్లక్ష్యం వహిస్తున్నారో సుప్రీం కోర్ట్ ముందు ప్రభుత్వం ఉంచిన ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. వీటిల్లో కేవలం 4 శాతం, అంటే 911 కేసులలో మాత్రమే కోర్ట్ లు శిక్షలు విధించాయి.

ఢిల్లీ పోలీస్ జరిపిన ఒక సమీక్ష సమావేశంలో రాత్రి సమయంలో బాధితులు వస్తే ఎఫ్ ఐ ఆర్ నమోదుకు స్టేషన్ అధిపతులు తిరస్కరిస్తున్నారని వెల్లడైనది. ఇటువంటి కేసుల నమోదు సమయంలో తగు సహకారం అందించడానికి కౌన్సిలర్లు పోలీస్ స్టేషన్ కు చేరుకోవడానికి వారికి అవసరమైన రవాణా ఏర్పాటు చేయాలని చట్టం చెబుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. రవాణా సదుపాయం కల్పించడానికి తగు వనరులు లేవని పోలీసులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఇతర చోట్ల కూడా పరిస్థితులు అంతకన్నా భిన్నంగా లేవు.

పోలీస్ స్టేషన్‌కు వస్తున్న కేసులు వాస్తవంగా జరుగుతున్న సంఘటనలతో పోల్చుకొంటే చాలా తక్కువ అని గమనించాలి. నమోదవుతున్న కొద్దిపాటి కేసుల పట్ల కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఉండటం గమనిస్తే సమస్య మౌలిక స్వభావాన్ని, వ్యవస్థాగత లోపాలను ప్రభుత్వం పట్టించుకోకుండా 'మరణశిక్ష' వంటి ఆకర్షణీయమైన నినాదాలవైపు చూస్తున్నట్లు స్పష్టం అవుతుంది.

నేర విచారణకు పోలీసుల కొరత కూడా ప్రధానంగా ఉంది. పైగల మన పోలీసులతో మహిళల సంఖ్య 7 నుండి 8 శాతంకు మించి లేదు. దానితో సున్నిత స్వభావం గల ఇటువంటి కేసుల విచారణలో తగు జాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉండటం లేదు.

అత్యాచారం కేసులు నమోదైన పలు సందర్భాలలో బాధితులు ఆత్మహత్యలకు పాల్పడటం జరుగుతున్నది. నిందితులు బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత బెదిరింపులకు దిగడంతోనే ఈ విధంగా జరగుతున్నది.

చట్టం ప్రకారం 16 లేదా 17 సంవత్సరాల వయస్సుగల బాలికలు ఇష్ట ప్రకారం లైంగిక చర్యకు పాలపడినా అత్యాచారంగానే పరిగణించవలసి వస్తున్నది. అటువంటి కేసులలో జైలు శిక్ష గాని, మరణ శిక్ష గాని విధిస్తే సమాజంలో అశాంతికి దారితీసే అవకాశం లేకపోలేదు. నేడు చిన్న పిల్లలు మొబైల్స్ ద్వారా విచిత్రమైన సమాజం అందుబాటులోకి వస్తున్నది. సినిమాలు, టివి కార్యక్రమాలు వారిలో రకరకాలైన వికారాలు కలిగిస్తున్నాయి. అటువంటి బాలలు ఉద్రేకంలో లైంగిక చర్యల పట్ల ఆసక్తి చూపితే అత్యాచారంగా పరిగణించడం ఎటువంటి సామాజిక అశాంతికి దారితీసుంతో ఆలోచించవలసి ఉంది.


ప్రపంచంలో ఎక్కడా కూడా మరణశిక్షను రద్దు చేయడం వల్లన నేరాల సంఖ్య పెరిగిన్నట్లు గాని, మరణశిక్షను విధించడం వల్ల నేరాలను అదుపుచేసిన్నట్లు గాని ఎటువంటి అధ్యయనం వెల్లడి చేయలేదు. ప్రభుత్వాలు తమ వైఫల్యాల నుండి ప్రజలు దృష్టి మళ్లించడానికి మాత్రమే మరణ శిక్ష ఉపయోగపడుతుందని అర్థం చేసుకోవాలి.

పైగా మరణశిక్షలు గురవుతున్నది అత్యధికంగా బలహీన వర్గాలు, పేదలు, భారీ వ్యయం భరించి పోలీస్, న్యాయ, ప్రభుత్వ వ్యవస్థలను ప్రభావితం చేయలేని వారే కావడం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సంపన్నులు 'ఖరీదైన' న్యాయవాదులను నియమించుకొని శిక్షల నుండి తప్పించుకో గలుగుతున్నారు. బాలలు ఎదుర్కొంటున్న లైంగిక అత్యాచారాలను కట్టడి చేయడానికి మరణశిక్ష ఏమాత్రం దోహదపడదని గుర్తించాలి.

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పే

సన్నిధానం నరసింహశర్మ
9292055531

యువతరానికి స్ఫూర్తి శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ



అనుభూతి కవి బృంద బృందావనంలో శిలామురళిని చేత బట్టి, కనిపించే ; కవిత్వాన్ని వినిపించే ఓ రసజ్ఞ శక్తి పేరు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ.

మేఘూన్నైనా, మాఘూన్నైనా లోతులు తరస్తూ అధ్యయనం చేసిన అధ్యయన శీలి. ప్రాచీన ఆధునిక కవిత్వ ప్రచారం అలవోకగా చేసే నైజం ఆయనది. బహు సందర్భ సంభాషణా చమత్కారి. దేవుడి పటానికి అగరు పుల్లలు వెలిగిస్తే దేవుడుంటే మన ఎక్కౌంటులో పుణ్యం వస్తుంది. దేవుడు లేకపోతే అగరవత్తుల పరిమళాలు మనకే అన్న వ్యక్తి ఆయన.

అస్పష్టత లేని వచన కవిత్వమాయనది. జీవితాన్ని ఆనందంతో మలచుకోవడంలో సాహిత్యం, కవిత్వం – వీటిని రక్త పుష్టిగా మార్చు కోవచ్చని నిరూపించుకున్న జీవన విలాసుడు. తండ్రి హనుమచ్ఛాస్త్రి గారి రసజ్ఞతత్త్వ వారసత్వానికి ప్రతినిధి. కృష్ణశాస్త్రి, శ్రీపాద, చలం శక్తుల శిరోధారి. స్నేహ బృందాన్ని బంధుబృందంగా చేసుకొనే ఆకర్షణయంత్రమాయన. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలోగాని, ఆంధ్రజ్యోతి వార పత్రికలోగాని ఎక్కడైనా జాబ్‌గా గాక 'ఉద్యోగం' గా భావించి పదిమందికి ప్రోత్సాహ బలాన్నిచ్చిన గుణవంతుడు.

ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఆయన పనిచేసినప్పుడు ఎందరో ఔత్సాహిక కథా రచయితలు – ఆయన టీకి అని బయటికి వస్తే చాలు ఆ కొంచెం సేపటిలోనే తమ కథా విషయాలు చెప్పి ఆకట్టుకోవడానికి చూచేవారుట. వారు తాము తమ కథల్ని పరిచయం చేసుకొనే ఉబలాటాలలో ఎలా వుండేవారో శర్మగారు చెబుతూంటే బలేగా ఉండేది.

ఒకడువచ్చి కొంచెం వినండి అంటూ 'సుబ్బారావు ఆత్మహత్య చేసుకోవడానికి అతని అప్పులు మాత్రమే కారణం కావు' అంటూ కొంత వినిపిస్తే; మరొకడెవరో వచ్చి "వెంకటరావు విడాకులిచ్చిన వెంటనే భార్య చనిపోవడానికి గల కారణాలు వూహించడం కష్టం' అని చెప్పేవాడట.

'మహాలక్ష్మికి మూడు చోట్ల పుట్టుమచ్చలున్నాయి. అలా వుంటే ఫలితాలు ఏమిటని అడగడానికి వీధిలో ఉన్న జ్యోతిష్కుని ఇంటికి వెడితే – ఆయన భార్య విషాదవదనంతో మా ఆయన పోయి ఈ వాల్టికి మూడో రోజందిట" – ఇలా ఇలా ఏవో ప్రారంభాలు, కథల ముగింపులు, ఒక్కొకప్పుడు సారాంశాలు చెప్పి తమ కథలు ప్రచురింపబడాలని ఉత్సాహాలు ప్రకటించే వారి కథనాలు శ్రీకాంశశర్మగారు చెబుతూంటే ఇంకా ఇంకా వినాలనిపించేది.

గోదారి మీద ప్రయాణం ఎవరికిష్టం కాదు. ఆయనకి మరీ ఇష్టం. కొవ్వూరు నుండి గోదారిపై లాంచీ ప్రయాణం చేసి రాజమండ్రి విచ్చేసేటప్పటికల్లా – స్నేహ బృందం ఎదురు చూసేది. మార్కండే యేశ్వర స్వామి ఆలయం ఇవతలగా భవనం వేరుగా వో భవనం అని వుండేది. దాంట్లో ఆయన ఒక్కొక్కప్పుడుండేవారు. బి.వి.యస్. శాస్త్రి, పి.వి.యస్. శాస్త్రి, వంకా బాలసుబ్రహ్మం, గదా ధర్ వంటి సాహితీ మిత్రులు ఆయన రాకకు ఎదురు చూసేవారు. పద్యాలు, పాటలు, గేయాలు సాహిత్యపు సందడి!

ఓసారి గౌతమీ గ్రంథాలయం పై ఓ రేడియో కార్యక్రమం చేయడానికి శ్రీకాంతశర్మ వచ్చారు. గ్రంథాలయం కమిటీ పెద్దలు నా చేత రాయించుకున్న కాగితాలు చదివారు. అయితే నాకు మాత్రం గౌతమిపై మాట్లాడడానికి అవకాశం ఇవ్వలేదు. కమిటీ పెద్దలు వెళ్ళిపోయాక శర్మగారు ఇప్పుడు గౌతమీని చూపిస్తున్నట్లు నాన్న మాట్లాడమన్నారు. నేను వివరంగా మాట్లాడాను.

నాదే ఎక్కువ ప్రసారం చేసి కమిటీ పెద్దలది చాలా మట్టుకు కత్తిరింపులకు గురి చేశారు. గోదావరి గట్టుపై కూర్చుని అక్కడికక్కడే 'గోదావరి ప్రతి కెరటం ఏదో కథ చెబుతుందట' అనే పాట రాసి గౌతమీ గ్రంథాలయ కార్యక్రమానికి వినియోగించుకున్నారు.

ఓ సారి గుంటూరులో ఆహూతుల సమీక్షంలో విజయవాడ ఆకాశవాణి కేంద్రం కవి సమ్మేళనం చేశారు. హేమాహేమీలు పాల్గొన్నారు. నాకు ఓమహదావకాశంగా అందులో పాల్గొనమని పిలుపు వచ్చింది. పాల్గొన్నారు.

అప్పటి నా పద్యాలలో–'బ్యాంకులని కాదు కొందరికింకను హృదయముల సేయ వలెను జాతీయములుగ' అని రాసిన వాక్యాలను ఆంధ్రజ్యోతిలో తమ సమీక్షలో శ్రీకాంత శర్మ ఉటంకించారు. సరైన కవిత్వాన్ని అనుభవించడంలో పదిమందికీ ప్రోత్సాహమందించడంలో జీవితాన్ని రసవన్మార్గంలో మలచుకోవడంలో యువతరానికి సాహితీ స్ఫూర్తి శ్రీ శ్రీకాంతశర్మ. ఆయన అర్ధాంగి శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల మంచి రచయిత్రి కావడం ఆనందకరం. కాల ధర్మమైనా ఆయన మృతి విచారకరమే.

ధారావాహిక

నంద్యాల నారాయణ రెడ్డి
9360514800

సొతంత్రకాల సదువులు 3

పెరిగిన [redacted]

మా జట్టంతా ఈ ఏడాది (1951) నాలుగో తరగతిని దాటేసి ఐదో తరగతికి వచ్చేస్తిమి. ఊరంతా మాకు ఒక తరా మర్యాద ఇస్తా వుండారు. “ఐదో తరగతంట, ఇంత సదివితే సాలంట, కాగితాలూ పత్రాలూ సదివేస్తారంట, రాసేస్తారంట” అనుకొంటుం డారు. “కొత్త పుస్తకాలు, పెద్దపెద్ద పుస్తకాలు, మోసేకి ఇంక మీట పెద్ద బ్యాగుల్ని తెచ్చీయండ. కొత్త బట్టల్ని తెచ్చి, బనీన్లూ కాకీ సద్దీలూ కూరిపించి ఇయ్యండప్పా మీ సిన్నోళ్లకి” అని మేస్టరు మా పెద్దోళ్లకి చెప్తా ఉండారు.

మాకంతా మంచి మంచి కొత్త బట్టలు కుట్టించేసిరి. ఇంత వరకూ మా చడ్డీలకు లాడీలు ఉండ్లేదు. మొలతాడుకు చుట్టా చిక్కించే చడ్డీలే. ఇపుడు లాడీ చడ్డీలూ గీతల గీతల చొగాయిలు. మా జతలో ఐదో తరగతికి వచ్చిన ఆడబిడ్డ మల్లి ఒకతే. ఆ బిడ్డకూ పువ్వుల గౌన్లూ లంగాలూ తీసిచ్చిరి. ఆ దిరుసుల్నంతా బో సంతోషంగా చూసుకొని చూసుకొని ఉబ్బిపోతా ఉండాము.

“చద్దీ ఎనుము పెరుగులు జాస్తిగా పెట్టొద్దు, పొద్దున్నే ముందుగా లేపి సదివిపీయండ. రెయ్యిపూట బాగా సదవమనండ” ఇట్ల ఎన్నెన్నో చెప్తా ఉండారు మా పెద్దోళ్లకి మేస్టరు. కద్దెనక కద్దీ, ఎద్దునోటికి జొన్నకడ్డి పెట్టినట్లాయె వాళ్లకు.

మా ఐదో తరగతి పొత్తాలు వచ్చేసె. కొత్తగా నున్నగా మినమిన మెరస్తా ఉండాయి. ఒక మాదిర గములు (సువాసన) కొడతా ఉండాయి. లోపల పేజీపేజీకి ఉండే బొమ్మలు ఇంకా చూడలనిపిస్తా ఉండాయి. మందమైన వన్నెవన్నెల అట్టలైతే ఎంతో బాగుండాయి. అవి మాసిపోకుండా మందమైన రొట్టులు వేసిచ్చిరి మేస్టరు.

తెలుగు వాచకము, హిందూదేశ చరిత్ర, గణితము, ఒక్కొట్ల (ఎక్కాల) పొత్తాలతో పాటు, ఇంకొకొక వెడల్పైన పొత్తాన్ని ఇచ్చి ఉండిరి. దానిపేరు భూగోళము, విజ్ఞానశాస్త్రము. ఇది అన్నిటికంటే పెద్దది. మొదటి పేజీలో హిందూదేశపటం అనే బొమ్మ ఉండాది. దాంట్లో పశ్చిమ పంజాబు, బర్మాదేశము, కాశ్మీరము, కన్యాకుమారి ఎల్లలుగా ఉండాయి. సింధు, బ్రహ్మపుత్ర, గంగ, గోదావరి, నర్మద, తపతి, కృష్ణ, పెన్న, కావేరి, వైగా నదుల గీతలు ఉండాయి. ఇంకొక పేజీలో నాలుగైదు రాజ్యాల పేర్లనూ డిల్లీ, కలకత్తా, బొంబాయి, మద్రాసు వంటి పెద్దపెద్ద నగరాల వివరాలనూ ఇచ్చి ఉండారు. ఇవన్నీ బాగా గుర్తు పెట్టుకొని, పెద్ద పరీక్షలో దేశపటంలో గుర్తించాలంట.

రాసేదంతా నోట పొత్తాల్లోనే రాయాల్నంట. హెచ్‌బి పెనసళ్లు మంచివని చెప్తే అవ్వాటినే తెచ్చిచ్చిరి. రాతలు తప్పయితే చెడిపేకి రబ్బర్లనూ తెచ్చిచ్చిరి. ‘పెనసళ్లను కొడవళ్లతో జీకద్దు, చిన్న చాకుతో మెల్లిగా ముక్కు విరక్కుండా జీక్కోవాల’ అని మేస్టరు జీకి చూపించిరి. తలలపైన ఎర్రటోపీల మాదిరి రబ్బర్లుండే పెనసళ్లు కూడా అనెంక వచ్చేసె. పెద్దబ్యాగు నిండా పుస్తకాలు, మద్దెనము ఇస్కూలుకీ ఇంటికీ తిరుగులాడకుండా తినేకి రెండో మూడో రాగి రొట్టెలూ రోటికారమూ ఊరగాయా కట్టిన చద్దిమూట, పలకా బలపమూ. పొద్దిన్నే సంగటో అన్నమో తినేసి బయలుదేరితే, ఇంక ఇంటికి చేరేది మాపుసరే. ఇస్కూల్లో మేస్టరు డిక్టేషను చెప్పినప్పుడు పలకలో రాసి చూపిస్తాం. ఇంకో డిక్టేషను చెప్పినపుడు మొదటిదానిని చెడిపేసి రెండోదానిని రాస్తాము. పలకా బలపాలు దీనికోసం మాత్రమే వాడతా ఉండాము. బ్యాగుల బరువూ చదువుల బరువూ జాస్తి అవతా ఉంటే, ఎగుర్లాటలూ దుముకులాటలూ కోతి కొంటె ఆటలూ తక్కువవతా ఉండాయి.

ఐదు తరగతుల చిన్నోళ్లకీ పాఠాలు చెప్పేది ఒక మేస్టరుకి చానా గాసి (శ్రమ). అందుకనే ఆయన ఒక ఏర్పాటు చేసిరి. ఐదో తరగతికి చెప్పేటపుడు నాలుగో తరగతి వాళ్లు, నాలుగో తరగతికి చెప్పేటపుడు ఐదో తరగతి వాళ్లు, కింది తరగతుల వాళ్లకి రవంత సేపు పాఠాలు చెప్పాల. అది మాకు కూడా మంచిదే అయింది. కింది తరగతి పాఠాలను మరిచిపోకుండా గుర్తు చేసుకొన్నట్లు ఉండాది.

రేణి మింగడుల చదువు :

మూడో తరగతిలో మింగడు రేణి అని ఇద్దరు అన్నా చెల్లెళ్లు ఉండారు. వాళ్లకు చదువు చెప్పేది ఆ బ్రహ్మదేవుని తరం కూడా కాదేమో! వీళ్లిద్దరికీ మూడేండ్లు చదివినా ఇంకా అచ్చులూ హల్లులూ గుణింతాలే సరిగా రాలేదు. నేర్పింది నేర్చినట్లు అపుటికపుడే మర్చిపోతారు. నోర్లు కూడా సరిగా తిరిగేది లేదు. వీళ్ల నాలికలు మందమని మేస్టరు చెప్తా ఉంటారు. రేణి, రకారాన్ని య అనీ, ణ కారాన్ని న అనీ పలుకుతాది. ఎంతసేపు నోరు కొట్టుకొన్నా బిరీన మాట్లాడదు. ‘చెవిటివా మూగవా’ అని కిర్లు (అరుసు)తుంటారు మేస్టరు. ‘నీ పేరేమి, అదయినా చెప్పు’ అని గదిరితే ఎప్పుడో నోరిప్పి ‘యేనమ్మ’ అంటుంది. ఇంక మింగడు ఉన్నాడే వానికన్నా రేణే మేలు. వీనిపేరు మునిగాడు. పేరడగితే నీళ్లు నములుతా ‘మింగ’ అంటాడు. అదే వాని పేరయిపోయింది. ఇద్దరికీ కోసినా అక్షరం ముక్క రాదు. వాళ్ల పెద్దోళ్లకేమో బిడ్డల్ని చదివించాలని ఆశ. ‘ఏం



చేసేది, వీళ్లతో ఎట్ల వేగేది?' అని తల కొట్టుకొంటా, వాళ్లని మాకు తగలబెట్టి వేరే తరగతి పక్కకు పోతుంటారు మేస్టరు. మేము నోరు కొట్టుకొన్నా అంతే.

అప్పుడప్పుడు మా ఇస్కూలుకు పెద్దసార్ ఒకాయన వస్తుంటారు. ఆయన్ని ఇన్స్‌పెక్టర్ అంటారంట. ఆయనొస్తే మాకు చానా దిగులు. మాకే కాదు మా మేస్టరుకు కూడా రవంత దిగులే. ఆయన వస్తానే అందరమూ లేచి నిలబడతాము. పెద్ద తరగతుల వాళ్లమంతా ముందుగా చేతుల్ని జోడించి 'నమస్కారమండీ' అనాల. అనెంక చిన్న తరగతుల వాళ్లు. నోరు తిరగదు కాబట్టి 'దండాలండీ' అంటారు. ఇదంతా మా మేస్టరే చెప్పించిరి.

పెద్దసారు మమ్మల్ని ప్రశ్నలు అడిగితే తప్పులేకుండా జవాబులు చెప్పాల. డిక్టేషను చెప్పినా తప్పుల్లేకుండా గుండ్రంగా రాయాల. పద్యాలు అడిగితే చేతులు కట్టుకొని గడగడమని చెప్పాల. మేము జవాబులు చెప్పకపోయినా, తప్పులు చెప్పినా ఆ పెద్దసారు మా మేస్టరును చిన్నగా ఏమో అనేవారు.

ఒకనాడు పెద్దసారు రానేవచ్చె. పెద్ద తరగతోళ్లనంతా ప్రశ్నలడిగి, డిక్టేషను రాపించె. ఇద్దరు ముగ్గురు తప్పులు చెప్పిరి. ఫెయిల్ చేసేస్తాననీ ఇంకా బాగా చదవండనీ గట్టిగా చెప్పిరి. అనెంక మూడో తరగతి వాళ్లని పిలిచిరి. అందరూ పరవాలేదు కానీ రేణీ మింగుడులు తగులుకొనేసిరి. ఎంతకూ నోరిప్పరు. ఆ ఇద్దరి గురించి పెద్దసారుకు వివరించి చెప్పి తలవంచుకొనిరి మా మేస్టరు.

మరుసనాడు మూడో తరగతికి పాఠం చెప్పేటపుడు మేస్టరుకు తలనొప్పి వచ్చి "రేయ్ మింగా, మీ యబ్బ గొర్రెల్నమ్మేకి శనారం సంతకు పోతాడు కదా, అపుడు నువ్వూ గొర్రెల్ని తోలేకి కూడా పోతావు కదా, ఈ రేణినీ తోడుకొని పోయి, గొర్రెలతో పాటు అమ్మేసి వచ్చెయిరా" అన్నారు. ఇంకొక శుక్రవారం నాడు తిరిగి మింగడికి ఇదే మాటను చెప్పి "రేయ్ రేపు సంతలో దీన్ని అమ్మకుండా వస్తివంటే నీ తోలు ఒలుస్తానురా" అనె. మేమందరము కూడా గేలిచేస్తిమి. అంతే, ఆ మీట సోమవారం మింగడు ఇస్కూలికి రానేలేదు. గొర్రెల్ని మేపేకి పొయ్యేసినాడంట. రేణి ఒకతే వచ్చింది. పాఠం చెప్పేనపుడు "మింగడెక్కడే" అని అడిగినారు మేస్టరు. రేణి సామాన్యంగా మాట్లాడుతుందా, ఇచ్చే మామూలు ఇస్తేనే అన్నట్లు నిలబడింది. కోపమొచ్చి పిర్రమీద అంటించిరి మేస్టరు. "సంతకు పోతిమి సా" అనింది ఏడస్తా. "వాడు నిన్ను అమ్మలేదా చెప్పు" అంటా బెత్తం తీసిరి. "సా సా నేనే వాన్ని అమ్మేస్తిని సా" అనింది. "ఎంతకీ" "ఒక యూపాయికి అమ్మేసి బోందాలు తీసి తినేస్తిని సా" అనింది. మేస్టరు తల కొట్టుకొంటా ఉంటే మేము నవ్వినవ్వి అలసి పోతిమి. మేస్టరు కన్నా ముందు వాళ్లిద్దరే రిటైరయిపోయిరి.

పంచాయితి ఇస్కూలును దాటేస్తిమి :

లెక్కల్లో మాకు ఇంతకంటా కోటి వరకూ సంఖ్యలూ ఐదు వరకూ ఒక్కట్లూ చిన్నచిన్న సంఖ్యల్లో కూడికలూ తీసివేతలూ గుణకారాలూ నేర్పిండిరి మేస్టరు. ఇపుడు మేము పెద్ద తరగతి కదా, దానికని పెద్దపెద్ద సంఖ్యల్లో ఇవన్నీ నేర్పేకి సురువు చేసిరి. చరిత్రా భూగోళమూ పాఠాలను తక్కువచేసి, రెండు మూడు నెలలు లెక్కలే

లెక్కలు. ఒకనాడు పెద్ద సారొచ్చి మాకు పరీక్షలు పెట్టి, మా పాఠాలను ఒప్పించుకొని, తృప్తిగా తలనాడించి, లెక్కల్లో భాగాహారాలు నేర్పమని చెప్పేసి పోయిరి. అపుటినింకా మాకు భాగాహార లెక్కలూ నేర్పతా ఉండారు మేస్టరు. మొదలు పలకమీద పెద్ద గుణకారాలూ భాగాహారాలూ వేస్తా, బాగా అర్తమయినంక నోటు పొత్తాల్లో వేస్తా ఉండాము.

తెలుగు వారాలూ నెలలూ, ఇంగ్లీషు వారాలూ నెలలూ, తెలుగు పద్యాలూ అర్తాలూ తాత్పర్యాలూ, తులములు పలములు సేర్లు వీసెలు మణుగులు అడుగులు గజాలు ఫర్లాంగులు మైళ్లు వంటి కొలత లెక్కలూ, పైసాలు అణాలు రూపాయిలు వంటి కాసుల లెక్కలు అన్నీ తెలుసుకొంటా ఉండాము.

ఆరు నెలల పరీక్షల్లో అన్ని పాఠాల్లోనూ మంచి మార్కుల్ని తీసేస్తిమి. "పరవాలేదప్పా మీ సిన్నోళ్లు, మన పంచాయితి ఇస్కూల్ని దాటేనట్ల ఉండారు, ఇంటి పనులు చెప్పకుండా బాగా చదువుమని చెప్పండ" అని మా పెద్దోళ్లకి చెప్పిరి మేస్టరు.

"అయ్యో ఇపుడు మాత్రము వాళ్లకి మేము పని సెప్తా ఉండామా, దొంగనాయాళ్లు, రవంత ఏమారితే ఆటలకు పోయేస్తారు. మీరే రవంత దిగులు పెట్టాల" అనిరి మా పెద్దోళ్లు.

"వింటిరేమిరా, ఇంకమీట ఆటలు నిలిపి పాఠాల్ని బాగా చదివి ఒప్పించకుంటే పక్కలిరగకొడతా బాదుకోల్లారా" అని మాకు దిగులు పెట్టిరి మేస్టరు. ఆటల్నంతా విడిచిపెట్టి పాఠాలూ లెక్కలపని పడితిమి. పెద్ద పరీక్షలు వచ్చె.

"మీ నోటు పుస్తకాల్లోని కాలీ తెల్ల కాగితాలను చించుకొని, ఒత్తుకి అట్ట, పెన్సిలూ రబ్బరూ మాత్రము ఎత్తుకొని పరీక్షకు రావాలరా" అని మేస్టరు చెప్పిండె. దినానికి ఒక పరీక్ష. అట్లే అన్ని పరీక్షల్నీ రాసేస్తిమి. అనెంక ఒకవారం ఇస్కూలు నడిచె. కడసీనాడు గురుదక్షిణగా రాగులు, వడ్లు, ఉలవలు, అనుములు, కాయగూరలు, రవంత దుడ్లు ఎత్తుకొని పోయి మేస్టరుకు ఇచ్చి, ఆయన పాదాలకు మొక్కితిమి.

"లెయ్యంగ్రా, ఇంక ఈ ఇస్కూల్లో మీ చదువులు ముగిసె. ఈ వేసగి బిడువులు అయినంక, హోసూరులోని బోర్డు హైస్కూల్లో చేరాల. అక్కడ కూడా బాగా చదువుకొని మనూరికి మంచిపేరు తీసుకొని రావాల" అని కండ్లు ఒత్తుకొంటా మాతో అని "చిన్నోళ్లని చదువు నిలపదప్పా, పై చదువులకి పేటకి పంపండ" అని పెద్దోళ్లతో చెప్పిరి మేస్టరు. మేస్టరు కండ్లు ఒత్తుకొనేది చూసి మాకూ మనసు బేజారాయె. పంచాయితీ ఇస్కూళ్లకి రజా (సెలవు)లు వచ్చెసె. మేము రాజాలు అయిపోతిమి.

సారంగధర కేళిక :

మా వూర్లో పెద్దోళ్లూ మైనర్లూ కొందరు చేరి, సారంగధర కేళికను నేరుస్తా ఉండారు. కథను బాగా నేర్చిన గురువు చానా పగదస్తుగా (ఎచ్చరికగా) నేర్పిస్తుండారు. గురువు దగ్గర ఆ కేళిక (వీధి భాగవతం) రాత ప్రతి ఉండాది. అది వాళ్ల తాతలకాలం నాటిదంట. దానిని ఆయన జోపానంగా (భద్రంగా) చూసుకొంటా ఉంటాడు. రాజరాజనరేంద్రుడు, అతని ఇద్దరు పెండ్లాలు రత్నాంగీ చిత్రాంగి, కొడుకు సారంగధరుడు, మంత్రి, రాజరాజనరేంద్రుడు, ఒక రుషి, సారంగధరుని జతగాళ్లు నలుగురు, ఇట్ల కేళికలోని అన్ని పాత్రలకూ తగిన వాళ్లని ఎన్నుకొని, వాళ్లకు నేర్పుతా ఉండాడు.

కేళికల గురువుకు ఒక సంకటమొచ్చె. నేర్చేవాళ్లంతా అర్ధరకల చదువువాళ్లు. కేళికలోని పద్యాలూ రాగాలూ దరువులూ వచనాలూ వాళ్లకు నోళ్లు తిరగక అవస్తలు పడతా ఉండారు. మాటిమాటికీ రాత ప్రతిని తిరగేసి మరగేసి చూసి చూసి అది చినిగిపోయే దశకు వచ్చేసింది. ఆ గురువు యోచన చేసి, మా అట్లా చదువు తెలిసిన చిన్నోళ్లను పిలిపించుకొనిరి. నేనూ నా జతగాళ్లూ పోతిమి. మాకు కూడా ఒద్దిక (రిహార్సల్) చూడాలని కోరిక ఉండె.

అక్కడ మా పని ఏమంటే, వేరువేరుగా ఆయా పాత్రధారులకు వాళ్ల వాళ్ల పద్యాలనూ వచనాలనూ రాసియ్యాల. వాటిని తప్పుల్లేకుండా పలికేనట్లు అలవరపు (శిక్షణ) ఇయ్యాల. మా సంతోషాన్ని చెప్పేకి కాదు. దినాము ఒద్దికకు పోయి వాళ్లకు నేర్పతా నేర్పతా అవన్నీ మాకే వచ్చేసె. ఆ పాత్రధారుల్లో కొందరు రానురాను ఒద్దికను విడిచి పెట్టేసిరి. ఆ పాత్రలకు మా జతగాళ్లయిన పుట్టిగాడు, రాంగ్స్వామి (రామస్వామి) తయారయిపోయిరి. మిగిలినోళ్లమంతా సారంగధరుని జతగాళ్ల పాత్రలకు కుదురుకొనేస్తిమి. రెయ్యిపూటే కాదు, పగలంతా కూడా ఆవుల్ని మేపే బీళ్లలో ఒద్దికలు పెట్టుకొని బెమ (ఆశ) తీరా కిర్లేదే మా పని.

రెయ్యి భజన మందిరంలో ఒద్దిక నడుస్తుంది. ఆర్మని, తబలా, ముకవేణి వాద్యాల జతలో మా గొంతులు కంగుమంటాయి. మేము కిర్లు (కెరలు) తా కిర్లుతా, గురువు దిద్దుతా దిద్దుతా బాగానే కుదిరి పోతిమి. ముకవేణి వాద్యానికి ఒళ్లు మరచిపోతాము. నరనాడుల్నే కదిలించేసే వాద్యమది. ఆ కేళికలో ఒక సన్నివేశము వస్తుంది. సారంగధరుడు విడిచిన పావురము పోయి చిత్రాంగి చేతికి చిక్కుతుంది. సారంగధరుడు చిత్రాంగి ఆశను నిరాశ చేస్తాడు. అపుడు చిత్రాంగి పగబట్టి, సారంగధరుని కాళ్లూ చేతులూ నరికేయించేస్తుంది. ఆ సన్నివేశములో ఒక పద్యం ఉంటుంది. 'పారావతములాట పనిబూని నేడెలమినాడెదు బుద్ధి ఏల కలిగె' అనే పద్యాన్ని ముకవేణి జతలో ఏడుపురాగంలో పాడతా ఉంటే ఒద్దికను చేసేకి వచ్చినవాళ్లంతా ఏడిచేదే.

ఒద్దికలో మాపని అంత సులువయినది కాదు. మినుకుమినుకు మనే కానగనూనె దీపాల వెలుగులో పద్యాలనూ వచనాలనూ చూసు కొంటూ చదువుకొంటూ అందియ్యాల. పేటలో ఉన్నెట్లు మా వూర్లో కరంటు దీపాలు లేవు. నాలుగయిదు నెలలకు ముందర్నే, వీధివీధికీ రెండు రెండు లెక్కన రాతి కంబాలను నిలిపి, పై కొనకు లాంపులు బిగించి, గ్లాసులతో సీలు చేసిరి. దినమూ మాపుసరి అయితే, ఆ లాంపులకు సీమనూనె (కిరోసిన్) పోసి వెలిగిస్తారు. అదే పెద్ద వెలుగు మాకు. ఏలంటే మా ఇండ్లల్లో అంతా కానుగనూనె దీపాలే. అరచెయ్యి వెలుపుండే మూకుడులో కానుగనూనె పోసి వత్తిని వేసి వెలిగించేవారు. ఆ మినుకు బొంచెలు మినుకు మినుకుమని వెలుగుతాయి.

మా రాజ్యమంతా కానుగ మాన్లు విపరీతంగా ఉంటాయి. ఆ కాయల్ని ఉదిరించి (రాల్చి), ఎండించి, విత్తుల్ని విడిపించి, గానిగలో తిప్పి నూనెను వాడుతారు. ఆముదాలు కూడా బాగా

కవిత

నిజంగా చనిపోయాడు

బతికున్నందుకు
కొంచెం సేపు గిల్టీగా వుంటుంది,
వేళగాని వేళ పోయాడు
అతని మీద కాస్త చిరాకు కలుగుతుంది.

పూలదుకాణాలు తియ్యరు
పుష్ప వలయాలు ఎక్కడా దొరకవు
బేరం వల్ల ఇంకాస్త లేటవుతుంది,
ఒకామె
క్యాబ్ కోసం ఎంత కష్టమైందో
గలగలా మాట్లాడుతుంది.

బతికున్నప్పుడు
ఒక చిరునవ్వైనా కలపని వాళ్లు
ఇప్పుడతన్ని పువ్వులతో
శ్రద్ధగా అలంకరిస్తున్నారు.

ప్రాణం పోగానే
కళ్లు మూసేశారు
ఆ చూపులు గుచ్చుకొని
వెంటాడుతాయని కాబోలు!

ఓ సహోద్యోగి కళ్లు
ధారాపాతంగా వర్షిస్తున్నాయి
అతని ఖాళీలో
ప్రమోషన్ వస్తుందనే
కులాసా భాష్పాలు కూడా వాటిలో ఉండొచ్చు

శవం ముందు ఓ క్షణం
మౌనాభినయ విన్యాసాలు,
మీడియా ముందున్నా
అబద్ధాలు వద్దనుకోరు,
అసలందుకే వచ్చినట్టుంటారు.

బతికున్నప్పుడు
మనకు ఏ ఉపకారమూ చెయ్యలేదు
ఇప్పుడీ చావు
మనకేమన్నా పనికొస్తుందేమో చూడాలి.
ఎన్నడూ దొరకని
విఐపీ లన్నా కలుస్తారేమో!

కాలం ఆగిపోదు
గడియారం లంచ్‌కు పిలుస్తుంది.
అతడు మంచి ఆర్గనైజర్
చచ్చాక కూడా
ఎంతో మందిని రప్పించుకున్నాడు

పాపం! తెల్లారగట్ల
అతడు వ్యక్తిగతంగా
హాయిగా చనిపోయాడు.
ఇప్పుడు సందడి చేస్తూ
పూర్తిగా చంపేశారు

డా॥ ఎన్.గోపి
9391028496

పండుతాయి మా తావున. ఆముదాల్ని బాగా వేపి, దంచి, బానల్లో వేసి నీళ్లుపోసి ఉడికిస్తే, ఆ వేడినీళ్లలో ఆముదము తేలుతుంది. గుప్పెడు చిక్కొంటికలతోనో కోడీకలతోనో ఆ తేలాడే ఆముదాన్ని ఒత్తిఒత్తి పిందుకొంటారు. దానిని తిరిగి పొయ్యిమీద పెట్టి కాపితే, నీళ్లన్నీ ఇగిరిపోయి, గమ్మని గములు వస్తుంది. ఆ ఆముదాన్ని తలలకు పెట్టుకొంటాము. అపుడపుడూ ఒళ్లంతా కూడా పూసుకొని నీళ్లు పోసుకొంటాము. బేది మందుగా వాడుతాము. కొన్ని వంటలకూ చేర్చుకొంటాము. ఆముదము మాకు అమృతముతో సమానము. నూగుల్ని పండించి ఉంటాము కదా, ఆ నూగుల నూనెను తీసి వంటలకు ఎక్కువగా వాడుకొంటాము.

ఇంత గాసిపడి వేసగి బిడువుల్లో ఒద్దికలు చేస్తిమి. ఊరికి నడుమ నుండే గుడి బయల్లో ఒకనాటి రెయ్యి కేళికను ఆడితిమి. ఆడోళ్లూ మగోళ్లూ ముసిలోళ్లూ పసోళ్లూ ఊరంతా చాపలూ గోనెలూ పరుచుకొని బయలంతా నిండిపోయిరి. పేటకు పొయిన గురువు, పెట్రమాక్సు దీపాలూ వన్నె వన్నెల అద్దాల దిరుసులూ బొమ్మల పరదాలూ బాడుక్కి తెచ్చిరి. స్వర్గమో కైలాసమో వైకుంఠమో అన్నట్లుంది రంగస్థలము. ఆ నిరుసద్దు రెయ్యిలో పాత్రధారులు పద్యాలనూ వచనాలనూ కిర్లుతా ఉంటే పక్కూరికి వినిపించెనంట. ఊరంతా కంటిమీద కునుకేయకుండా పొద్దుపుట్టే వరకూ ఒళ్లు మరచి కేళికను చూసిరి. 'ఆహా ఆడిరిరా అగ్గురారం వాళ్లు కేళికను' అనిపించుకొంటిమి.

కేళిక ఆడిన రెండోనాడే గుడుగులు (ఉరుములు) లేకుండానే సిడి (పిడుగు) పడినట్లు ఆ వార్త మా ఊరికి చేరింది. మా ఇస్కూల్లో ఐదో తరగతి చదివిన ఆరుగురిలో నలుగురు పాసయిరంట. నలుగుర్లో నేనూ ఒకడిని.

(తరువాయి రాబోయే సంచికలో...)

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

పుస్తక సమీక్షలు


సవర పాటలు



సాటి సమాజం అంటరానివారుగా ముద్రవేసిన సవరజాతి పట్ల మమకారంతో కీ.శే. గిడుగు వెంకటరామమూర్తిగారు, ఆయన కుమారుడు గిడుగు వెంకట సీతాపతిగారు కలిసి, 1911 ప్రాంతంలో సవర గూడేల్లో బసచేసి, వారు పాడుకొంటున్న జోల పాటలు, ఇంట్లోని వస్తువులపై పాటలు, దంపుడు పాటలు, పక్షుల కూతలు, జంతువుల అరుపుల ఆధారంగా పాడే పాటలు, పిల్లల గారాము చేసేపుడు, అలిగినపుడు, కల్లు తాగినపుడు, తాగుబోతులను ఎగతాళి చేసేపుడు, అంకాలప్పుడు, ప్రేమలో పడ్డప్పుడు పాడే పాటలు, విరహపు పాటలు, బావల్ని మరదళ్లు ఆటపట్టించే పాటలు ఇలా ఎన్నో సందర్భాల్లో వారు పాడుకొనే పాటల్ని యథాతథంగా సేకరించి, 1938లో భారతి పత్రికలో ప్రచురించిన సంగతి తెలిసిందే.. అవి అందుబాటులో లేని సందర్భంగా, ఈమని శివనాగిరెడ్డి, కొండా శ్రీనివాసులు సంకలన పరచిన ఈ పాటల్ని, వాటి ప్రాముఖ్యత దృష్ట్యా, ఆం.ప్ర. సృజనాత్మకత & సంస్కృతి సమితి, సీఈఓ, డా.దీర్ఘాసి విజయభాస్కర్ సంపాదకత్వంలో మళ్లీ ముద్రణకు నోచుకోవటం, గిడుగులకు గొడుగు పట్టడంలాంటిదే.

– పాములపాటి శ్రీనాధ్‌రెడ్డి
9441364115

సవరల పూజపాటలు పొడుపు కథలు : లోకోక్తులు



పదేళ్లక్రితం, సవరలతో తిరిగి, వారి సృజనకు పట్టం కట్టిన పూజ పాటలు, పొడుపు కథలు, లోకోక్తులను సేకరించారు. కీ.శే. గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు. సవర సాంగ్స్ పేరిట ప్రచురించిన ఆ పుస్తకంలోని పాటల్ని, ఆయన కుమారుడు గిడుగు వెంకట సీతాపతి, 1938 భారతిలో సవర, తెలుగు భాషల్లో ప్రచురించారు. ప్రకృతి, ఆచార వ్యవహారాలపై అలవోగా అల్లిన సవర పాటల్ని, చదురోక్తులుగా సాగిన లోకోక్తులు, ఎదుటివారి తెలివి తేటల్ని తట్టిలేపే పొడుపు కథల్ని, ఈతరం తెలుసుకోవటానికిగాను ఆం.ప్ర. సృజనాత్మకత & సంస్కృతి సమితి మళ్లీ ముంద్రించటం ఆనందించదగ్గ విషయం. దేశతలు, దెయ్యాలు, అంత్యక్రియల పాటలు, చెట్లు, చేమలూ, పనీ పాటులు, పనిముట్లకు సంబంధించిన వారి ఆలోచనా శక్తిని అంచనా వేయటానికి, ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందనటంలో సందేహం లేదు.

– సుభాకర్ మేడసాని
9553245555

పై రెండు పుస్తకాల రచన–గిడుగు వెంకట సీతాపతి,
సంకలనం : ఈమని శివనాగిరెడ్డి, కొండా శ్రీనివాసులు,
సంపాదకులు : దీర్ఘాసి విజయభాస్కర్, ఒక్కొక్కటి వెల:25/-

మహాభారతం సొగసులు సూక్ష్మాలు



మహాభారతం సొగసులు – సూక్ష్మాలు
రచన : సాకం నాగరాజు
వెల : 100/-
ప్రతులకు : సాకం శశికళ, 6-1-70
వరదరాజ నగర్, తిరుపతి – 517 507
ఫోన్ : 0877-2230135

భారతంలో ఏది ఉందో అదే ఎక్కడైనా ఉంది. ఇందులో లేనిది మరెక్కడా లేదు. ('యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి నతత్ క్వచిత్') అని వ్యాస భారతంలోని ఉక్తి. ఆరువేల సం॥నాటి మహాభారతంలోని పాత్రలు నేటి భారతంలో, యావత్ప్రపంచంలో నిత్యం మనకు తారసపడతాయి. ఇలాంటి మహాభారతంలోని కొన్ని ఘట్టాల లోగల సొగసులను, సూక్ష్మాలను ఈ పుస్తకంలో ముచ్చటించారు విశ్రాంత తెలుగు అధ్యాపకుడు, రచయిత సాకం నాగరాజు.

అయితే 18 పర్వాలున్న ఈ మహాభారతాన్ని ఈతరం వారికి, ముఖ్యంగా విద్యార్థులకు, గృహిణులకు భారతం గొప్పదనాన్ని రుచి చూపించి, భారతం పట్ల మక్కువ కలిగిద్దామన్న ఆశయంతో 18 భారత ఘట్టాలను ఏరి కూర్చడం జరిగింది. ఆది, సభా, ఆరణ్య, విరాటోద్యోగ, కర్ణ, స్త్రీ మరియు ఆశ్రమవాస పర్వాలలోని ఘట్టాలను ఎంచుకున్నారు రచయిత. శకుంతలోపాఖ్యానం, ఏకలవ్యుడి విలువిద్య, నలదమయంతుల ప్రేమతత్వం, కవికాల ప్రభావం, కీచకుడి కాముకత్వం, సంజయుని మాట చాతుర్యం, ద్రౌపదీ పరిదేవనము, కర్ణుడి ఔన్నత్యం, గాంధారి విలాపం – యిలా ప్రధాన ఘట్టాలు కాగా మిగతావి కూడ విషయ ప్రధానం ఉన్నవే! అన్నీ అధ్యాయాలలోను కథను, పాత్రల విశిష్టతను తెలియజేస్తూ సంక్షిప్తంగా పేర్కొనడం ఆసక్తికరంగా సాగింది.

మరొక విశేషం – ప్రతి అధ్యాయానికి ముందు కొంత పూర్వ రంగం చెప్పి కథలోకి ప్రవేశింపచేసారు రచయిత. అంతే కాకుండా అధ్యాయం చివర కొంత వివరణ, సందేశం, ఈ తరానికి అన్వయించేలా కొంత ఉపదేశాత్మకంగాను సమాచారం ఇవ్వడం విశేషంగా చెప్పవచ్చు.

భారతంలోని మానవీయకోణం, జీవితంలో నేర్పదగిన పాఠాలుగల ఘట్టాలను సరశీవచనంలో చెప్పడంలో రచయిత కృతకృత్యుడు అయినట్లు అనిపిస్తుంది. ఈ విధంగా భారతంలోని కొన్ని ఘట్టాలను ఈ తరం వారికి పరిచయం చేసి జీవిత పాఠాలను నేటి తరానికి పరి చయం చేయాలన్న సంకల్పంతో ఈ పుస్తక రచన సాగింది. విద్యార్థుల చూపు పుస్తకాల వైపు మళ్లించడానికి, వారికి పుస్తక పఠనం అలవాటు చేయాలని చాల పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా బహుమతిగా పంచిపెట్టిన ఖ్యాతిగల ఆదర్శ ఉపాధ్యాయుడు సాకం నాగరాజు. తన పుస్తకం ద్వారా ఈ తరం వారికి అర్థం అయ్యేటట్లుగా – ఉపాధ్యాయుడు తరగతిలో పాఠాలు చెప్పినట్లుగా–సందేశాత్మకంగా, నీతిబోధకంగా భారతంలోని ముఖ్య అంశాలను స్థూలంగా చెప్పే మంచి ప్రయత్నం చేసారు రచయిత. నాగరాజు కృషి అభినందనీయం.

– ఎం.వి.శాస్త్రి
9441342999

పుస్తక సమీక్ష

అమరజీవి బలిదానం

పొట్టిశ్రీరాములు పోరాటగాధ



సంపాదకత్వం : డా॥ నాగసూరి వేణుగోపాల్
వెల: 200/-
ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి.

యద్దనపూడి సులోచనారాణి నవలా నాయకునిలా స్ఫురద్రూపి కానివాడు. వివేకానందుని వలె గంభీర ఉపన్యాసకుడు కానివాడు. మహాత్మాగాంధీవలె జనాకర్షకుడు కానివాడు, టాటా, బిర్లాల వలె కోటీశ్వరుడుగానివాడు, ఒంటిమీద జత, ఉతకటానికి మరోజత తప్ప వేరే బట్టలు లేనివాడు-నూలు వడికే తకిలీ మాత్రమే ఆస్తిగా కలవాడు, జీవితాంతం సత్యవ్రతదీక్షను గురువుకంటే అధికంగా పాటించినవాడు, తన ఉపవాస దీక్షతో నెహ్రూ ప్రభుత్వాన్ని గడగడలాడించటమేకాక, యావత్తు ఆంధ్ర ప్రజానీకాన్ని ఒక త్రాటిపైకి తెచ్చినవాడు, అసువులు బాసిన తర్వాత ఆంధ్ర రాష్ట్రాన్ని తెలుగువారికి కానుకగా ఇచ్చినవాడు, ఆంధ్రజాతి ఆయన జయంతులు వర్ధంతులు మరచిపోయినవాడు - ఎవరయ్యావాడు, ఇంకెవరు శ్రీ పొట్టి శ్రీరాములు.

సత్యానికి తావులేకపోతే నాకు కూడా ఈ ప్రపంచంలో తావు లేదని చెప్పిన సత్యవ్రతుడు. ఏ విధమైన భేషజాలు లేని అసలు సిసలైన అచ్చమైన ప్రజల మనిషి శ్రీరాములు.

డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో 'అమర జీవి బలిదానం - పొట్టిశ్రీరాములు పోరాటగాధ' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ప్రచురించి విడుదల చేసింది. వైయస్ శాస్త్రి, బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు వ్రాసిన 'అమరజీవి సమరగాధ', వైయస్ శాస్త్రి, సుబ్బరాయగుప్త పంతులుగారి 'మదరాసు తెలుగునగరం' - నివేదిక, వై యస్ శాస్త్రిగారు సంకలనం చేసిన 'భాషా ప్రయుక్త రాష్ట్ర విధాత అమరజీవి (స్మారకోపన్యాసములు) పుస్తకాలేకాక మహర్షి బులుసు సాంబమూర్తి, జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్, జస్టిస్ ఆవుల సాంబశివరావు, ప్రముఖ పాత్రికేయులు యంజె అక్బర్, రామచంద్ర గుహ గార్ల వ్యాసాలు పొందు పర్చారు. అనుబంధం 1లో శ్రీ పొట్టి శ్రీరాములుగారు దీక్ష గురించి జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, విజ్ఞాపనలు, నివేదికలు పొందుపరిచారు.

ఇరవైయ్యవ శతాబ్ద ప్రారంభంలో మార్చి 16 - 1901న అత్యంత సాధారణ ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన శ్రీ పొట్టి శ్రీరాములుగారు కనిగిరి దగ్గర పడమటి పల్లె అనే కుగ్రామంలో జన్మించారు. శానిటరీ ఇంజనీరింగ్ ప్లంబింగ్ లో డిప్లమా చదివారు. నేటి సెంట్రల్ రైల్వేలో బొంబాయిలో అసిస్టెంట్ ప్లంబర్‌గా పనిచేశారు. గాంధీభార్య మరణానంతరం గాంధీగారి చేత ఆకర్షితులై ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నారు. బీహార్ భూకంప బాధితులకు పదినెలలు సేవలిందించారు. తర్వాత జీవితాంతం పూర్తిగా గాంధీ మార్గాన్ని అనుసరించారు.

పుస్తకం రెండవ భాగంలో పొట్టి శ్రీరాములు చివరి నిరాహార దీక్ష రాజకీయ పరిణామాల గురించిన వివరాలున్నాయి. నిజమైన ఆమరణ నిరాహార దీక్ష ఎలా ఉంటుందో కళ్లకు కట్టినట్లు వివరించారు. శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన ఐదు ప్రధాన నిరాహార దీక్షలలో మూడు హరిజన (దళిత) ఆలయ ప్రవేశం కోసం చేసినవే. ఆయన దీక్ష ఫలితంగానే జనవరి 30వ తేదీ సేవాదినం / సర్వోదయ దినంగా ప్రభుత్వం ప్రకటించింది. చివరి నిరశన 1952 అక్టోబరు 19న ప్రారంభమై డిశంబరు 15 -1952 రాత్రి 11.20 ని॥లకు వారి ఆత్మార్పణతో ముగిసింది. 'ప్రధాని నెహ్రూ బ్రతికి ఉన్న శ్రీరాములును నిరాదరించి ఆత్మార్పణ చేసిన శ్రీరాములుకు దాసోహం అన్నాడు' అంటారు జస్టిస్ కృష్ణయ్యర్ తమ వ్యాసంలో...

'ఒక గాంధేయుడు' ఏమి సాధించగలడో నెహ్రూ తాత్కాలికంగా విస్మరించాడు' అంటారు ప్రముఖ పాత్రికేయుడు యం.జె.అక్బర్. వినోభా భావేతోపాటు గాంధేయ వాదులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. పొట్టి శ్రీరాములు ప్రాణాన్ని బలితీసుకున్న నెహ్రూ ఉదాసీనతను శ్యామప్రసాద్ ముఖర్జీ ఖండించారు.

భాషా సాంస్కృతిక వ్యవహారాల ప్రాతిపదికగా రాష్ట్రాలను ఏర్పరచినట్లయితే తద్వారా జాతీయభావం పెంపొందుతుంది. ఫెడరల్ విధానం పరిఢవిల్లుతుందని నిరూపించటం పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగంలోని అర్థం అంటారు జస్టిస్ కృష్ణయ్యర్. భాషా ప్రయుక్త రాష్ట్రాలు కోరటం మూర్ఖ అనాగరిక ధోరణి అన్నది నెహ్రూ, రాజగోపాలాచారిల అభిప్రాయం.

శ్రీరాములుగారి దీక్ష ప్రధానంగా ఆంధ్రరాష్ట్రంకోసం కాదు. మద్రాసు ఆంధ్రరాష్ట్రంలో కలిసిపోవాలని అంటారు జస్టిస్ ఆవుల సాంబశివరావు. మద్రాసులేని రాష్ట్రం తలలేని మొండెం వంటిదని శ్రీరాములుగారి భావన. భాషాప్రయుక్త రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చింది పొట్టి శ్రీరాములే. సత్యవ్రత దీక్షలోని పదకొండు సూత్రాలను తు.చ. తప్పకుండా ఆచరించి చూపినవాడు. గాంధీ కంటే గాంధీయిజం గొప్పదని నిరూపించినవాడు శ్రీ శ్రీరాములు.


అహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్య మసంగ్రహః
శరీరశ్రమా స్వాదో సర్వత్ర భయవర్జనమ్
సర్వధర్మ సమానత్వే స్వదేశీ స్పర్శ భావనా
ఇత్యేకాదశ సేవాస్తే నమ్రత్వే వ్రత నిశ్చయమ్

ప్రతి సూత్రానికి పొట్టి శ్రీరాములు జీవితం నుండి ఒక ఉదాహరణనిచ్చారు ఈ పుస్తకంలో. అమరజీవి గురించిన వివరాలతో పాటు రాజకీయ నాయకుల స్వార్థపూరిత వ్యవహారిక శైలిని కూడా ఈ పుస్తకంలో వివరించారు. ముఖచిత్రంలో ప్రకటించినట్లుగా ఇది అమూల్య చారిత్రక అంశాల సంకలనం. తెలుగువారి పట్టుదల గురించి తెలుసుకోవాలనుకునే ప్రతి తెలుగుబిడ్డ తప్పనిసరిగా చదవవలసిన పుస్తకం

వింజనంపాటి రాఘవరావు

అర్ధతాత్పర్యాలతో ఆంధ్రపురాణ ప్రచురణ

సన్నిధానం 'మధుస్మృతి' ఆవిష్కరణ సభలో శ్రీ అప్పాజోస్యుల ప్రకటన



మహాకవి మధునాపంతుల శతజయంతి సంవత్సర భాగంగా జులై 28 సాయంకాలం రాజమహేంద్రవరంలో ఆనం రోటరీ హాల్లో 'అరోధృతి' ఆధ్వర్యాన సన్నిధానం నరసింహశర్మ రాసిన 'మధుస్మృతి' ఆవిష్కరణోత్సవ సభ జరిగింది.

మధుస్మృతిని అజోవిభో కందాళం ఫౌండేషను ప్రచురించింది. మధునాపంతుల ప్రియ శిష్యుడు సన్నిధానం మధునా పంతుల వారి కాలీన సాహితీ వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ఆనాటి సాహితీ దిగ్గజాలతో శాస్త్రిగారి సాహిత్య స్మృతుల్ని గ్రంథస్థం చేసిన ఈ పుస్తక ఆవిష్కరణ సభకు అంతర్జాతీయ ప్రఖ్యాతినందిన కంప్యూ టర్ విజ్ఞానవేత్త, విద్వత్కవి ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

శ్రీ సత్యనారాయణ తమ ప్రసంగంలో కాలగమనంలో అనేక మంది గొప్ప కవులు వస్తూంటారని, కాని రససిద్ధులైన కవులు కొంత మందే వుంటారని, అందులో ఆంధ్రుల చరిత్రను రసవత్తరమైన ఆంధ్రపురాణంగా తీర్చిన శాస్త్రిగారు ముఖ్యులని, అయితే ఆంధ్ర పురాణ కావ్యం మరింతగా రసజ్ఞ జనాలకు అందాలని, అందుచేత ఆంధ్ర పురాణాన్ని అర్ధ తాత్పర్యాలతోను సమర్థులైన పండిత సాహితీవేత్తలచే వ్రాయింపజేసి ప్రకటించాలని తాము నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. గురువుచేత తమ 'అనుగుశిష్యు'డని ఆశీర్వదించబడిన సన్నిధానం నరసింహశర్మ తాము కోరగా రెండు నెలల వ్యవధిలో పుస్తకాన్ని చక్కగా రాసిచ్చినందుకు ఆనందం వ్యక్తం చేశారు, మధుస్మృతిలో అనేక సంఘటనలు ఆసక్తికరంగా రాశారన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ విద్వత్కవి, క్రొత్త గోదావరి కవి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మధుస్మృతిలో సన్నిధానం రచనలోని తీసుకున్న మెలకువలు, ఇచ్చిన చమత్కారాలు, సున్నితంగా విమర్శించిన సందర్భాలు వంటివి వివరించి ఆంధ్ర పురాణాన్ని ఆరాధించిన వ్యక్తి శ్రీ శర్మ అన్నారు. ఆ గ్రంధానికి అర్ధ తాత్పర్యాలు సంతరించడానికి ఆయన అర్హుడన్నారు. కొంతమంది పండితుల సహభాగస్వామ్యం కూడా వుండాలన్నారు.

ప్రఖ్యాత కవి శ్రీ రసరాజు శ్రీ శర్మ పై మధునాపంతులు రాసిన మనోహర పద్యాలకు విశేషార్థాలు తెలిపారు. గౌతమినది ప్రవహిస్తుందని, కాని సమీపంలోని గౌతమి గ్రంథాలయం అక్కడే వుండి అందర్నీ కదుపుతుంది, కుదుపుతుందని ఆ రెండు గౌతముల బిడ్డ సన్నిధానమనే భావంతో పద్యాలు రాసిన తీరు చదివారు.

మధునాపంతుల సూరయ్యశాస్త్రి పుత్రులు, కవి మధునా పంతుల సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మధునాపంతుల ఆస్తికి తాము హక్కుదారులమన్నారు. మధుస్మృతి మరచిపోలేని సాహిత్య గ్రంథమన్నారు. సామాజిక కార్యకర్త శ్రీ పట్టపగలు వెంకటరావు తాము వావిలాల లిటరరీ రోటరీ పురస్కారాన్ని చేత సన్నిధానానికి ఇచ్చిన సంఘటన వంటివి తెలియజేశారు. శ్రీయుతులు గరికపాటి, శ్రీ సామల రమేష్‌బాబు సందేశాలను సన్నిధానం చదివారు.

శ్రీ ఎర్రాప్రగడ రామకృష్ణ తొలుత స్వాగతం పలికారు.. శ్రీమతి మేడపాటి షర్మిలారెడ్డి జ్యోతి వెలిగించారు. శాస్త్రిగారి పుత్రులు రచయిత శ్రీ మధునామూర్తి తమ తండ్రిగారి పట్టి, ఆయన సాహిత్యం శతజయంతి సంవత్సరంలో సభల మూలంగా వ్యక్తమవుతున్న అభిమానానికి పులకిస్తున్నామన్నారు. అరోధృతి సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీమతి కోసు చండీప్రియ వేదికపైని అలంకరించిన వార్ని సత్కరించారు.

కాకినాడ, రాజోలు తణుకువంటి ఇతర ప్రాంతాల నుండి సాహితీవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సంస్కృతాన్ని అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

తెలుగు నేలపైన మాతృభాషల పరిరక్షణ, అభివృద్ధి, ఆధునీకరణ లక్ష్యంగా

4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

ప్రపంచ తెలుగు రచయితల సంఘం

ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో, కృష్ణాజిల్లా రచయితల సంఘం సహకారంతో, 2019 డిసెంబర్ 27, 28, 29 తేదీలలో విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాలలో 4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు జరగబోతున్నాయి.

2019వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ మాతృభాషల పరిరక్షణ సంవత్సరం' (international Year of Indigenous Languages) గా ప్రకటించిన నేపథ్యంలో మాతృభాషల పరిరక్షణ వైపు దృష్టి సారించవలసిందిగా అటు తెలుగు ప్రభుత్వాలు ఇటు తెలుగు ప్రజల గుండె తలుపులు తట్టే లక్ష్యంతో 2019 డిసెంబరు 27, 28, 29 తేదీలలో విజయవాడ సిద్ధార్థ కళాశాలలో ఈ 4వ మహాసభలు జరుగుతున్నాయి. మాతృభాషల పరిరక్షణ, అభివృద్ధి, ఆధునీకరణ ఈ మహాసభల ప్రధాన ధ్యేయం.

ఈ మహాసభలలో ముఖ్య చర్చనీయాంశాలు

→ తెలుగువారి భాషా సంస్కృతులు, చరిత్ర, మరియు సాంకేతిక ప్రగతికి కేంద్రం మరియు రెండు రాష్ట్రప్రభుత్వాలు బాధ్యత వహించేలా నూతన విధాన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం గురించి...

→ తెలుగు నేలపైన అన్ని విశ్వవిద్యాలయాల పరిథిలో నివసిస్తున్న వివిధజాతుల మాతృభాషల పరిరక్షణకోసం ప్రత్యేకంగా "మాతృభాషల పీఠాలు" ఏర్పరచి నిధులు సమకూర్చటం గురించి...

→ తెలుగు మరియు ఇతర మాతృభాషల అభివృద్ధికి పాటుపడేందుకు స్పష్టమైన అధికారాలతో రెండు రాష్ట్రాల్లోనూ తెలుగు ప్రాధికార సంస్థల నిర్మాణం, వాటి విధి విధానాల గురించి..

→ అనేక రాష్ట్రాలలో అధికారభాషగా ఉన్న హిందీ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలనే తెలుగుభాష విషయంలోనూ అనుసరింప చేయటానికి అవకాశాల గురించి...

→ రేపటి అవసరాల ప్రాతిపదికగా తెలుగు భాషాబోధన, పాఠ్యాంశాల రూపకల్పనగురించి...

→ ఆధునిక సాంకేతిక రంగంలో తెలుగు వినియోగం, యూనికోడ్, పదకోశాల అభివృద్ధి గురించీ...

→ తెలుగు విద్యార్థులకు, అధ్యాపకులకు ప్రోత్సాహకాల గురించి...

→ తమిళనాడు, ఒడిసా, కర్ణాటక, బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో జీవిస్తున్న తెలుగువారి జీవనం, తెలుగు భాషా సంస్కృతులను కాపాడుకోవటంలో సమస్యలు...

→ తెలుగేతర ప్రాంతాల్లో జీవిస్తున్న తెలుగు వారికి హిందీ మాదిరే ప్రాథమిక, మాధ్యమిక పద్ధతిలో సర్టిఫికెట్ కోర్సుల నిర్వహణ గురించి...

→ యేళ్ల తరబడీ నిరాదరణకు గురౌతున్న గ్రంథాలయ వ్యవస్థను పటిష్ఠపరచటం గురించి,

→ గత ఐదేళ్లుగా ఆగిపోయిన సాహితీ గ్రంథాల కొనుగోళ్ల గురించి...

మహాసభల ప్రతినిధులకు సూచనలు

ప్రతినిధులుగా పాల్గొనేవారు ఈ మహాసభల కోసం రూ.500/- చెల్లించవలసి ఉంటుంది. చివరి తేదీ : 31-10-2019.

ప్రపంచ తెలుగు రచయితల సంఘం జీవితసభ్యులుగా చేరిన వారు అదనంగా ఈ ప్రతినిధి రుసుము చెల్లించనవసరం లేదు. ప్రతినిధి రుసుమునుగానీ, జీవిత సభ్యత్వాన్ని గానీ డి.డి. లేదా చెక్కు రూపేణా PRAPANCHA TELUGU RACHAYITALA SANGHAM పేర, విజయవాడలో చెల్లించే విధంగా వ్రాసి, కార్యదర్శి, ప్రపంచ తెలుగు రచయితలసంఘం, 1వ అంతస్థు, సత్నాం టవర్స్, బకింగ్‌హాం పేట పోస్టాఫీసు ఎదురుగా, గవర్నర్ పేట, విజయవాడ- 520002 చిరునామాకు పంపండి.

జీవిత సభ్యులకు, ప్రతినిధులకు మాత్రమే ఈ మహాసభల ప్రాంగణంలో భోజన, ఉపాహారాలుంటాయి. వసతి ఏర్పాట్లు మాత్రం ఎవరికి వారే చేసుకోవలసి ఉంటుంది.

మహాసభల సమాచారాన్ని మీ సాహితీ మిత్రులకూ తెలుపండి. రచయితలు, భాషాభిమానులు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మహాసభలు విజయవంతం కావటానికి సహకరించండి.

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గౌరవాధ్యక్షులుగా, శ్రీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ గౌ॥ కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉన్న ప్రపంచ తెలుగు రచయితల సంఘం వివరాల కోసం http://www.prapanchatelugu.com వెబ్ సైట్ చూడగలరు. మీ సమా చారాన్ని ఇ-మెయిల్: prapanchatelugu@gmail.com కు పంప వచ్చు. శ్రీ గుత్తికొండ సుబ్బారావు, అధ్యక్షుడు 9440167697, డా.జి.వి. పూర్ణచందు, కార్యదర్శి 9440172642లతో సంప్రదించవచ్చు.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

విద్యారంగ కృషీవలుడు డా॥ నన్నూరి ఉపేందర్‌రెడ్డిగారికి









డా॥ చుక్కారామయ్య ఫౌండేషన్ వ్యాస పురస్కారం

జులై 16న హైదరాబాదులో - తెలుగు విశ్వవిద్యాలయంలో ఒక చిరస్మరణీయమైన సభ జరిగింది. విద్యారంగంలో విశిష్ట కృషి చేసిన, చేస్తున్న డా॥ నన్నూరి ఉపేందర్‌రెడ్డిగారిని డా॥ చుక్కారామయ్య ఫౌండేషన్‌వారు 'వ్యాస పురస్కారం'తో సత్కరించారు. ఆ రోజు గురుపూర్ణిమ. విద్యారంగంలో శాశ్వత ఖ్యాతినార్జించిన డా॥ చుక్కారామయ్యగారి పేర ఏర్పడిన 'ఫౌండేషన్' అధ్యక్షులు డా॥ కె. రామచంద్రమూర్తి, కార్యదర్శి కె. లక్ష్మారెడ్డి, లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. లక్ష లాది రూపాయల నగదు బహుమతితో పాటు, ప్రశంసాపత్రం, శాలువా, పుష్ప మాలలతో ఉపేందర్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. తొంబది మూడేండ్ల ప్రాయంలో డా॥ చుక్కారామయ్యగారు ఈ సందర్భంగా నిలబడి చేసిన ప్రసంగాన్ని సభికులందరూ ఆసక్తితో విన్నారు.

రామయ్యగారి ప్రసంగంతోపాటు, ముఖ్య అతిథిగా సభలో పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి డా॥బి. జనార్ధన రెడ్డి ఐ.ఎ.ఎస్., శ్రీ జి. కిషన్, ఐ.ఎ.ఎస్.ల ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత డా॥ ఉపేందర్ రెడ్డి చేసిన ప్రసంగంలో విద్యారంగానికి సంబంధించి ప్రజలందరూ తెలుసుకోదగిన ఎన్నో అంశాలను వెలికితెచ్చారు. ఈ ప్రసంగాలను ఫౌండేషన్‌వారు ఒక పుస్తకంగా తెస్తే బాగుంటుందని కొందరు సభికుల అభిప్రాయం.

ఈ సందర్భంలో ఫౌండేషన్‌కు ఆదర్శమూర్తి డా॥ చుక్కారామయ్యగారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ అధ్యక్షులు డా॥ కె.రామచంద్రమూర్తిగారు సభకు అధ్యక్షత వహించగా, వందేమాతరం ఫౌండేషన్ రవీందర్ కార్యక్రమాన్ని ప్రముఖంగా నిర్వహించారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
August 2019 Vol :5, Issue 6

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244